మా అక్షరాలు - నిజాల నిప్పుకణికలు

# ప్రజా మంటలు

సంపుటి : 5 పేజీలు - 8
సంచిక : 91 వెల - రూ 5:00

తెలంగాణ జాతీయ దినపత్రిక

Email: prajamantalu@gmail.com www.prajamantalu.com ఎడిటర్: సిహెచ్.వి. ప్రభాకర్ రావు

Published From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnag Medak,Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla,Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yad



## లీకేజీల నీట్ మాకొద్దు

- పరీక్ష రద్దు కోరుతూ తమిళనాడు అసెంబ్లీ ఏకగ్రీవ తీర్మానం

చెన్నై (ప్రజా మంటలు): వైద్య విద్యా సంస్థల్లో ప్రవేశాలకు నిర్వహించే జాతీయస్థాయి అర్హత, ప్రవేశ పరీక్ష నీట్ పేపర్ లీక్‌పై దేశ వ్యాప్తంగా ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. శుక్రవారం పార్లమెంట్‌ను ఈ అంశం కుదిపేసింది. ఈ నేపథ్యంలో నీట్ రద్దు చేయాలంటూ తమిళనాడు అసెంబ్లీ ఏకగ్రీవ తీర్మానాన్ని ఆమోదించింది. నీట్‌ను రద్దు చేయాలని, నీట్ అమలుకు ముందు మాదిరిగా 12వ తరగతి మార్కుల ఆధారంగా మెడికల్ అడ్మిషన్లు చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వాలను అనుమతించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. కాగా, నీట్-యూజీ 2024 ఎగ్జామ్ పేపర్ లీక్, నీట్-పీజీ 2024 పరీక్షను ఆకస్మికంగా వాయిదా వేయడంపై అభ్యర్థుల్లో గందరగోళం నెలకొన్నది. ఈ తరుణంలో తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ శుక్రవారం నీట్ రద్దు తీర్మానాన్ని అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. మణితనేయ మక్కల్ కట్చి, మరుమలార్చి ద్రవిడ మున్నేట్ర కజగం, తమిళగ వెట్రి కజగం, కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (మార్క్సిస్ట్) సహా పలు ప్రాంతీయ

## నీట్‌పై అట్టుడికిన లోక్‌సభ





- చర్చకు ఇండియా కూటమి పట్టు
- వాయిదాలతో మొదలైన సభ
- చర్చ కోరుతూ వాయిదా తీర్మానం ఇచ్చిన కాంగ్రెస్
- తిరస్కరించిన స్పీకర్ ఓంబిర్లా..
- గందరగోళం మధ్య జూలై1కి వాయిదా

న్యూఢిల్లీ, (ప్రజా మంటలు): లోక్‌సభ సమావేశాలు వాయిదాలతో మొదలయ్యాయి. నీట్‌పేపర్ లీక్‌పై చర్చించాలన్న విపక్షాల డిమాండ్ కారణంగా గందరగోళం మధ్య లోక్‌సభ సోమవారానికి వాయిదా పడింది. సాధారణ సమావేశాలు శుక్రవారం ప్రారంభం కాగానే నీట్ పేపర్ లీకేజీపై చర్చకు విపక్షనేత రాహుల్ గాంధీ వాయిదా తీర్మానం ఇచ్చారు. విద్యార్థుల భవిష్యత్‌పై చర్చించాల్సి ఉందని, వారికి పార్లమెంట్ భరోసా ఇవ్వాల్సి ఉందని అన్నారు. అయితే నిబంధనల మేరకు రాష్ట్రపతి ప్రసంగంపై చర్చ ప్రారంభించాల్సి ఉన్నందున, అందులో ప్రస్తావించాలని స్పీకర్ ఓంబిర్లా సూచించారు. లేదా మరో తరహాలో చర్చకు అనుమతిస్తామని చెప్పారు. అయితే విపక్ష సభ్యులు అందుకు నిరాకరించారు. నీట్‌పై చర్చ చేయాల్సిందే నని పట్టుబట్టారు. నినాదలతో గందరగోళ పరిచే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో స్పీకర్ ఓంబిర్లా సభను మధ్యాహ్నం 12గంటలకు వాయిదా వేశారు. పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో 'నీట్ పేపర్ లీక్ వ్యవహారం దుమారం రేపుతోంది. దీనిపై చర్చ జరపాలని విపక్షాలు డిమాండ్ చేయడంతో లోక్‌సభ, రాజ్యసభల్లో శుక్రవారం గందరగోళ వాతావరణం నెలకొంది. ప్రతిపక్షాల ఆందోళనలతో లోక్‌సభ సోమవారానికి వాయిదా పడింది. ఉదయం 11 గంటలకు లోక్‌సభ ప్రారంభం కాగానే ఇటీవల మృతిచెందిన పలువురు రాజకీయ ప్రముఖులకు సభ సంతాపం ప్రకటించింది. మిగతా 2లో..

## పాస్‌బుక్కే కీలకం

### రుణమాఫీపై మార్గదర్శకాలు విడుదల చేస్తాం



- వివరాలు నాలుగు రోజుల్లో ప్రకటిస్తాం
- రేషన్‌కార్డు ఆధారంగా మాఫీ ఉండదు
- బంగారం తాకట్టు రుణాలకు మాఫీ వర్తించదు
- కేసీఆర్ చేసిన తప్పులు మేం చేయబోం
- చేరికలు అంతటా జరుగుతూనే ఉన్నాయి
- కులగణన చేపట్టి తీరుతాం
- మీడియాలో సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి

న్యూఢిల్లీ, (ప్రజా మంటలు): తెలంగాణ సార్వత్రిక ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం రైతు రుణమాఫీకి రేవంత్ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఆగస్టు-15 లోగా ఈ హామీని నెరవేరుస్తానని పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా మాటిచ్చిన సంగతి తెలిసిందే. ఇందుకు సంబంధించి పక్రియ కూడా దాదాపు మొదలైంది. ఢిల్లీ పర్యటనలో బిజిబిజీగా ఉన్న సీఎం రేవంత్ రెడ్డి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రుణమాఫీ ప్రస్తావన వచ్చింది. దీనిపై మాట్లాడిన సీఎం.. రుణమాఫీపై నాలుగు రోజుల్లో మార్గదర్శకాలు విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. పంట రుణాల మాఫీకి రేషన్ కార్డు ప్రామాణికం కాదని.. అది కుటుంబాన్ని గుర్తించడం కోసం మాత్రమేనని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. రూ. 2 లక్షల వరకు మాత్రమే రుణమాఫీ ఉంటుందని.. మరోసారి స్పష్టం చేశారు. బంగారం తాకట్టు పెట్టి తీసుకున్న రుణాలు మాఫీ కావని కూడా సీఎం చెప్పేశారు. పాస్ బుక్ ఆధారంగానే రుణ మాఫీ ఉంటుందని రేవంత్ రెడ్డి తేల్చి చెప్పారు. ఈ క్రమంలో రుణమాఫీకి నాలుగు రోజుల్లో మార్గదర్శకాలు విడుదల చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఇందుకు రేషన్ కార్డు ప్రామాణికం కాదని స్పష్టం చేశారు. రైతు మిగతా 2లో..

## పోయేవాళ్లు పోతేపోని.. - కేసీఆర్



హైదరాబాద్, (ప్రజా మంటలు): పార్టీని వీడి దొంగల్లో కలిసిన వారి గురించి బాధలేదని.. అంతకన్నా మెరుగైన, మెరకల్లాంటి యువ నాయకులను పార్టీ సృష్టిస్తుందని భారాస అధినేత, మాజీ సీఎం కేసీఆర్ అన్నారు. ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో మిగతా 2లో..

## అధిష్టాన నిర్ణయమే ఫైనల్

- మంత్రివర్గ విస్తరణ, పీసీసీచీఫ్ పదవిపై సీఎం రేవంత్‌రెడ్డి

## హేమంత్‌కు సోరెన్‌కు ఊరట

- బెయిల్ మంజూరు చేసిన ఆ రాష్ట్ర హైకోర్టు
- తప్పుడు కేసుల్లో ఇరికించారని మాజీ సీఎం విమర్శలు 2లో..



## మైనారిటీలపై దాడులు తగవు

భారత్‌లో మతస్వేచ్ఛపై అమెరికా ఆందోళన - భారత్‌లో తీసుకొస్తున్న మాతమార్పిడి నిషేధ చట్టాలు మరింత విద్వేషాలు కలిగిస్తాయి - ఖండించిన భారత్



వాషింగ్టన్ (ప్రజా మంటలు): భారత్‌లో తీసుకొస్తున్న మతమార్పిడి నిషేధ చట్టాలు, విద్వేష వ్యాఖ్యలు మరింత ఆందోళన కలిగిస్తున్నాయని అమెరికా వ్యాఖ్యానించింది. మైనారిటీలకు సంబంధించిన ఇళ్లను, ప్రార్థనా స్థలాలను కూల్చివేయడమూ ఇబ్బందికరమేనని అభిప్రాయపడింది. అంతర్జాతీయ మత స్వేచ్ఛపై బుధవారం నివేదిక విడుదల చేసిన సందర్భంగా అమెరికా విదేశాంగశాఖ మంత్రి ఆంటోనీ బ్లింకెన్ ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రపంచ వ్యాప్తంగా మత స్వేచ్ఛ కోసం పలువురు పని చేస్తున్నారని తెలిపారు.'భారత్‌లోని 28 రాష్ట్రాల్లో 10 రాష్ట్రాలు మత మార్పిడి నిషేధిస్తూ చట్టాలు చేశాయి. ఇందులో కొన్ని బలవంతపు మత మార్పిడికి పాల్పడితే భారీ జరిమానాలను విధిస్తున్నాయి. దీనిపై అమెరికా అధికారులు ఎప్పటికప్పుడు భారత్ అధికారులతో మాట్లాడి ఆందోళన వ్యక్తం చేస్తూనే ఉన్నారు' అని అంతర్జాతీయ మత స్వేచ్ఛపై విడుదల చేసిన 2023 నివేదిక పేర్కొంది. తమ దేశంలో జరిగిన ఖలిస్థాన్ వేర్పాటువాది గురుపత్వంత్ సింగ్ పన్ను హత్య కేసులో భారత్ దర్యాప్తు ఫలితాల కోసం ఎదురు చూస్తున్నామని అమెరికా పేర్కొంది. ఈ హత్యలో భారత్‌కు చెందిన నిఖిల్ గుప్తా ప్రమేయముందని అమెరికా అధికారులు గత నవంబరులో అభియోగాలు మోపారు. గత ఏడాది జూన్‌లో చెక్ రిపబ్లిక్‌లో నిఖిల్‌ను అరెస్టు చేసి అమెరికాకు తీసుకొచ్చారు. 'ఈ కేసులో విచారణ జరుపుతున్నామని భారత్ అధికారులు తెలిపారు. ఆ ఫలితాల కోసం ఎదురు చూస్తున్నాం' అని అమెరికా విదేశాంగశాఖ అధికార ప్రతినిధి బుధవారం వాషింగ్టన్‌లో వ్యాఖ్యానించారు. భారత్, అమెరికా సంబంధాలు గతంలో ఎన్నడూ లేనంత అత్యుత్తమంగా ఉన్నాయని, అవి మరింత విస్తృతమవుతున్నాయని భారత్‌లోని అమెరికా రాయబారి ఎరిక్ గార్సెట్టీ పేర్కొన్నారు. గతంలో ఎన్నడూ ఇంత దగ్గరగా రెండు దేశాలు లేవని, అమెరికాలో భారతీయులు 1.5 శాతం ఉన్నారని, వారు దేశ పన్నుల్లో 6శాతం చెల్లిస్తున్నారని తెలిపారు. అమెరికాలో భారతీయులు అత్యంత మిగతా 2లో..




## బీఆర్ఎస్‌కు మరో షాక్

- కాంగ్రెస్‌లో చేరిన చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య
- కండువా కప్పి ఆహ్వానించిన సీఎం రేవంత్ రెడ్డి
- అభివృద్ధి కోసమే కాంగ్రెస్‌లో చేరారని వెల్లడి


న్యూఢిల్లీ (ప్రజా మంటలు): భారత రాష్ట్ర సమితి (భారాస)కు మరో షాక్ తగిలింది. చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య కాంగ్రెస్ పార్టీలో చేరారు. దిల్లీలో సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకొన్నారు. ఇటీవల జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్, తెలంగాణ మాజీ స్పీకర్, భారాస బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి హస్తం గూటికి చేరిన విషయం తెలిసిందే. దీంతో యాదయ్యతో కలిపి ఇప్పటివరకు ఆరుగురు భారాస ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరారు. ఈ క్రమంలో తాజాగా ఆ పార్టీ చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య కాంగ్రెస్ లో చేరారు. ఢిల్లీలో సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో ఆయన కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. సీఎం రేవంత్ ఆయనకు పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. దీంతో అసెంబ్లీలో కాంగ్రెస్ బలం 71కి చేరుకుంది. కాగా ఇప్పటికే బీఆర్ఎస్ మిగతా 2లో..

## ప్రజా నాడి




## ఢిల్లీని ముంచెత్తిన భారీ వర్షాలు

- పలు ప్రాంతాలన్నీ జలమయం
- విమానాశ్రయంలో కూలిన టెర్మినల్ కప్పు
- కారులోనే ఉన్న వ్యక్తి అక్కడిక్కడే మృతి
- పలు కార్లు ధ్వంసం...సమాయక చర్యలు ముమ్మరం
- గటనా స్థలిని పరిశీలించిన మంత్రి రామ్మోహన్ నాయుడు



న్యూఢిల్లీ, (ప్రజా మంటలు): ఢిల్లీలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ఇందిరాగాంధీ విమానాశ్రయం లోని టెర్మినల్ 1లో కొంత పైకప్పు భాగం కూప్పకూలింది. ప్రమాదంలో ఒకరు మృతి చెందగా.. 8 మంది గాయపడ్డారు. వెంటనే సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ప్రమాదంలో పైకప్పు కింది పార్క్ చేసిన అనేక వాహనాలు కూడా ధ్వంసమయ్యాయి. పైకప్పు కూలడంతో కారులోని వ్యక్తి మృతి చెందినట్లు అధికారులు తెలిపారు. ఈ ప్రమాదం కారణంగా పలు విమనాలు రద్దు చేశారు.. కాగా..ఈ ఘటనపై కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు స్పందించారు. ఢిల్లీ విమానాశ్రయంలో వ్యక్తిగతంగా తాను పర్యవేక్షిస్తున్నట్టు చెప్పారు. క్షతగాత్రులకు చికిత్స కొనసాగుతోందని అని ట్వీట్ చేశారు. టెర్మినల్-1 దగ్గర సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. మధ్యాహ్నం 2 వరకు టెర్మినల్-1 నుంచి డిపార్చర్‌కు బ్రేక్ ఇచ్చారు. పునరుద్ధరణ పనుల అనంతరం సర్వీసులను కొనసాగించనున్నారు. కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు ఎయిర్ పోర్టుకు చేరుకుని.. టెర్మినల్ రూఫ్ పడిన ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులను వివరాలు అడిగితెలుసుకున్నారు.. దీంతో వేగంగా సహాయక చర్యలు చేపట్టాలని సూచించారు. అయితే.. కూలిన టెర్మినల్ 16 ఏళ్ల క్రితం నాటిదని పేర్కొంటున్నారు. ఢిల్లీలో ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. మిగతా 2లో..

## కర్నాటకలో ఘోర రోడ్డు ప్రమాదం

ఆగివున్న లారీని ఢీకొన్న మినీ బస్సు

ప్రమాదంలో 13మంది అక్కిక్కడే మృతి

బెంగళూరు,జూన్28 (ప్రజా మంటలు): కర్నాటక రాష్ట్రం హవేరి జిల్లాలో శుక్రవారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. గుండెనహళ్లి శివారులోని పుణె-బెంగళూరు జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని మినీ బస్సు ఢీకొట్టడంతో 13 మంది చనిపోయారు. నలుగురు గాయపడడంతో వారిని ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రులలో నలుగురి పరిస్థితి విషమంగా ఉందని ఆస్పత్రి వర్గాలు వెల్లడించాయి. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. శివమొగ్గ జిల్లా భద్రావతి మిగతా 2లో..



మొదటి పేజీ తరువాయి

## ఢిల్లీని ముంచెత్తిన భారీ వర్షాలు

ప్రధాన రహదారుల్లో వర్షపు నీరు నిలిచిపోవడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ఢిల్లీ, నోయిడా, ఘజియాబాద్, ఫరీదాబాద్ సహా ఎన్‌సీఆర్‌లో ఏకధాటిగా వర్షం పడుతోంది. ఆర్కేపురం, సరితా విహార్, మునిర్కా, ఇండియా గేట్ ప్రాంతాలు తడిసి ముద్దయ్యాయి. భారీ వర్షానికి రోడ్లన్నీ జలమయమయ్యాయి. ఇళ్లలోకి వరదనీరు చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. గత రాత్రి నుంచి ఢిల్లీలో ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుంది. కుండపోతగా కురుస్తున్న వర్షంతో రహదారులన్నీ జలమయమయ్యాయి. భారీగా వరద నీరు రావడంతో లోతట్టు ప్రాంతాల్లో నీళ్లు నిలిచిపోయాయి. రోడ్లపైకి వర్షం నీళ్లు చేరడంతో కొన్ని చోట్ల ట్రాఫిక్ జామ్ అయ్యింది. వాహనాలు నెమ్మదిగా కదులుతుండడంతో వాహనదారులు ఇబ్బంది పడ్డారు. ఐతే ఉదయం నుంచి వర్షం పడుతుండడంతో వాహనదారులకు ట్రాఫిక్ కష్టాలు తప్పడం లేదు. ఈసందర్భంగా విమానయానశ్శాఖ మంత్రి రామ్మోమన్ నాయుడు మీడియాతో మాట్లాడుతూ.. ఇది చాలా తీవ్రమైన ఘటన అని వ్యాఖ్యానించారు.ఇక్కడ మీకు ఒక విషయం స్పష్టత ఇవ్వాలనుకుంటున్నాను. ఈరోజు తెల్లవారుజామున కూలినది పాత భవనంలోని పైభాగం. దానిని 2009లో ప్రారంభించారు. ప్రధాని మోదీ ప్రారంభించిన భవనం అవతలివైపు ఉందని వెల్లడించారు. కూలిన భాగంలోని కొన్ని బీమ్‌లు తుప్పుపట్టి ఉన్నాయని ప్రశ్నించగా.. 'దీని గురించి ఇప్పుడే మాట్లాడటం తొందరపాటు చర్య అవుతుంది. దీనిపై తనిఖీ చేయమని విమానాశ్రయ అధికారులను ఆదేశించాం. మంత్రిత్వ శాఖ, డీజీసీఏ విడివిడిగా దర్యాప్తు చేస్తుందని వెల్లడించారు. విమానాశ్రయంలో జరిగిన ఘటనపై కేంద్ర ప్రభుత్వంపై కాంగ్రెస్ విమర్శలు గుప్పించింది. ఆ కూలిన టెర్మినల్‌ను ఇటీవలే ప్రధాని నరేంద్రమోదీ ప్రారంభించారని హస్తం పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్ర నాయకురాలు ప్రియాంకాగాంధీ ఆరోపించారు. గత పదేళ్ల కాలంలో మోదీ ప్రభుత్వంలో చోటుచేసుకున్న అవినీతి, నేరపూరిత నిర్లక్ష్యం ఈ దుస్థితికి కారణం' అని దుయ్యబట్టారు. ఈ విమర్శలను ఉద్దేశించే కేంద్రమంత్రి బదులిచ్చారు. అదంతా తప్పుడు సమాచారం అని కొట్టిపారేశారు. కూలిపోయిన ఈ టర్మినల్ పైభాగాన్ని 2008-09 సంవత్సరంలో నిర్మించారని తెలిపారు. ఈ ఘటనపై కేంద్రమంత్రి తీవ్ర విచారం వ్యక్తంచేశారు. ప్రభుత్వం తరఫున మృతి చెందిన వ్యక్తి కుటుంబానికి రూ.20 లక్షల పరిహారం ఇవ్వనున్నట్లు ప్రకటించారు. గాయపడినవారికి ఒక్కొక్కరికి రూ.3 లక్షలు ఇస్తామని వెల్లడించారు. అలాగే సప్దర్‌జంగ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితుల్ని ఆయన పరామర్శించారు. ఇక ఈ ఘటనతో ప్రయాణికులకు ఇబ్బందులు ఎదురయ్యాయి. వారు ప్రయాణించాల్సిన విమానాల గురించిన సమాచారం అందక గందరగోళానికి గురయ్యారు. ఈ క్రమంలో డీజీసీఏ విమానయాన సంస్థలకు ఆదేశాలు ఇచ్చింది. ప్రత్యామ్నాయ విమానాలు ఏర్పాటుచేయాలని, విమానాలు రద్దయితే టికెట్ రీఫండ్ ఇవ్వాలని వెల్లడించింది. ఘటన జరిగిన వెంటనే అత్యవసర సహాయ బృందాలు చర్యలు చేపట్టాయని, పలువురు గాయపడ్డారని, వారికి వైద్య సాయం అందించినట్లు తెలిపారు. వెంటనే... టెర్మినల్ 1 నుంచి విమాన సర్వీసులు రద్దు చేసినట్లు పేర్కొన్నారు. ముందు జాగ్రత్త చర్యగా చెక్ ఇన్ కౌంటర్లు అన్ని మూసి వేశామని విమానాశ్రయ వర్గాలు తెలిపాయి. ఢిల్లీలో శుక్రవారం తెల్లవారు జాము నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. ఢిల్లీ, గురుగ్రామ్, నోయిడా, ఘజియాబాద్‌లో భారీ వర్షాలు పడుతున్నాయి. పలు ప్రాంతాల్లో కార్లు, బైకులు నీట మునిగాయి.

## నీట్‌పై అట్టుడికిన లోక్‌సభ

అనంతరం రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానాన్ని కేంద్రం ప్రవేశపెట్టింది. దీనిపై స్పీకర్ చర్చను ప్రారంభించగా.. ప్రతిపక్షాలు నీట్ అంశాన్ని లేవనెత్తాయి. నీట్ పేపర్ లీక్ అంశంపై విద్యార్థుల కోసం సభలో చర్చించాలని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కోరారు. ఇందుకు సభాపతి ఓం బిర్లా అంగీకరించకపోవడంతో విపక్షాలు ఆందోళనకు దిగాయి. దీంతో స్పీకర్ సభను మధ్యాహ్నం 12 గంటల వరకు వాయిదా వేశారు. ఆ తర్వాత సభ తిరిగి ప్రారంభమైనప్పటికీ పరిస్థితిలో ఎలాంటి మార్పు రాలేదు. అయితే విపక్షాలు నిబంధనలు కాదని డిమాండ్ చేయడం సరికాదని పార్లమెంటరీ వ్యవహారా మంత్రి కిరణ్ రిజు అన్నారు. రాష్ట్రపతి ప్రసంగాన్ని ధన్యావా తీర్మానం అయిపోయాక చర్చకు అవకాశం ఉంటుందని చెప్పారు. అయితే దీనిని విపక్షాలు అంగీకరించలేదు. ప్రతిపక్షాల నిరసన నేపథ్యంలో సభను సోమవారానికి వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ ప్రకటించారు. అటు రాజ్యసభలోనూ ఇదే గందరగోళం కన్పించింది. నీట్ అంశంపై చర్చకు పట్టుబడుతూ విపక్ష సభ్యులు నినాదాలు చేశారు. వారి ఆందోళనల నడుమ కొంతసేపు ఛైర్మన్ సభను నడిపించారు. అయినప్పటికీ వారు తగ్గకపోవడంతో ఛైర్మన్ జగ్‌దీప్ ధన్‌ఖడ్ సభను మధ్యాహ్నం 12 గంటల వరకు వాయిదా వేశారు. సభ తిరిగి ప్రారంభమైన తర్వాత కూడా ప్రతిపక్షాల ఆందోళన కొనసాగింది. వారి నిరసనల నడుమే రాష్ట్రపతికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై రాజ్యసభలో చర్చను చేపట్టారు. అంతకుముందు కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ మీడియాతో మాట్లాడుతూ.. నీట్ పేపర్ లీక్ సమస్య.. దేశ యువతకు సంబంధించిన కీలకమైన అంశం. దానిపై సభలో అర్థవంతమైన, గౌరవప్రదమైన చర్చను ప్రధాని మోదీ చేపట్టాలి. విద్యార్థుల సమస్యలపై ప్రభుత్వం, ప్రతిపక్షం కలిసి పనిచేస్తోందనే సందేశాన్ని పార్లమెంట్ ఇవ్వాలని అన్నారు. 18వ లోక్‌సభ సమావేశాలు సోమవారం మొదలయ్యాయి. సోమ,మంగళ వారాలు సభలో కొత్త సభ్యుల ప్రమాణస్వీకార కార్యక్రమాలతో ముగిసాయి. బుధవారం స్పీకర్ ఎన్నిక జరిగింది. గురువారం ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగించారు.శుక్రవారం నుంచి సాధారణ సమావేశాలు మొదలయ్యాయి.

## మైనారిటీలపై దాడులు తగవు

విజయవంతమైన వలస వర్గమని వ్యాఖ్యానించారు. భారత్ నుంచి భారీగా తరలివచ్చిన ప్రతినిధులతో వాషింగ్టన్‌కు సమీపంలోని ఆక్సన్ హిల్‌లో నిర్వహించిన సెలక్ట్ యూఎస్‌ఏ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్‌లో ఆయన మాట్లాడారు. 'భారత్, అమెరికా సంబంధాలంటే కూడిక కాదు.. మల్టిప్లికేషన్. ఇది అమెరికా ప్లస్ ఇండియా కాదు. గుణింతం లాంటిది' అని గార్సెట్టీ పేర్కొన్నారు. అమెరికన్లకు మరిన్ని భారత్ బ్రాండ్లు అందుబాటులోకి రానున్నాయని చెప్పారు.

అమెరికా నివేదికను ఖండించిన భారత్

భారత్‌లో తీసుకొస్తున్న మతమార్పిడి నిషేధ చట్టాలు, విద్వేష వ్యాఖ్యలు ఆందోళన కలిగిస్తున్నాయంటూ అమెరికా (జూం) వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే.'అంతర్జాతీయ మత స్వేచ్ఛ'పై ఈ మేరకు ఓ నివేదికను విడుదల చేసింది. అయితే.. దీన్ని తిరస్కరిస్తున్నట్లు భారత్ స్పష్టం చేసింది. ఆ నివేదిక తీవ్ర పక్షపాతంతో కూడిందని, ఓటు బ్యాంకు కోణంలో దీన్ని రూపొందించినట్లు కనిపిస్తోందని విదేశీ వ్యవహారాల శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైశ్వాల్ తెలిపారు."గతంలో మాదిరే ఈ నివేదిక పక్షపాతంతో కూడి ఉంది. ఇందులో భారత సామాజిక పరిస్థితుల గురించి అవగాహన కొరవడింది. ఓటు బ్యాంకు లెక్కలు కనిపిస్తున్నాయి. అనేక అసంబద్ధ ఆరోపణలు, తప్పుడు వివరణలు, కొన్ని అంశాలనే ఎంచుకోవడం, పక్షపాత అంశాలపై ఆధారపడటం, ఒకే కోణాన్ని చూపించడం వంటివి పొందుపరిచారు" అని పేర్కొన్నారు. "భారత వ్యతిరేక కథనాన్ని చిత్రీకరించేందుకు కొన్ని ఘటనలనే ఆ నివేదిక ప్రస్తావించింది. చట్టాలు, నిబంధనల చెల్లుబాటునూ ప్రశ్నించింది. భారత న్యాయస్థానాలు ఇచ్చిన కొన్ని తీర్పుల విశ్వసనీయతను కూడా సవాలు చేసేలా కనిపిస్తోంది" అని జైశ్వాల్ వ్యాఖ్యానించారు.అంతర్జాతీయ మత స్వేచ్ఛపై అమెరికా బుధవారం ఓ నివేదిక విడుదల చేసింది. 'భారత్‌లోని 28 రాష్ట్రాల్లో 10 రాష్ట్రాలు మత మార్పిడి నిషేధిస్తూ చట్టాలు చేశాయి. ఇందులో కొన్ని బలవంతపు మత మార్పిడికి పాల్పడితే భారీ జరిమానాలను విధిస్తున్నాయి. దీనిపై అమెరికా అధికారులు ఎప్పటికప్పుడు భారత్ అధికారులతో మాట్లాడి ఆందోళన వ్యక్తం చేస్తూనే ఉన్నారు' అని అందులో పేర్కొంది.

## లీకేజీల నీట్ మాకొద్దు

పార్టీలు ఈ తీర్మానానికి మద్దతు తెలిపాయి. మరోవైపు దేశవ్యాప్తంగా మెడికల్ అడ్మిషన్ల కోసం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) నిర్వహించిన నీట్ నుంచి మినహాయించాలన్న తమిళనాడు డిమాండ్‌ను డీఎంకే ఎంపీ కనిమొళి ఢిల్లీలో పునరుద్ఘాటించారు. 'మాకు నీట్ వద్దు అని తమిళనాడు స్పష్టంగా చెబుతోంది. నీట్ సరైన పరీక్ష కాదని ఇప్పుడు రుజువైంది. నీట్ వల్ల విద్యార్థులు చాలా నష్టపోతున్నారు' అని మీడియాతో ఆమె అన్నారు. గతంలో నీట్ మినహాయింపుతోపాటు తాజాగా నీట్ రద్దు చేయాలన్న తీర్మానాన్ని రాష్ట్ర అసెంబ్లీ ఆమోదించిందని వెల్లడించారు. ఈ నేపథ్యంలో తాజాగా నీట్‌ని రద్దు చేయాలంటూ ఏకగ్రీవ తీర్మానాన్ని తమిళనాడు అసెంబ్లీ ఆమోదించింది.

# బీఆర్ఎస్‌కు మరో షాక్

నుంచి కడియం శ్రీహరి, పోచారం శ్రీనివాస్ రెడ్డి, తెల్లం వెంకట్రావ్, సంజయ్ కుమార్, దానం నాగేందర్ కాంగ్రెస్ లో చేరారు.కాలె యాదయ్య కాంగ్రెస్ పార్టీతో తన రాజకీయ జీవితాన్ని ప్రారంభించారు. ఎంపీపీ, జెడ్పీటీసీగా పని చేసి, 2009లో చేవెళ్ల నియోజకవర్గం నుండి పోటిచేసి తెలుగుదేశం పార్టీ అభ్యర్థి కోరాని సాయన్న రత్నం చేతిలో ఓడిపోయాడు. 2014లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో టీఆర్ఎస్ అభ్యర్థి కోరాని సాయన్న రత్నంపై 781 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. అనంతరం టీఆర్ఎస్ పార్టీలో చేరాడు. 2018లో జరిగిన తెలంగాణ ముందస్తు ఎన్నికల్లో టీఆర్ఎస్ నుంచి పోటీ చేసి 33 వేల 552 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ఇక 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కూడా బీఆర్ఎస్ నుంచి పోటీ చేసి స్వల్ప ఓట్ల తేడాతో గెలిచారు.

**అభివృద్ధి కోసమే కాంగ్రెస్‌లో చేరా**

తనకు రాజకీయాలకన్నా నియోజకవర్గ అభివృద్ధి ముఖ్యమని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. అధికార పార్టీలో ఉంటే నిధులు తెచ్చుకుని అభివృద్ధి చేసుకోవచ్చన్న ఆలోచనతోనే అధికార కాంగ్రెస్ పార్టీలో చేరానని అన్నారు. అధికారంలో ఉంటే వెసులబాటు తెలియంది కాదన్నారు. చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య కాంగ్రెస్ పార్టీలో చేరారు. దిల్లీలో సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకొన్నారు. ఇటీవల జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్, తెలంగాణ మాజీ స్పీకర్, భారాస బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి హస్తం గూటికి చేరిన విషయం తెలిసిందే. దీంతో యాదయ్యతో కలిపి ఇప్పటివరకు ఆరుగురు భారాస ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరారు.అసెంబ్లీ ఎన్నికల్లో అధికారం కోల్పోయాక, పార్లమెంట్ ఎన్నికల్లో పరువు నిలబెట్టుకుందామనుకున్న బీఆర్ఎస్‌కు అడుగడుగునా ఎదురు దెబ్బలే తగులుతున్నాయి. అసెంబ్లీ ఎన్నికల తర్వాత గెలిచిన ఎమ్మెల్యేలను నిలబెట్టుకోలేకపోవడం.. లోక్‌సభ ఎన్నికల ముందు సిట్టింగ్ ఎంపీలే జంప్ అవ్వడం, టికెట్ దక్కించుకున్న తర్వాత ఊహించని రీతిలో ఝలక్ ఇచ్చేసి కాంగ్రెస్‌లో చేరి పోటీ చేయడం గమనార్హం. ఈ షాక్‌ల నుంచి తేరుకోకముందే వరుసగా నలుగురు ఎమ్మెల్యేలు ఈ మధ్య కాలంలోనే బీఆర్ఎస్‌కు గుడ్ బై చెప్పేయడంతో కారు పార్టీ కంగుతిన్నది. ఇలా ఒక్కొక్కరుగా 'కారు' దిగుతుండగా.. తాజాగా చేవెళ్ల నుంచి వరుసగా మూడుసార్లు గెలిచి హ్యాట్రిక్ సాధించిన కాలె యాదయ్య కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఢిల్లీ వేదికగా సీఎం రేవంత్ రెడ్డి, టి. కాంగ్రెస్ ఇంచార్జ్ దీపా దాస్ మున్షీల సమక్షంలో ఈ చేరిక జరిగింది. కాంగ్రెస్ కండువా కప్పిన రేవంత్.. యాదయ్యను పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. మరోవైపు.. త్వరలో మరికొన్ని చేరికలు ఉంటాయని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. కాలె యాదయ్య.. కాంగ్రెస్ పార్టీతోనే తన రాజకీయ జీవితాన్ని ప్రారంభించారు. ఎంపీపీ, జడ్పీటీసీగా పనిచేసిన ఆయన.. తొలిసారి 2009 ఎన్నికల్లో ఎస్సీ రిజర్వ్ స్థానమైన చేవెళ్ల నుంచి పోటీ చేసి ఓటమిపాలయ్యారు. టీడీపీ తరఫున పోటీచేసిన కోరాని సాయన్న రత్నం గెలిచి.. ఆ తర్వాత టీఆర్ఎస్‌లో చేరారు. 2014 ఎన్నికల్లో పార్టీ మారిన ఇదే ప్రత్యర్థిపైనే.. యాదయ్య పోటీచేసి 781 ఓట్ల మెజార్టీతో తొలిసారి గెలుపొందారు. టీఆర్ఎస్ అధికారంలోకి రావడంతో కొద్దిరోజుల్లోనే గులాబీ కండువా కప్పేసుకున్నారు. ఇక 2018 ఎన్నికల్లోనూ బీఆర్ఎస్ తరఫున పోటీచేసి 33,552 మెజార్టీతో గెలిచారు. 2023 ఎన్నికల్లో మాత్రం ప్రత్యర్థి పామేని భీమ్ భరత్ కాంగ్రెస్ నుంచి పోటీచేయగా.. సాయన్న బీజేపీ నుంచి పోటీచేశారు. అయినా సరే ఈ ఇద్దర్నీ ఓడించి అతి తక్కువ 268 ఓట్ల మెజార్టీతో గ్గటెక్కారు. దీంతో వరుసగా గెలిచి హ్యాట్రిక్ ఎమ్మెల్యే అయ్యారు యాదయ్య. ఈయన రాకతో కాంగ్రెస్ శ్రేణులు, నేతలు హ్యాపీగా ఫీలవుతున్నారు. ఈ చేరికపై ఈయన ప్రత్యర్థి భీమ్ భరత్ మాత్రం ఇంతవరకూ ఎక్కడా స్పందించలేదు.

## పాస్‌బుక్కే కీలకం

రుణమాఫీ తర్వాత రైతుబంధు ఇతర పథకాలపై దృష్టి పెడతామని స్పష్టం చేశారు. కేంద్ర బడ్జెట్ ప్రవేశ పెట్టిన రెండు రోజుల తర్వాత తెలంగాణ బడ్జెట్ సమావేశాలుంటాయన్నారు. తెలంగాణ బడ్జెట్ వాస్తవ అంచనాలకు అనుగుణంగా ఉండాలని అధికారులకు చెప్పాం. అంచనాలకు మించి ఊహాజనిత లెక్కలతో బడ్జెట్ ఉండకూడని అధికారులను ఆదేశాలు ఇచ్చాం. మండలాలు రెవెన్యూ డివిజన్ విషయంపై అసెంబ్లీలో చర్చించి కమిషన్ ఏర్పాటు చేస్తాం. కాళేశ్వరం సంబంధించిన వాస్తవాలను కూడా అసెంబ్లీ ముందుకు తెస్తాం. చర్చల తర్వాత డ్యాం సేఫ్టీ అథారిటీ నివేదిక, నిపుణుల సూచన మేరకు ముందుకు వెళ్తాం అని అన్నారు. మహిళలకు ఉచిత బస్సు పథకం వల్ల రెవెన్యూ పెరిగింది. ఆర్టీసీకి ప్రతి నెలా రూ.350 కోట్లకు పైగా ప్రభుత్వం చెల్లిస్తోంది. 30శాతం నుంచి ఆక్యుపెన్సీ రేషియో 80 శాతానికి పెరిగింది. తద్వారా ఆర్టీసీకి నిర్వహణ నష్టాలు తగ్గాయి. గత అప్పులతో సంబంధం లేకుండా చుస్తే కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక లాభాలతో ఆర్టీసీ నడుస్తోంది. రాష్ట్ర ఖజానాకు ఆర్థిక భారం ఉన్నా సరే.. సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నాం. బీసీ కమిషన్ పదవీకాలం ఆగస్టుతో పూర్తవుతుంది. కొత్త వారిని నియమించిన తరువాత కుల గణన చేస్తాం అన్నారు. రాష్ట్రం రూ.7లక్షల కోట్ల అప్పుల్లో ఉంది. ప్రతి నెల రూ. 7వేల కోట్ల అప్పులు కడుతున్నాం. రాష్ట్రం విడిపోయినప్పుడు నెలకు రూ. 6,500 కోట్లు కట్టేవారు. గత ప్రభుత్వం 7 నుంచి 11 శాతం వడ్డీతో రుణాలు తెచ్చారు. రుణభారం తగ్గేలా రుణాల వడ్డీని తగ్గించుకునే పనిలో ఉన్నాం. ఒక్కశాతం తగ్గినా రూ. 700 కోట్లు ఆదా అవుతాయి. ఈ మేరకు కేంద్రంతో సంప్రదింపులు చేస్తున్నాం. బడ్జెట్ కు ముందే రాష్ట్రానికి కావాల్సిన అంశాలను కేంద్రం దృష్టిలో ఉంచి ఎక్కువ నిధులు పొందే ప్రయత్నం చేస్తున్నాం. అన్ని శాఖలకు సంబంధించిన రాష్ట్ర మంత్రులు.. కేంద్రమంత్రులను ఇప్పటికే ఒకసారి కలిశారు అని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. కేసీఆర్ హయాంలో తీసుకొచ్చిన 'ధరణి'లో ఉన్న లోపాలు సరి చేసే పనిలో ఉన్నాము. ఆ తరవాత ఏ పేరు పెట్టినా నడుస్తుంది. కంప్యూటరైజ్ చేయాలా..? లేక మాన్యువల్ పద్ధతి పాటించాలా..? రెండే పద్ధతులు. ఏది చేయాలో అసెంబ్లీ ముందు పెట్టిన తర్వాతే నిర్ణయం ఉంటుంది. ఏ పాలసీ అయినా... ముందు అసెంబ్లీలో పెట్టి చర్చించిన తర్వాతే మార్పు చేర్పులతో తుది విధానం ప్రకటన చేస్తామని అన్నారు.. ఐఏఎస్, ఐపీఎస్‌ల పోస్టింగ్స్‌లో రూల్స్ బ్రేక్ చేయం. కేసీఆర్ చేసిన తప్పులను మేం చెయ్యం' అని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. 'రాష్ట్రంలో విద్యుత్ కోత లేదు పంపిణీలో అంతరాయాలు మాత్రమే ఉన్నాయి. మేము అధికారంలోకి వచ్చే సరికి ప్రతి సంవత్సరం జరిగే నిర్వహణ పనులు జరగడం వల్ల అంతరాయం ఏర్పడింది. బడ్జెట్ వ్యవహారంలో గత ప్రభుత్వం అనుసరించిన విధానాలు అనుసరించాల్సిన అవసరం లేదన్నారు. మహిళలకు ఉచిత రవాణా సదుపాయం వల్ల టెంపుల్ టూరిజం పెరిగింది. అక్కడ జీఎస్టీ కూడా పెరిగింది' అని రేవంత్ చెప్పుకొచ్చారు. 'రాష్ట్ర ఖజానాకు ఆర్థిక భారం ఉన్న సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నాం. రైతు రుణమాఫీ తరువాత రైతు బంధు ఇతర పథకాల పై దృష్టి పెడతాం. మండలాలు రెవెన్యూ డివిజన్ విషయం లో కమిషన్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఉచిత పథకాలను తప్పుపట్టడం సరికాదు. అవసరం ఉన్నవారికే సంక్షేమ పథకాలు అందాలి. మోదీ 10 ఏళ్లలో 16 లక్షల కోట్లు కార్పొరేట్లకు మాఫీ చేస్తే ఎవరు ప్రశ్నించరు..? కానీ మహిళలు, రైతులు, పేదలకు ఇస్తే మాత్రం తప్పుపడుతున్నారు' అని ఉదహరించి మరీ రేవంత్ మాట్లాడారు. ఈ సందర్భంగా.. మహిళలకు పీసీసీ ఇస్తే ఎలా ఉంటుందన్న ప్రశ్నకు మహిళలకు పీసీసీ ఇస్తే బానే ఉంటుందని సీఎం సమాధానం ఇచ్చారు. విలేకరుల సూచనలను అధిష్టానం దృష్టికి తీసుకెళ్తానన్నారు. పీసీసీ రేసులో ఎవరైనా ఉండొచ్చని.. సామాజిక న్యాయంలో భాగంగా బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, మహిళలు, ఈబీసీలు కూడా ఉండొచ్చన్నారు. ఫిరాయింపుల తెలంగాణ ఒక్కటే ప్రత్యేకం కాదని.. కర్ణాటక, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌లో ఎమ్మెల్యేలు ఫిరాయించారన్న విషయాన్ని గుర్తు చేశారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చేసిన తప్పులు, తాము చేయమని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. తకొత్త పీసీసీ చీఫ్ నియామకం, సామాజిక సమీకరణాలు దృష్టిలో ఉంచుకుని హై కమాండ్ డిసైడ్ నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. కాంగ్రెస్ బీ ఫామ్ మిద గెలిచిన వారికి మాత్రమే పదవులు వచ్చాయి. పీసీసీ చీఫ్‌గా రెండు ఎన్నికలు పూర్తి చేశా. జూలై 7 తో మూడేళ్లు పీసీసీ పూర్తి కానుంది. పీసీసీ , కేబినెట్ విస్తరణ నిర్ణయాలు ఒకే సారి ఫైనల్ అవుతాయని అన్నారు.

## కర్నాటకలో ఘోర రోడ్డు ప్రమాదం



తాలూకాలోని ఈమ్మహట్టి గ్రామానికి చెందిన 17 మంది భక్తులు బెళగావి ప్రాంతం శవదత్తిలోని ఎల్లమ్మ ఆలయానికి వెళ్లి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. మృతులలో పరుశు రామ్(45), భాగ్య(40), నాగేశ్(50), విశాలక్షి(50), సుభద్రా బాయ్(65), పుణ్య(50), మంజుల బాయ్(57), డ్రైవర్ అదర్ష్(23), మానస(24), రూపా(40), మంజుల(50), ఇద్దరు పిల్లలు ఉన్నారు.

# ఎమ్మెల్యే కవితతో హరీష్ రావు భేటీ

### ధైర్యంగా ఉండాలని హితవు

న్యూఢిల్లీ,జూన్28 (ప్రజా మంటలు):

తీహార్ జైలులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితతో ఆ పార్టీ నాయకులు, మాజీ మంత్రి హరీష్ రావు శుక్రవారం ఉదయం ములాఖాత్ అయ్యారు. ములాఖాత్ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండమని కవితకు సూచించారు. ఇటీవలే మాజీ మంత్రులు సత్యవతి రాథోడ్, సబితా ఇంద్రారెడ్డి, కేటీఆర్ కవితతో ములాఖత్ అయిన విషయం విదితమే. ఢిల్లీ మద్యం విధానం కేసులో రిమాండ్‌లో ఉన్న ఎమ్మెల్సీ కవిత జ్యుడీషియల్ కస్టడీని మరోసారి పొడిగించిన సంగతి తెలిసిందే. జూలై 5 వరకు ఆమె కస్టడీని పొడిగిస్తూ రౌస్ ఎవెన్యూ కోర్టు ఉత్తర్వులు జారీచేసింది. అధికారులు జూన్ 21వ తేదీన ఆమెను వర్చువల్‌గా కోర్టు ముందు హాజరుపరిచారు. ఈ కేసును జూలై 3వ తేదీన రౌస్ ఎవెన్యూ కోర్టు మరోమారు విచారణ జరుపనున్నది. కాగా, కవిత బెయిల్ పిటిషన్‌పై ఢిల్లీ హైకోర్టు తీర్పును రిజర్వ్ చేసింది.

# పోయేవాళ్లు పోతేపోని.. - కేసీఆర్



శుక్రవారం జగిత్యాల, కోరుట్ల నియోజకవర్గాల నుంచి వచ్చిన నేతలు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ పార్టీని వీడిన నేపథ్యంలో కీలక వ్యాఖ్యలు చేశారు."భారాస శ్రేణులకు ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులు ఒక లెక్కే కాదు. పార్టీ నుంచి వెళ్తోన్న నాయకుల గురించి ఆలోచించాల్సిన అవసరం లేదు. ఒకరు పోతే 10 మంది నాయకుల్ని పార్టీ తీర్చిదిద్దుకుంటుంది. తెలంగాణ ఆత్మను అర్థం చేసుకుంటూ సమస్యలను లోతుగా పట్టుకోగలిగి పరిష్కరించగలిగే సత్తా భారాసకే ఉంది. రెట్టించిన ఉత్సాహంతో భవిష్యత్తులో ఇంకా బాగా ప్రజల కోసం పనిచేయాల్సి ఉంది. పదేళ్లపాటు అన్ని వర్గాల అభివృద్ధికి కృషి చేశాం. కొన్ని సార్లు ప్రజాస్వామ్యంలో అబద్ధపు ప్రచారాలు నమ్మి ప్రజలు బోల్తాపడుతుంటారు. మొన్నటి ఎన్నికల్లో అదే జరిగింది. ఓడిపోయినంత మాత్రాన నిరుత్సాహపడొద్దు. అధికారం ఉంటేనే పనిచేస్తామంటే పద్ధతి కాదు. ఏ హోదాలో ఉన్నా ప్రజల కోసం పనిచేయాల్సిందే. అంతిమ లక్ష్యం తెలంగాణ ప్రజల సంక్షేమం, అభివృద్ధి మాత్రమే. నాడు ఉద్యమంలోకి దిగినప్పుడు మనతో ఎవరు ఉన్నారు? నాడైనా, నేడైనా నాయకులను తయారు చేసుకునేది పార్టీనే" అని కేసీఆర్ వ్యాఖ్యానించారు. అంతకముందు.. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నేతలతో ప్రత్యేకంగా సమావేశమైన కేసీఆర్.. పార్టీ బలోపేతం కోసం తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు.

# హేమంత్‌కు సోరెన్‌కు ఊరట

### - బెయిల్ మంజూరు చేసిన ఆ రాష్ట్ర హైకోర్టు

### - తప్పుడు కేసుల్లో ఇరికించారని మాజీ సీఎం విమర్శలు



రాంచి(ప్రజా మంటలు):

ఝార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌కి భారీ ఊరట లభించింది. ల్యాండ్ స్కామ్ కేసులో అరెస్ట్ అయిన హేమంత్‌కు ఝార్ఖండ్ హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఈ ఏడాది ఇదే కేసులో జనవరి 31న సోరెన్ అరెస్ట్ అయ్యారు. 8.36 ఎకరాల ల్యాండ్ కొనుగోలు విషయంలో అవకతవకలు ఈడీ తేల్చి చెప్పింది. ఈ కేసులో ఆరోపణలు వచ్చిన వెంటనే ఆయన ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశారు. ఆ తరవాత చంపై సోరెన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకున్నారు. ఈ కేసుపై విచారణ కొనసాగుతోంది. ఈ క్రమంలోనే హైకోర్టు బెయిల్ ఇచ్చింది. పెండింగ్ కేసులు ఏమీ లేకపోవడం వల్ల ఆయన జైలు నుంచి విడుదలయ్యేందుకు లైన్ క్లియర్ అయింది. ల్యాండ్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ భాను ప్రతాప్ ప్రసాద్‌నీ ఇప్పటికే అరెస్ట్ చేశారు. 2023లో ఈ స్థలానికి సంబంధించిన డాక్యుమెంట్స్‌ని తారుమారు చేశారు. ఆయనను అరెస్ట్ చేసిన తరవాత డాక్యుమెంట్స్‌ని స్వాధీనం చేసుకున్నారు. హేమంత్ సోరెన్ 8.36 ఎకరాల ల్యాండ్‌ని అక్రమంగా కొనుగోలు చేసినట్టు తేలింది. ఈ వ్యవహారంలో భాను ప్రతాప్ సహకరించాడు. ఇప్పటికే ఈడీ మరి కొన్ని కేసులనూ విచారిస్తోంది. కాగా తనను తప్పుడుగా ఇరికించారని.. రాజకీయ నేతలు, సామాజిక కార్యకర్తల గొంతు నొక్కుతున్నారని.. జైలు నుంచి విడుదలైన అనంతరం హేమంత్ ఆరోపించారు.సోరెన్‌ను చూసేందుకు జేఎంఎం శ్రేణులు, ప్రజలు పెద్దఎత్తున జైలు వద్దకు తరలివచ్చారు. పార్టీ కార్యకర్తలు ఆయనకు అనుకూలంగా నినాదాలు చేశారు. ఆ తర్వాత తన తండ్రి, జేఎంఎం అధినేత శిబు సోరెన్ నుంచి ఆశీస్సులు తీసుకున్నారు. మద్దతు తెలిపిన వారికి, న్యాయవ్యవస్థకు హేమంత్ సతీమణి కల్పనా సోరెన్ ధన్యవాదాలు తెలిపారు. భూ కుంభకోణానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ఝార్ఖండ్ ముక్తిమోర్చ కార్యనిర్వాహక అధ్యక్షుడు హేమంత్ సోరెన్‌ను ఈ ఏడాది జనవరి 31న ఈడీ అధికారులు అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. అప్పటినుంచి ఆయన బిర్సా ముండా జైల్లో ఉన్నారు. అరెస్టుకు కొన్ని గంటల ముందే ఆయన నాటకీయ పరిణామాల నడుమ ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయగా.. నూతన సీఎంగా చంపయీ సోరెన్ బాధ్యతలు చేపట్టారు.



# బహుళ పార్టీల ప్రభుత్వాల ఆవశ్యకత

**- బి ఎస్ రాములు - ?8331966987**



నెహ్రూ తొలుత, 1947 జాతీయ ప్రభుత్వాన్ని ఏర్పరిచారు. డాక్టర్ బి ఆర్ అంబేద్కర్, జన సంఘ్ మూల పురుషుడైన శ్యామ్ ప్రకాశ్ ముఖర్జీ, కృపలానీ మరికొందరు సోషలిస్టులను కలుపుకొని నడిచారు. 1967 నుండి ఇతర పార్టీల మద్దతుతో కేంద్ర ప్రభుత్వాలు ఏర్పడుతున్నాయి. ఇవి ఆయా ప్రాంతాల , భాషా ప్రజల ఆకాంక్షలకు, భారత రాజ్యాంగంలోని ఫెడరల్ స్వభావానికి నిదర్శనం.

**ఫజల్ అలీ కమిషన్ చేసిన నష్టాలు.**

రాష్ట్రాల ౖ పునర్ విభజించాలని ఏర్పాటు చేసిన ఫజల్ అలీ కమిషన్ నివేదిక తెచ్చి పెట్టిన కష్టాలు నష్టాలు, పర్యవసానంగా సాగిన సంఘర్షణలు ఇన్నీ అన్నీ కావు. ఆదివాసీ గిరిజన ప్రాంతాల ప్రత్యేకతను గుర్తించకుండా ఆయా రాష్ట్రాలలో సరిహద్దులుగా కలిపారు. జాతీయోద్యమ కాలంలో పాలకులకు వ్యతిరేకంగా స్వయం ప్రతిపత్తి కోసం చేసిన 170 తిరుగుబాట్ల చరిత్రను మరిచారు. భాష ఒకటే అనే పేరిట అసమానతల ప్రాంతాలను దబ్బనంతో కుట్టారు.

నాడు 15 కోట్లు నేడు 32 కోట్లు జనాభా గల అమెరికాలో 56 రాష్ట్రాలున్నాయి. నాడు 30 కోట్లు నేడు 140 కోట్లున్న ఇండ్యాలో 14 రాష్ట్రాలు చాలు అనుకోవడమే ఒక పెద్ద పొరపాటు. 565 సంస్థానాలను , నైజాం, కాశ్మీర్ , గోవా, పుదుచ్చేరి రాజ్యాలను బ్రిటిష్ , ఫ్రెంచ్ పాలిత ప్రాంతాలను ?ఫజల్ అలీ కమిషన్ సూచనలతో 14 రాష్ట్రాలుగా మార్చినంత సులభంగా సంస్కృతులు భాషలు ఆకాంక్షలు మారవు. అసలా ఏర్పాటు వల్లే అనేక సంఘర్షణ లు , అసమానతలు, అంతర్గతవలసలు,, వలస వాదాలు పెరిగాయి. అనేక ఉద్యమాలతో 29 రాష్ట్రాలయ్యాయి. . ఇంకా 15 ప్రత్యేక రాష్ట్ర ఉద్యమాలు సాగుతున్నాయి. ఉత్తర ప్రదేశ్ ను 8 రాష్ట్రాలుగా, బిహార్ ను 5 రాష్ట్రాలుగా, మధ్య ప్రదేశ్ ను నాలుగు రాష్ట్రాలుగా, మహరాష్ట్రను 5 రాష్ట్రాలుగా ఏర్పాటు చేయాల్సివుండగా కలిపి కుట్టారు. శతాబ్దాలుగా కొనసాగిన గోండ్వానా , విదర్భ, నాగపూర్ రాష్ట్రాలు, నైజాం రాజ్యం అస్తిత్వం లేకుండా చేశారు. దేశం అసమ అభివృద్ధికి అంతర్గత వలసాధిపత్య దోపిడి అణిచివేతలకు వివక్షకు వెలివేతకు మూల భూతమయ్యారు. అధిక పార్లమెంటు సీట్లు గల రాష్ట్రాలే కేంద్రంలో చక్రం తిప్పారు.

**ఇండియా ఫెడరల్ స్వభావం ప్రత్యేకమైనది**

ఇండియాో ఫెడరల్ స్వభావం ప్రత్యేకమైనది. అది కుల వ్యవస్థ నిర్మిత సమాజంలో అగ్ర కుల ఆధిక్యత, బహుజన కులాల సాధికారికత అనే రెండు రూపాలు తీసుకున్నాయి. మరోవైపు ఆదివాసీ స్వయం ప్రతిపత్తి ఉద్యమ రూపాలు తీసుకున్నాయి. అలా కేంద్రం , కాంగ్రెస్, బిజెపీ పార్టీల ఇష్టాయిలతో వెరవకుండా ముందుకు నడిచారు. . వారు ప్రాంతీయ శక్తులుగా ఎదిగారు.

. అందుకు రకరకాల నినాదాలను సిద్ధాంతాలను ముందుకు తెచ్చారు. అలా ఏర్పడుతూ వచ్చినవే ప్రాంతీయ పార్టీలు.

నేటికీ అవి తమ వనరులు ఉద్యోగాలు తమకే అంటూ తమ ప్రాంత అభివృద్ధి సంస్కృతి, స్వీయ పరిపాలన, ఆత్మ గౌరవం, స్వేచ్ఛ సమానత్వం , స్వీయ అస్తిత్వం కోసం పెనుగులాడుతున్నాయి. . పోరాడుతున్నాయి. ఇదే క్రమంలో బీసీలు

మహిళలు , చిన్న భాషల వారు తమ సంస్కృతుల రక్షణ కోసం , తమ వనరులతో తమ స్వీయ అభివృద్ధి కోసం స్వీయ ఆత్మ గౌరవం కోసం తమ సా?నిక పార్టీలు స్థాపించి కొని సర్పంచ్ నుండి ఎమ్మెల్యేలే, యం పీ దాకా గెలిపించుకుంచున్నారు. ఇవాళఇపుడు దేశంలో 100 కు పైగా భారత రాజ్యాంగం పరిధిలో ఎన్నికల కమిషన్ గుర్తించి పార్టీలు ప్రజల చేత ఎన్నుకోబడుతున్నాయి. వీటన్నింటిని రాదని దేశ వ్యాప్తంగా ఏక పార్టీ అధికారంలోకి రావాలని కోవడం, మిగతా అందరినీ అణిచి వేయడమే.


**బహుళ పార్టీల వ్యవస్థ ప్రజాస్వామ్యానికి నిదర్శనం**

నేడు 50 పార్టీలతో ఏర్పడే సంకీర్ణ ప్రభుత్వాలు అని పిలుస్తున్న బహుళ పార్టీ ప్రభుత్వాలు భారత రాజ్యాంగంలో ఫెడరల్ స్వభావానికి, రాష్ట్రాల హక్కులకు, ఆకాంక్షలకు నిదర్శనం. సంకీర్ణ ప్రభుత్వాలను నిజానికి

జాతీయ ఫెడరల్ ప్రభుత్వాలు అని పిలవాలి. ప్రాంతీయ పార్టీలు సంకీర్ణ ప్రభుత్వాల్లో కోరేవి ఫెడరల్ విధానంలో తమ ప్రాంత తమ పార్టీ ప్రయోజనాలు . ఇవి రాజ్యాంగం ఫెడరల్ స్వాభావానికి సంబంధించినవి. ఏక పార్టీ ప్రభుత్వాలు ఫెడరల్ రాజ్యాంగం విలువలను సీమితులను కాదని అన్నిటిలో తొచ్చుకు వస్తాయి. నియంతృత్వం చెలాయిస్తాయి. ఇందిర గాంధీ ఎమర్జెన్సీ, బిజేపీ నరేంద్ర మోడీ! కు చేసిన ప్రజా వ్యతిరేక చట్టాలు ఎన్నో! బీసీలకు చట్ట సభల్లో రిజర్వేషన్లు ఏర్ పార్టీ పాలన నిరాకరించాయి. సంకీర్ణ ఫెడరల్ ప్రభుత్వాల వల్లనే కుల గణన ఒక తొలి అడుగుగా ముందుకు వచ్చింది. ప్భుత్వాలు స్థిరంగా వుంటే ప్రజలకు కీడు జరుగుతుంది. మార్పు అడ్డగించ బడుతుంది.

**మార్పులు వేగవంతం కావడానికి సంఘర్షణ తప్పదు**

నిలకడగా సాగే కుల వ్యవస్థలో, మార్పులు వేగవంతం కావడానికి సఘర్షణ తప్పదు. అంబేద్కర్, జ్యోతిరావు పూలే, రాజా రామమోహన్ రాయ్ , మార్క్స్ కూడ సంఘర్షణ తప్పదు అని చెప్పిన వారే. అందుకే బీయస్పీ కాన్సీరాం డిస్ట్ర బెన్స్ ఈజ్ అవర్ ఫిలాసఫీ అన్నారు. మార్పు కోరేవారు ప్రభుత్వాలు స్థిరంగా ఉంటే గల ప్రమాదాలు గుర్తిస్తారు. డియంకె అన్నాడియంకే ఎన్టీఆర్ హయాంలో కేంద్రం రాష్ట్రాల కనువుగా పని చేయాల్సి వచ్చింది. జయలలిత మద్దతు అనివార్యం కావడం వల్లనే కమిళనాడులో 69 శాతం రిజర్వేషన్లను పార్లమెంటు ఆమోదించి కోర్టులు జోక్యంచేసుకోకుండా 9 వ షెడ్యూల్ లో చేర్చడం జరిగింది.



**ఏకపార్టీ పాలన నియంతృత్వానికి దగ్గరి దారి.**

పూర్తి మెజారిటీ వుంటే ఏం జరుగుతుందో ఇందిరా గాంధీ పెట్టి ఎమర్జెన్ ? అమలు చేసిన నల్ల చట్టాలు, నరేంద్రమోడీ అమిత్ షా ల రెండెడ్ల బండి ఒకే దేశం ఒకే భాష నినాదాలు

అనేక నల్ల చట్టాలు నిదర్శనం. దాంతో నేను సరే మంచిదే యూరపులో వలె భాషల వారీగా దేశం సోవియట్ యూనియన్ 13 దేశాలుగా ప్రశాంతంగా విడి పోయినట్టు విడిపోతే సరి! అని స్పష్టం చేశాను. సామ్రాజ్య వాదులు అశోకుడు, అక్బర్, ఔరంగ దేబ్, ఆంగ్లేయుల కాలంలో తప్ప భారత ఉపఖండం ఒకే దేశంగా ఒకే పరిపాలనలో ఎన్నడూ లేదు.

ఏక పార్టీ ప్రభుత్వాలు మార్వాడీ గుజరాతీ సేట్లకు జాతీయ ప్రయోజనాల పేరిట రాష్ట్రాల సహజ వనరులను అప్పగిస్తాయి. స్థానిక , ఆయా రాష్ట్రాల పారిశ్రామిక వేత్తలను ఎదగకుండా చేస్తాయి. ఒక్క మాటలో చెప్పాలంటే ఏక పార్టీ ప్రభుత్వాలు భారీ పారిశ్రామిక వేత్తల , జాతీయ దళారీ వర్గాల కనుసన్నలలో సాగుతాయి. బహుళ పార్టీ ప్రభుత్వాలు స్థానిక, ప్రాంతీయ ఆయా రాష్ట్రాల జాతీయ పారిశ్రామిక వేత్తల ప్రయోజనాలకు ప్రాధాన్యత నిస్తాయి.

**బహుళ పార్టీ ప్రభుత్వాలు నెహ్రూ కాలం నుంచే ఉన్నాయి.**

నెహ్రూ కాలం నుండే బహుళ పార్టీ జాతీయ ప్రభుత్వాలు కొనసాగాయి. 1967 నుండి సగం రాష్ట్రాల్లో కాంగ్రెస్ స్థానంలో బహుళ పార్టీలు అధికారంలోకి వచ్చాయి. ఆ తరువాత ఏ పార్టీ కూడా ప్రజా సమస్యలపై గెలిచిన దాఖలాలు లేవు. 1971 లో పాకిస్తాన్ యుద్ధంతో, 1977 లో ఎమర్జెన్సీ వ్యతిరేకతతో , 1984 లో ఇందిర హత్య సానుభూతితో, 1989 లో రాజీవ్ గాంధీ సానుభూతితో, 1995లో , 2014, 2019, 2024 రామ జన్మ భూమి జపంతో గెలుచుకుంటూ వచ్చారు. ప్రాంతీయ పార్టీలు కమ ప్రయోజనాలను ముందుకు తెస్తూ గెలుస్తూ వస్తున్నాయి. సహజంగానే వీటీ స్వభావం ఫెడరల్ స్వభావం. భాషలు వేరు. సంస్కృతులు వేరు. అవసరాలు ప్రాధాన్యతలు వేరు. తమ అస్తిత్వం కోసం పోరాటం చేస్తాయి, బేరం చేస్తాయి, కేంద్రం నుండి సాధించుకుంటాసి. ఇలా ఫెడరల్ , బహుళ పార్టీ ప్రభుత్వాలు భారత రాజ్యాంగం మౌలిక లక్ష్యాలతో కనీస కార్యక్రమంతో ముందుకు సాగితే బీసీలకు చట్ట సభల్లో రిజర్వేషన్లు సాధ్యమే . అందుకు 69 శాతం రిజర్వేషన్లు ఆమోదించిన గత ప్రభుత్వాలే నిదర్శనాలు అని మరిచి పోకూడదు.

**మొదటే చెప్పాల్సిన ముఖ్యాంశం**

మొదటే చెప్పాల్సిన ముఖ్యాంశం చివరన గుర్తు చేస్తున్నాను. మన ప్రజా స్వామ్యంలో అన్ని ప్రాంతాలకు , అన్ని సామాజిక వర్గాలకు, యువతకు, రైతులకు, కార్మికులకు, మహిళలకు బీసీలకు, ఉపాధ్యులకు , విద్యావంతులకు సరైన ప్రాతినిధ్యం లభించాలంటే యూరప్ అమెరికా, ఆస్ట్రేలియా, చైనా , రష్యాలలో వలె జనాభా దామాషా ప్రకారం పార్లమెంటులో శాసన సభల్లో సీట్లు పెంచాలి. ఈ దేశ ప్రాతినిధ్యం ప్రకారం చూస్తే 3150 పార్లమెంటు సీట్లుండాలి. చైనాలో 2950 సీట్లున్నాయి. శాసన సభల్లో కూడా ఇలా సీట్లు పెంచుకున్నపుడే అధికార వికేంద్రీకరణ జరిగి ప్రజలకు ప్రజాస్వామ్యం అందుబాటులోకి వస్తుంది. కేరళలో వలె అందరికి , సరైన ప్రాతినిధ్యం లభిస్తుంది. అంతదాకా డబ్బున్నోల్లదే రాజ్యం. అంతదాకా డబ్బున్న రియల్ ఎస్టేట్, కాంట్రాక్టర్లు , డబ్బున్న పారిశ్రామిక వేత్తలే వెనక వుండి రాజ్యం నడిపిస్తారు.

# బకాయిల వసూళ్లలో జగన్ ప్రభుత్వం నిర్లక్ష్యం

### రూ.14831 కోట్లు పెండింగ్‌లో ఉన్నట్లు గుర్తింపు

### అధికారులతో సమీక్షలో మంత్రి నారాయణ



అమరావతి,జూన్28 (ప్రజా మంటలు): రాష్ట్రంలోని 17 మున్సిపల్ కార్పొరేషన్లలో పెండింగ్ బిల్లులు పేరుకుపోవడంపై మంత్రి నారాయణ ఆరా తీశారు. మున్సిపల్ కార్పోరేషన్‌లపై సచివాలయంలో ఉన్నతాధికారులతో మంత్రి నారాయణ సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో షాకింగ్ విషయాలు వెలుగు చూశాయి. మొత్తం 851 బిల్లులకు సంబంధించి రూ.14831 కోట్లు పెండింగ్‌లో ఉన్నట్లు అధికారులు లెక్కల్లో తేలింది. కొన్ని ఖాతాల్లో ఉన్న నిధుల కంటే ఖర్చే ఎక్కువ. పట్టణాలను నిలువునా వైసీపీ సర్కార్ ముంచేసింది. తద్వారా కూటమి ప్రభుత్వంపై బకాయిల భారం పడింది. కార్పొరేషన్లలో సాధారణ నిధుల కింద చేపట్టిన పనులు, పథకాలకు సంబంధించి రూ.10232 కోట్ల బకాయిలు ఉన్నట్టు తేలింది. రోడ్లు, డ్రైన్లు, భవనాలు, వీధిలైట్లు, తాగునీటి సరఫరాకు సంబంధించి రూ.246 కోట్లు పెండింగ్ ఉన్నట్టు తెలుస్తోంది. గత ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం కింద రూ.2532 కోట్ల పనులు చేయించింది. ఈ బిల్లులు చెల్లించేందుకు కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే రూ.1730 కోట్లు విడుదల చేసింది. రాష్ట్ర ప్రభుత్వం చెల్లించింది కేవలం రూ.523 కోట్లు మాత్రమే కావడం గమనార్హం. మిగలిన మొత్తం రూ.1206 కోట్లు ఇతర నవరత్నాలకు మళ్లించడం జరిగింది. దీంతో కాంట్రాక్టర్లకు బిల్లులు అందక పనులు అసంపూర్తిగా ఆగిపోయాయి. దీనిపై రివ్యూ కొనసాగుతోంది. స్మార్ట్ సిటీస్ ప్రాజెక్టుపైనా మంత్రి నారాయణ సమీక్షిస్తున్నారు.

# కూతురు వెంటపడొద్దని మందలింపు


### కక్షపెంచుకుని అమ్మాయి తండ్రిని హతమార్చిన దుండగుడు

### కేసునమోదు చేసి దుండగుడిని అరెస్ట్ చేసిన పోలీసులు

విజయవాడ,జూన్28 (ప్రజా మంటలు): విజయవాడలో దారుణం చోటుచేసుకుంది. కూతురు వెంట పడొద్దని.. మందలించిన పాపానికి ఓ వ్యక్తి ఆ అమ్మాయి తండ్రిని కడతేర్చాడు. తన ప్రేమకు అడ్డొస్తున్నాడని రగిలిపోయాడు. ప్రేమికురాలి తండ్రిపై ఆగ్రహం పెంచుకున్న ఆ దుర్మార్గుడు.. ఆయన కోసం కాపు కాచాడు. రాత్రివేళ ఎదురుపడగానే వాగ్వాదానికి దిగాడు. అంతే మాట మాట పెరిగింది. తన చేతిలో ఉన్న కత్తి తీశాడు. అత్యంత దారుణంగా హత్య చేశాడు. తన తండ్రిని చంపొద్దని కూతురు వేడుకుంటున్నా ఆగకుండా అత్యంత క్రూరంగా నరికి చంపాడు.. ఈ దారుణ ఘటన విజయవాడ లోని బృందావన్ కాలనీలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు చెప్పిన వివరాల ప్రకారం.. వానీపురంలోని చెరువు సెంటర్‌కు చెందిన కె.శ్రీరామచంద ప్రసాద్ (56) బృందావన్ కాలనీలో కిరాణా షాపు నిర్వహిస్తున్నాడు. నిత్యం భవానీ పురం నుంచి రాకపోకలు సాగిస్తున్నాడు. ఆయన కుమార్తె దార్శిని ఇంజనీరింగ్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. విద్యాధరపురానికి చెందిన గద్దం శివమణికంఠ విజ్ఞాన్ విహార్ స్కూల్లో వ్యాయామ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. మణికంఠకు ఇన్‌స్టాలో దార్శినితో పరిచయం ఏర్పడింది. నాలుగేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. ఈ విషయం తెలిసిన శ్రీరామచందప్రసాద్ కుమార్తెను హెచ్చరించాడు. బాగా చదువుకుని జీవితంలో స్థిరపడాలన్నాడు. తన కుమార్తె జోలికి రావద్దని మణికంఠను హెచ్చరించాడు. దీంతో కొద్దిరోజులుగా దార్శిని అతడిని పక్కనపెట్టింది. పెళ్లి చేసుకోవాలని మణికంఠ చేసిన ప్రతిపాదనను తిరస్కరించింది. దీనిపై శ్రీరామచందప్రసాద్ కొంతమందిని తీసుకుని మణికంఠ ఇంట్లో పంచాయితీ పెట్టాడు. ఆ తర్వాత మణికంఠ ఇంట్లో రోజూ గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో మణికంఠ తల్లి గురువారం ఇల్లు విడిచి వెళ్లిపోయింది. దీంతో మణికంఠ పగ పెంచుకున్నాడు. గురువారం శ్రీరామచంద ప్రసాద్ కుమార్తెను తీసుకుని బృందావన్ కాలనీలోని కిరాణా షాపునకు వచ్చాడు. రాత్రి 9 గంటల సమయంలో షాపు మూసేసి ఇద్దరూ ఇంటికి బయల్దేరారు. పగతో రగిలిపోతున్న మణికంఠ కత్తి తీసుకుని బృందావన్ కాలనీకి వచ్చాడు. షాపునకు 100 మీటర్ల దూరంలో ఉన్న ఓ చెట్టు కింద నిలబడ్డాడు. తండ్రీకూతుళ్లు స్కూటర్‌పై వస్తుండగా, ఎదురుగా వెళ్లి బైకుతో ఢీ కొట్టాడు. కిందపడిపోయిన శ్రీరామచందప్రసాద్‌పై కత్తితో పొడిచాడు. రోడ్డుపై పడిన తండ్రిని దార్శిని పక్కకు తీసుకెళ్లి కూర్చోబెట్టగానే మళ్లీ అతనిపై దాడి చేశాడు. దార్శిని ఎంత ఆపినా విచక్షణారహితంగా నరికాడు. ఆ తర్వాత ఆమెను బెదిరించాడు. తనతో తిరిగిన వీడియోలు సోషల్ మీడియాలో పెడతానని హెచ్చరించాడు. చుట్టుపక్కల వారు రాగానే మణి పరారయ్యాడు. శ్రీరామచందప్రసాద్‌ను వెంటనే ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే చనిపోయినట్టు వైద్యులు ధ్రువీకరించారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న కృష్ణలంక పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని ప్రభుత్వాసు పత్రి మార్చురీకి తరలించారు. కేసును కృష్ణలంక పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మణికంఠను సైతం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

# పివి ఆర్థిక సంస్కరణలే దేశానికి దిక్సూచి

### నివాళి అర్పించిన ఎపి సిఎం చంద్రబాబు



అమరావతి,జూన్28 (ప్రజా మంటలు): బహుముఖ ప్రజ్ఞశాలి, అపార మేధావి, మాజీ ప్రధానమంత్రి పీవీ నరసింహా రావు జయంతి సందర్భంగా ప్రముఖులు నివాళులర్పించారు. పీవీ నరసింహ రావు తెలుగు రాష్ట్రాలకు దేశానికి చేసిన సేవలను ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్మరించారు. పీవీ నర్సింహారావు జయంతి సందర్భంగా నివాళులు అర్పించారు. విప్లవాత్మక సంస్కరణలు, సాహసోపేత నిర్ణయాలతో భారతదేశం బలమైన ఆర్థిక శక్తిగా ఎదిగేందుకు పునాదులు వేశారని గుర్తుచేశారు. మాజీ ప్రధాని పీవీ జయంతి సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ నేతలు అంజలి ఘటించారు. రాష్ట్రానికి, దేశానికి చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు. దేశంలో ఆర్థిక సంస్కరణలు అమలు చేసిన గొప్ప మేధావి పీవీ నరసింహ రావు. భూ స్వామ్య కుటుంబంలో పీవీ జన్మించారు. తనకు గల 1200 ఎకరాల్లో 1000 ఎకరాలను పేదలకు పంచారు. పీవీ నరసింహ రావు అమలు చేసిన భూ సంస్కరణలతో రైతు కూలీలకు భూమి దక్కిందని చెప్పొచ్చు. ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ మంత్రిగా, కేంద్ర విద్యాశాఖ మంత్రిగా కూడా పనిచేశారు. ఏపీ సీఎం పదవి చేపట్టి భూ సంస్కరణలను అమలు చేశారు. పదవి చేపట్టిన వన్నె తీసుకొచ్చారు. పీవీ విద్యాశాఖ మంత్రిగా ఉన్న సమయంలో గురుకుల విద్యను ప్రవేశపెట్టారు. కేంద్ర మానవ వనరుల శాఖ మంత్రిగా ఉన్న సమయంలో నవోదయ పాఠశాలలను ప్రారంభించారు. జైళ్ల శాఖ మంత్రిగా ఉన్న సమయంలో ఓపెన్ జైల్ అనే పద్ధతికి శ్రీకారం చుట్టారు. సీఎంగా భూ సంస్కరణలు, ప్రధానిగా ఆర్థిక సంస్కరణలను అమలు చేశారు.

# నేడు కొండగట్టుకు డిప్యూటి సిఎం పవన్

### పవన్ కళ్యాణ్ రాకతో భారీగా ఏర్పాట్లు



హైదరాబాద్, జూన్28 (ప్రజా మంటలు): జనసేన చీఫ్, ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ శనివారం జగిత్యాల జిల్లాలోని కొండగట్టు పుణ్యక్షేత్రాన్ని దర్శించుకోనున్నారు. దీంతో పవన్ కల్యాణ్ పర్యటన నేపథ్యంలో పోలీసులు తగు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఈ మేరకు ఏపీ పోలీసులు పవన్ పర్యటన షెడ్యూల్‌ను విడుదల చేశారు. వారాహి అమ్మవారి దీక్షలో పవన్ కల్యాణ్.. శనివారం ఉదయం 7 గంటలకు మాదాపూర్‌లోని తన నివాసం నుంచి రోడ్డు మార్గంలో కొండగట్టుకు బయల్దేరనున్నారు. ఉదయం 11 గంటలకు కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయానికి ఆయన చేరుకోనున్నారు. గంటన్నర పాటు కొండగట్టు పుణ్యక్షేత్రంలో పవన్ గడపనున్నారు. ఆంజనేయస్వామికి పవన్ ప్రత్యేక పూజలు చేయనున్నారు. అనంతరం మధ్యాహ్నం 12.30 గంటలకు కొండగట్టు నుంచి మాదాపూర్‌కు రోడ్డు మార్గంలో తిరిగి రానున్నారు. సాయంత్రం 4.30కు మాదాపూర్ చేరుకోనున్నారు. శనివారం రాత్రికి హైదరాబాద్‌లోనే డిప్యూటీ సీఎం పవన్ బస చేయనున్నారు. పవన్ కల్యాణ్ చేపట్టిన వారాహి దీక్ష వివాదాస్పదంగా మారిన సంగతి తెలిసిందే. ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో బంపర్ మెజారిటీతో గెలవడంతో పవన్ కల్యాణ్ జూన్ 26న వారాహి అమ్మవారి దీక్షను తీసుకున్నారు. 11 రోజుల పాటు నిష్టగా ఈ దీక్షను పవన్ కల్యాణ్ పాటించనున్నారు. పసుపు రంగు దుస్తుల్లో ఆధ్యాత్మిక భావం ఉట్టిపడేలా ఉన్న పవన్ కల్యాణ్ ఫొటోలు చూసి ఫ్యాన్స్ పండుగ చేసుకుంటున్నారు. అయితే ఈ దీక్ష దుస్తుల్లో ఉన్న పవన్ కల్యాణ్ చెప్పులు వేసుకుని కనిపించడం చర్చనీయాంశంగా మారింది.

# పదవీవిరమణ సమయంలో ఊరట

### జవహర్ రెడ్డి, పూనం మాలకొండయ్యలకు పోస్టింగ్



అమరావతి,జూన్28 (ప్రజా మంటలు): వైకాపా ప్రభుత్వంలో కీలక హోదాల్లో వివాదాస్పదంగా పనిచేసి, ఈ నెలాఖరులో పదవీవిరమణ చేయనున్న ఇద్దరు సీనియర్ ఐఏఎస్ అధికారులకు రిటైర్మెంట్ ముంగిట పోస్టింగులు ఇచ్చి కూటమి ప్రభుత్వం హుందాగా వ్యవహరించింది. వారిలో ఒకరు మాజీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి కాగా, మరొకరు పూనం మాలకొండయ్య. గత ప్రభుత్వంలో సీఎస్‌గా పనిచేసిన జవహర్‌రెడ్డి.. నాటి అధికార పార్టీ పెద్దలతో అంటకాగడంతో పాటు ఎన్నికల్లో వైకాపాకు అనుకూలంగా వ్యవహరించినట్లు ఆరోపణలు మూటగట్టుకున్నారు. నాటి ప్రభుత్వ పెద్దలకు ప్రయోజనం చేకూర్చడం కోసం తీవ్రంగా శ్రమించారు. పింఛన్ల కోసం వృద్ధులు, అనారోగ్యంతో ఉన్నవారు కూడా మండుటెండలో బ్యాంకుల చుట్టూ తిరిగి ఇబ్బంది పడేలా చేశారు. సీనియర్ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు పోస్టింగ్ విషయంలో కూడా రిటైర్మెంట్ ముందు అమానవీయంగా, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించగా ఆయన కోర్టుకు వెళ్లి పోస్టింగ్‌కు అనుమతి పొందాల్సి వచ్చింది. ఇలాంటి వివాదాస్పద చర్యల కారణంగా ఎన్నికల ఫలితాల అనంతరం జవహర్‌రెడ్డిని కూటమి ప్రభుత్వం పక్కన పెట్టినా.. ఈ నెలాఖరుకు పదవీ విరమణ చేయనున్న నేపథ్యంలో పోస్టింగ్ ఇచ్చి హుందాగా వ్యవహరించింది. పోస్టింగ్ లేకపోతే అవమానకరంగా పదవీవిరమణ చేయాల్సి వచ్చేది. దీంతో ఆయనను ఈడబ్ల్యూఎస్ (ఆర్థికంగా వెనకబడిన వర్గాలు) సంక్షేమశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా నియమించింది. ప్రస్తుతం ఈ పోస్టులో ఉన్న అనంతరామును అదనపు బాధ్యతల నుంచి రిలీవ్ చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ గురువారం ఇచ్చిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. నిరీక్షణలో ఉన్న పూనం మాలకొండయ్యను సాధారణ పరిపాలన శాఖలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా నియమించారు. అక్కడ పనిచేస్తున్న పోలా భాస్కర్‌ను అదనపు బాధ్యతల నుంచి రిలీవ్ కావాలని ఆదేశించారు. పూనం మాలకొండయ్య వైకాపా హయాంలో నాటి సీఎం జగన్‌కు ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. ఆమె కూడా ఈ నెలాఖరులో రిటైర్ కానున్నారు. ఇటీవల కేంద్ర సర్వీసునుంచి ఏపీ కేడర్‌కు వచ్చిన పీయూష్ కుమార్‌ను సీఎంకు ముఖ్య కార్యదర్శిగా నియమించారు. ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శిగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. అక్కడ పనిచేస్తున్న ఎస్ఎస్ రావత్ సెలవులో ఉన్నారు. ఆయన్ను రిలీవ్ చేయాలని ఆదేశించారు.

## ఎసిబి డిజిగా అతుల్ సింగ్ నియామకం

### సీఐడీ అడిషనల్ డిజిగా రవిశంకర్ అయ్యన్నార్

అమరావతి,జూన్ 28 (ప్రజా మంటలు): ఎసిబి డిజిగా అతుల్ సింగ్ నియామకం అయ్యారు. సీఐడీ అడిషనల్ డైరెక్టర్ జనరల్‌గా రవిశంకర్ అయ్యన్నార్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్రంలో ముగ్గురు సీనియర్ ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం విశాఖపట్నం నగర పోలీస్ కమిషనర్‌గా ఉన్న రవిశంకర్ అయ్యన్నార్‌ను సీఐడీ అడిషనల్ డైరెక్టర్ జనరల్‌గా నియమించింది. అలాగే ఏపీఎస్పీ బెటాలియన్ అదనపు డీజీగా ఉన్న అతుల్ సింగ్‌ను ఏసీబీ డీజీగా బదిలీ చేసింది. ఇక శాంతిభద్రతల అదనపు డీజీ శంకబ్రత బాగ్చీని విశాఖపట్నం నగర పోలీస్ కమిషనర్‌గా నియమించింది. మరోవైపు గత వారంలో ముగ్గురు ఐపీఎస్ అధికారులను ఏపీ ప్రభుత్వం బదిలీ చేసిన సంగతి తెలిసిందే.

# పివి ఆర్థిక విధానాలను పట్టించుకోని మోడీ

ఇందిర ఎమర్జెన్సీని పదేపదే ప్రస్తావించి..కాంగ్రెస్‌ను ఇరుకున పెట్టే ప్రయత్నాలు చేస్తున్న ప్రధాని మోడీ.. ఆర్థిక సంస్కరణలపైనా ఇదే విధానం అవలంబిస్తే బాగుండేది. దార్శనికుడు దివంగత ప్రధాని పివి నరసింహారావు అనుసరించిన ఆర్థిక విధానాలను అవలోకనం చేస్తే మంచిది. ప్రపంచానికి ఆదర్శంగా మన ఆర్థిక విధానాలు అవలంబించి...కొడిగట్టిన భారత ఆర్థిక వ్యవస్థను దేదీప్యమానంగా వెలిగించిన మహాను భావుడు పాములపర్తి వెంకట నరసింహారావు అనడంలో సందేహం లేదు. గత పదేళ్లుగా దేశ అర్థికరంగం కుదేలయ్యింది. జిఎస్టీ గురించి పదేపదే గొప్పుల చెబుతున్న మోడీ రాష్ట్రపతి ప్రసంగంలోనూ దీనిని మరోమారు ప్రస్తావించారు. కానీ క్షేత్రస్థాయిలో జిఎస్టీ వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను మాత్రం పట్టించుకోవడం లేదు. డాలర్ మారకం రేటు పెరుగుతోంది. వడ్డీరేట్లు పెరుగుతున్నాయి.నిత్యావసర ధరలు అమాంతంగా పెరుగుతున్నాయి. ఇలా ఎందుకు జరుగుతుందో పరిశీలన చేసే ఓపికా,చిత్తశుద్ధి ప్రధాని మోడీకి లేదు. ఆయనకు ఎవరు సలహాలు ఇస్తున్నారో కానీ దేశ ఆర్థిక వ్యవస్థ మాత్రం బతికి బట్టకట్టేలా లేదు. సామాన్యులు దర్జాగా బతకగలిగిన నాడే జిడిపి లెక్కలు బాగున్నట్లు గుర్తించాలి. సామాన్యులు ఇల్లు కట్టుకున్ననాడే మన ఆర్థిక వ్యవస్థ బాగున్నట్లుగా గుర్తించాలి. ఇవన్నీ మోడీకి తెలియవా అంటే తెలుసు. కానీ తెలుసుకుని బాగుచేద్దామన్న సంకల్పమే కానరావడం లేదు. మోడీ ఆర్థిక విధానాలపై వారి లెక్కలు వారికి ఉన్నాయి. వారంతా మేం బ్రహ్మాండగా పాలిస్తున్నామని అనుకుంటున్నారు. పదేళ్ల తరవాత కూడా చావుదప్పి కన్నులొట్టబోయినట్లుగా, బొటాబొటి మెజార్టీతో అధికారంలోకి వచ్చినా... ప్రజలంతా మోడీకి జై కొట్టారని భావిస్తున్నారు. కానీ మోడీ తీసుకుంటున్న నిర్ణయాలు సామాన్యులకు చేటుగా మారాయి. ఉదాహరణకు జిఎస్టీకి సంబంధించి తీవ్ర ప్రభావం చూపుతున్న నిర్ణయాలపై చర్చించడం లేదు. అప్పు చేసి, పొదుపు చేసుకుని హెల్త్ ఇన్సూరెన్స్, లైఫ్ ఇన్సూరెన్స్ కడుతున్నవారు జిఎస్టీ రూపంలో భారీగగా పన్నులు కట్టి నష్టపోతున్నారు. పాలసీలపై బాదుడు దారుణంగా ఉంది. పేద, మధ్య తరగతి ప్రజలు చెమటోడ్చి కడుతున్న పాలసీలపై 18 శాతం జిఎస్టీ కట్టించుకుంటున్నారు. ఇంతమొత్తంలో కట్టడం వల్ల సామాన్యులు కుదేలవుతున్నారు. దీనిపై ఎవరు కూడా చర్చించడం లేదు. ఇలాంటి బాదుళ్లు ఎన్నో ఉన్నాయి. వీటిని ఎక్కడా చర్చించడం లేదు. రాజనీతిజ్ఞత,ఆర్థిక సంస్కరణాలాభిలాష అన్నవి ప్రతిభ ఉండి అమలు చేయగల ధైర్యం ఉన్న నేతకు మాత్రమే సొంతం. ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన నాటికి దేశాన్ని కుదిపి వేస్తున్న ఆర్థిక సంక్షోభాన్ని చాకచక్యం గా పరిష్కరించి, దేశానికి బంగారు బాట వేసిన ధీశాలి పివి నరసింహారావు. దేశానికి అవసరమైన ఆర్థిక,రాజకీయ సంస్కరణలతో ముందుకు సాగిన రాజనీతిజ్ఞుడు పీవీ. కానీ ఆయన సంస్కరణలను మరింత ముందుకు తీసుకుని వెళ్లేలా తరవాతి ప్రభుత్వాలు విఫలం అయ్యాయి. పదేళ్లపాటు యూపిఎ ప్రభుత్వంలో ప్రధానిగా ఉన్న నాటి ఆర్థికమంత్రి మన్మోహన్ సింగ్ కూడా మళ్లీ వీటిని సమర్థంగా ముందుకు తీసుకుని వెళ్లలేకపోయారు. నేటి ప్రధాని మోడీ హయాంలో కూడా ఆర్థిక విధానాలు సక్రమంగా అమలు కావడం లేదు. తాను తీసుకుని వచ్చిన జిఎస్టీ గురించి గొప్పలు చెప్పడమే తప్ప అవి ప్రజలపై ఏ మేరకు విష ప్రభావం చూపుతున్నాయో గమనించడం లేదు. బిజెపిలో ఉన్న నేతలు కూడా దీనిగురించి చర్చించడం లేదు. ఇప్పుడు ఎన్‌డిఎ పక్షాలు అయినా ఈ జిఎస్టీ బాదుడు గురించి చర్చించాలి. లేకుంటే వారిని కూడా ప్రజలు క్షమించారు. ఆర్థిక సంస్కరణ అన్నది ప్రజలను కష్టాలు, నష్టాల నుంచి గట్టెక్కించేలా ఉండాలి. కానీ జిఎస్టీతో కష్టాలు, నష్టాలే తప్ప ప్రజలకు ఒనగూరు తున్న ప్రయోజనం లేదు. బ్యాంకులు దివాళా తీయడం మొదలు, బ్యాంకులకు లక్షల కోట్లు ఎగవేసిన కొందరు విదేశాలకు ఉడాయించారు. ఇలాంటి మోసాలను నిరోధించేలా మోడీ చర్యలు తీసుకోలేక పోయారు. మరో పదేళ్లు మోడీ అధికారంలో ఉన్నా ఇవి సాధ్యపడవని గుర్తించాలి. బ్యాంకులకు రుణాలను ఎగవేసి, దేశాన్ని ముంచేసి పారిపోయిన వారిని వెనక్కి రప్పించి కఠిన చర్యలు తీసుకోవడంలో మోడీ విఫలం అయ్యారు. ఎందరో ఎంపిలు, మంత్రుల్లో ఆర్థిక ఎగవేతదారులుగా ఉన్నా వారిపై చర్యలు తీసు కోవడం లేదు. అందుకే ఆనాటి పరిస్థితులను నేటితో పోల్చుకోవాల్సి వస్తుంది. పివి తీసుకున్న నిర్ణయాల వల్ల సామాన్యులకు ఎంతో మేలు జరిగింది. ఆధునిక భారతంలో ఆర్థిక సంస్కరణలను మనదేశం అవలబిం చడం వల్లనే ఇవాళ మనమంతా ఈ స్థితిలో ఉన్నాం అని చెప్పుకోవడానికి దివంగత ప్రధాని పివి నరసింహా రావును నిత్యం స్మరించుకోవాల్సింది. ఆర్థిక సంస్కరణలను ప్రతిపాదించినప్పుడు యధావిధిగానే కమ్యూనిస్టులు వ్యతిరేకించారు. అయితే ఆయన ధైర్యంగా వీటిని ముందుకు తీసుకుని వెళ్లి అమలు చేసిన ధీశాలి. పివి సంస్కరణలతో ప్రపంచంతో వాణిజ్యం పెరగడమే గాకుండా,మన యువత విదేశాలకు చదువులకు, ఉద్యోగాలకు వెళ్లగలిగే అవకాశాలను అందిపుచ్చుకున్నారు. దేశం తీవ్ర ఆర్థికసంక్షోభంలో ఉన్నప్పుడు ,ఊహించని రీతిలో ఆర్థిక సంస్కరణలు ప్రవేశపెట్టి మార్కెట్ సరళీకరణ విధానాన్ని రూపొందించి భారత్‌కు మార్గాన్ని చూపారు. ఇప్పుడా మార్గంలోనే మన ఆర్థిక వ్యవస్థ నడుస్తోంది. ఆయన చూపిన బాట నుంచి పక్కకు తప్పినప్పుడల్లా మళ్లీ సంక్షోభాలు ఎదుర్కొంటున్నాం.సంక్షోభ సమయంలో, ఆర్థిక వ్యవస్థ గాడితప్పుతున్న నేపథ్యంలో, ప్రతి ఒక్కరికీ పీవీ ఆర్థిక సంస్కరణలే గుర్తుకు వస్తున్నాయి. రాజకీయాల్లో అరుదైన వ్యక్తిత్వాలు కలిగిన వారు బహు అరుదుగా వస్తుంటారని పివి ఆనాడే నిరూపించారు. అలాగే పదవుల కోసం వెంపర్లాడుతున్న నేటి రాజకీయాల్లో పదవులు వాటంతటవే వెతుక్కుంటూ రావడం...వాటికి వన్నె తేవడం కూడా పివికి మాత్రమే దక్కింది. ఆనాడు పివి అనే మహానుభావుడు ప్రధాని కాకుంటే భారత ఆర్థికస్థితి ఏమయ్యేదో అన్న భయం ఇప్పుడు కలుగుతోంది. అలాంటి మహానుభావుడు పివి రూపంలో భారతదేశానికి సాక్షాత్కరించడం కూడా దేశం చేసుకున్న అదృష్టంగా చూడాలి. భారతదేశ ఆర్థికి స్థితిగతులను బేరీజు వేసుకున్నప్పుడు పివికి ముందు పివి తరవాత అన్న లెక్కలు వేసుకునే స్థితి మనది. రాజకీయాల్లో రాణించడం కోసం ఎత్తులు పై ఎత్తులు వేస్తూ..ఎదుటి వారిని బురిడీ కొట్టించడం అవసరమైతే ప్రత్యర్థులను మట్టుపెట్టడం లాంటి నేటితరం రాజకీయాల్లో అరుదైన వ్యక్తిత్వం కలిగిన మహానుభావుడు దివంగత పివి నరసింహారావు. ఆయన పాలనా సంస్కరణలతో దేశానికి అలాగే కాంగ్రెస్ పార్టీకి చరిత్రలో లిఖించదగ్గ ఘట్టాలను అందించారు. రాజకీయాల్లో స్థితప్రజ్ఞత ఉన్న అరుదైన నేతల్లో పివి ముందుంటారు. ఆయన స్వార్థం కోసం ఏనాడూ రాజకీయాలు చేయలేదు. అలాగే ఆయనలోని స్వార్థం దేశానికి మంచి చేయాలన్న తపన తప్ప మరోటి కాదు. అపర చాణుక్యుడు అంటూ ఆయనను కీర్తించినా రాజకీయాల కోసం తన చాణక్యాన్ని ఎప్పుడూ ప్రదర్శించలేదు. రాజకీయాలను ఆమూలాగ్రం ఔపోసన పట్టిన ఘటికుడు ఆయన. అందుకే వాటిని అర్థం చేసుకుని అందుకు అనుగుణంగా పాలన చేసి..తిరుగలేని నేతగా రుజువు చేసుకున్నారు.

## కవిత్వం

### పాలిట్రిక్స్

ప్రభువులంతా ఒక్కటే
ప్రజలు మాత్రమే వేరు,
మీ సేవకులమంటూ
మెత్తగా గద్దెనెక్కుతారు!

పన్నులతో వెన్నుపోటు
తెలివిగా పొడుస్తారు,
నొప్పిలేకుండా చేసి
సంపద నొక్కుతారు !

## మనమే ఆక్రమించుకున్నాం

కార్తీక్ ఎంచక్కా వాళ్ళ నాన్నమ్మతో ఆటలాడుకుంటున్నాడు. ఇంట్లో మిగిలిన వారు ఎవరి పని వారు నిశ్శబ్దంగా చేసుకుంటున్నారు.కొద్దిసేపటికి అమ్మ కార్తీక్ ను స్నానం చేయడానికి రమ్మని పిలవడానికి వరండా వైపు వస్తోంది, ఆమెకు ఆ పక్కనే గోడకు ఆనుకొని ఉన్న బీరువా క్రీడ ఏదో కదిలిన శబ్దం వచ్చింది. కాస్త ఆగి ఏమైై ఉంటుందా అని తరచి చూస్తే, ఒక పాము దాని కింద ఉన్న ఖాళీ స్థలంలో నక్కి ఉంది.

దీంతో ఏమాత్రం ఆలస్యం చేయకుండా "పాము...పాము..."అని అరవడం మొదలు పెట్టింది. అది విన్న ఇంట్లో అందరూ ఆమె వైపు పరుగులు తీశారు.
అక్కడికి వచ్చిన అందరికీ పాము నక్కి ఉన్న ప్రదేశాన్ని చూపిస్తూ దాని పొడవు , వెడల్పుల గురించి చెప్పడం ప్రారంభించింది. అక్కడున్న వారిలో ఒకరు "దాన్ని త్వరగా కొట్టి చంపెయ్యండి " అన్నారు. మరొకరు " అక్కడ మంట పెట్టండి అదే చనిపోతుంది"
అన్నారు. ఇంకొకరు "కట్టెతో దూరం నుంచి కదపండి ,అదే వెళ్ళిపోతుంది "అన్నారు.
మరొకరు" వెళ్ళి పాలు పట్టుకు రండి, నాగదేవత తాగితే మంచిది " అన్నారు.
ఇలా ఒక్కక్కరు ఒక్కోక్కటి చెబుతూ ఉండగానే పక్కనే ఉన్న నాన్న ఎప్పుడు ఫోన్ చేసి పిలిచాడో తెలియదు కానీ అక్కడికి క్షణాల్లో వాలిపోయారు నాయుడు గారు. ఆయన మా ఊర్లో పాములు పట్టడంలో దిట్ట, మొదట పాము కనపడితే అక్కడ అందరికీ గుర్తు వచ్చేది ఆయనే. .
అక్కడికి వచ్చిన ఆయన తన చేతికి ఒక ప్లాస్టిక్ తొడుగు పెద్దది వేసుకొని, చేతిని చాకచక్యంగా ఆడిస్తూ దాన్ని మెల్లగా తన చేతిలోకి తీసుకొని తనతో పాటు తెచ్చిన ఒక సంచిలో వేసుకున్నారు. ఆయన దాన్ని ఊరికి దూరంగా ఉన్న అడవిలో వదిలేస్తారు.
ఇదంతా ఆశ్చర్యంగా చూస్తున్న కార్తీక్ దగ్గరకు వచ్చిన ఆయన తలపై చేయి వేసి నిమిరారు.
అంకుల్ మిమ్మల్ని ఒకటి అడగొచ్చా అన్నాడు కార్తీక్, అడగమని నవ్వుతూ అన్నారు ఆయన. "ఇక్కడున్న ఇంతమంది పాముకు భయపడుతుంటే మీరు మాత్రం ఎలా దాన్ని అంత తేలికగా పట్టుకున్నారు?" అని అడిగాడు.
దానికి నవ్విన ఆయన " అవి కూడా మనలాంటి ప్రాణులే, మనం వాటికి హాని కలిగిస్తేనే అవి మనకు హాని చేస్తాయి , లేకపోతే అవి మనలను ఏమి అనవు" అన్నాడు.
"అవి అడవిలో, పొదల్లో ఉండకుండా ఇక్కడికి రావడం వల్లే కదా మనం వాటిని చంపాలి అనుకుంటాం "అన్నాడు మెల్లగా , అందుకు ఆయన " చూడు నువ్వు చెప్పింది అక్షరాలా నిజం , ఒకప్పుడు మనం ఉంటున్న ఊరు ఇంత లేదు.ఇదంతా అడవి , మనం జనాభా పెరగడం వల్ల అడవిలోని పచ్చని చెట్లను కొట్టేసి ఇండ్లు కట్టుకున్నాం, ఇప్పుడు చెప్పు వాటి స్థానంలోకి మనం వచ్చామా?, మన స్థానంలోకి అవి వచ్చాయా?" అన్నారు. దీంతో నిజమే కదా అనుకున్నాడు కార్తీక్.
"అంకుల్ నాకు ఇంకో అనుమానం అడగొచ్చా?" అన్నాడు కార్తీక్.అడగమన్నారు నాయుడు గారు,
" మీరు పామును అలా పట్టుకున్నారు కదా అది మిమ్మల్ని ఏమీ చేయదా?" అన్నాడు కార్తీక్.
"ఎందుకు అనవు కొన్ని సార్లు అవి కాటు వేస్తాయి , కానీ అన్ని జాగ్రత్తలు తీసుకొని చేయాలి. అందరూ అలా భయపడి వదిలేస్తే , వాటిని చంపేస్తారు జీవులు అన్నీ బతికినప్పుడే భూమిపైన జీవులు సమతుల్యంగా ఉంటాయి" అన్న ఆయన మాటలు అర్థం చేసుకున్న కార్తీక్ అప్పటి నుండి జంతువులపై ప్రేమను పెంచుకున్నాడు.

సింగంపల్లి శేష సాయి కుమార్
రాజంపేట, 8639635907





### కథల రచయితలకు ఆహ్వానం

గత రెండున్నర సంవత్సరాలుగా "ప్రజా మంటలు" జాతీయ దినపత్రికలో ప్రతిరోజూ ఒక పిల్లల కథను ప్రచురిస్తున్నవిషయం తెలిసిందే. రెండు తెలుగు రాష్ట్రాలలోని పేరున్న రచయితలతో పాటుగా, కొత్త రచయితలు, విద్యార్థులు కూడా తమ కథలను పంపుతున్నారు. ఒక రచన ప్రచురించడానికి కనీసం 20-30 రోజులు పడుతుందని గ్రహించండి. ప్రచురణ విషయంలో ఉత్తరప్రత్యుత్తరాలకు తావు లేదు. మీ రచనలు నెట్ బ్రౌజింగ్ చేసుకొని www.prajamantalu.com లో ప్రతి రోజు చదువుకోండి. మీరు కూడా మీ కథలను హామీ పత్రంతో, ఈమెయిల్ కు పంపండి.
mantalukathalu@gmail.com



# భారతీయ గణాంకాల పితామహుడు మహలనోబిస్

# భారత ఆర్థిక వ్యవస్థ దిశానిర్దేశకుడు మహల

## .. పి.సి.మహలనోబిస్ జయంతి



రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

ప్రశాంత్ చంద్ర మహలనోబిస్ (1893 జూన్ 29 - 1972 జూన్ 28) భారతీయ శాస్త్రవేత్త, అనువర్తిత గణాంకశాస్త్రవేత్త. భారత ప్రణాళిక వ్యవస్థకు పితామహుడు జవహర్ లాల్ నెహ్రూ అయితే, భారత ప్రణాళిక పథానికి పి.సి.మహలనోబిస్ నిర్దేశకుడిగా ప్రసిద్ధిచెందాడు. అతను గణాంక కొలత అయిన "మహలనోబిస్ డిస్టెన్స్" ద్వారా గుర్తింపబడ్డాడు. ఆయన భారతదేశ మొదటి ప్లానింగ్ కమీషన్ సభ్యుడు. ఇండియన్ స్టాటిస్టికల్ ఇనిస్టిట్యూట్ ను స్థాపించాడు.


1893లో కోల్‌కతలో జన్మించిన మహలనోబిస్ భౌతిక శాస్త్రంలో శిక్షణ పొంది, అధ్యాపకుడిగా, ప్రిన్సిపాల్ గా రిటైరైనాడు. అతనికి గణాంక శాస్త్రంలో కల ఆసక్తి కారణంగా ఆ రంగంలో నైపుణ్యం సాధించి చివరికి ఆ రంగంలోనే జగత్ప్రసిద్ధి చెందినాడు. గణాంక శాస్త్ర రంగంలో అతని సేవలకు గుర్తింపుగా లండన్ లోని రాయల్ సొసైటీ పెల్లోగా ఎన్నికయ్యాడు. 1946లో ఐక్యరాజ్య సమితి గణాంక శాస్త్ర కమిషన్ సభ్యుడిగా, 1949లో కేంద్ర మంత్రివర్గపు గణాంక శాస్త్ర గౌరవ సలహా దారుడిగా నియమించ బడ్డాడు. 1950లో నేషనల్ శాంపిల్ సర్వే స్థాపనలో మహలనోబిస్ కీలకపాత్ర వహించాడు. 1949 జాతీయాదాయ కమిటీ చైర్మెన్ గా మహలనోబిస్ జాతీయాదాయ గణాంకాలకు ప్రాతిపదిక స్వరూపాన్ని ఇచ్చాడు. 1955 నుండి 1967 వరకు ప్రణాళిక సంఘం సభ్యుడిగా తన సేవలందించాడు. రెండో పంచవర్ష ప్రణాళిక రూపకల్పనలో అతని కృషి అనిర్వచనీయం. భారీ పరిశ్రమలకు అధిక ప్రాధాన్యత ఇచ్చిన ఆ ప్రణాళిక నమూనా మహలనోబిస్ నమూనా గా ప్రసిద్ధిగాంచింది.

1893 జూన్ 29 న కోల్‌కతలో జన్మించిన మహలనోబిస్ పూర్తి పేరు ప్రశాంత్ చంద్ర మహలనోబిస్. ఆయన పూర్వీకుల స్వస్థలం నేటి బంగ్లాదేశ్ ప్రాంతం. జీవనోపాధి కోసం మహలనోబిస్ తాత కోల్‌కత ప్రాంతానికి చేరి స్థిరపడ్డాడు. మహలనోబిస్ బాల్యం, విద్యాభ్యాసం కూడా కోల్‌కత లోనే కొనసాగింది. ప్రెసిడెన్సీ కళాశాలలో ఆయనకు జగదీష్ చంద్రబోస్, ప్రఫుల్ల చంద్ర రే బోధించారు.

1912లో భౌతిక శాస్త్రం (ఆనర్స్) లో పట్టభద్రుడయ్యాడు. మహలనోబిస్ 1913 లో లండన్ బయలుదేరి కేంబ్రిడ్జ్ లోని కింగ్స్ కాలేజీలో చేరాడు. గణిత శాస్త్రం, భౌతిక శాస్త్రం అభ్యసించాడు. గణిత శాస్త్రజ్ఞుడు శ్రీనివాస రామానుజన్‌ను విశ్వ విద్యాలయంలో కలిశాడు. అభ్యసనం పూర్తి కాగానే మహలనోబిస్ కోల్ కత లోని ప్రెసిడెన్సీ కళాశాలలో భౌతిక శాస్త్ర అద్యాపకుడిగా ప్రవేశించాడు. 30 సంవత్సరాల పాటు సేవలందించి చివరగా ప్రిన్సిపాల్ గా రిటైరయ్యాడు.

పి.సి.ఎం గా స్నేహితులచే పిలువబడిన ఆయన...
ప్రమథ నాథ్ బెనర్జీ (మింటో ప్రొఫెసర్ ఆఫ్ ఎకనామిక్స్), నిఖిల్ రంజన్ సేన్ (ఖైరా ప్రొఫెసర్ ఆఫ్ అప్లైడ్ మ్యాథమెటిక్స్) మరియు సర్ ఆర్ఎన్ ముఖర్జీలతో కలిసి, మహలనోబిస్ 1932 లో ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్స్టిట్యూట్ ను స్థాపించారు. ఆ సంస్థ 1959 లో జాతీయ ప్రాముఖ్యత కలిగిన సంస్థగా ప్రకటించ బడింది. 1933లో భారత గణాంక శాస్త్ర పత్రిక సాంఖ్య ప్రచురణను ఆయన ప్రారంభించాడు. 1940 లలో శాంపిల్ సర్వే మీద అతను సాగించిన పరిశోధనల ఫలితంగా 1950లో నేషనల్ శాంపిల్ సర్వే స్థాపితమైంది.

ప్రెసిడెన్సీ కళాశాల అద్యాపకుడిగా ఉన్నపుడే గణాంక శాస్త్రజుడిగా ప్రసిద్ధిచెందాడు. అతను గణాంక శాస్త్రంలో చేసిన సేవలకు గుర్తింపుగా 1945లో లండన్ లోని రాయల్ సొసైటీ ఫెలోగా ఎన్నికయ్యాడు. 1946లో ఐక్యరాజ్య సమితి గణాంక కమిషన్ సభ్యుడిగా నియమించ బడ్డాడు.1949లో కేంద్ర మంత్రివర్గపు గణాంక శాస్త్ర గౌరవ సలహాదారుడిగా నియమించ బడ్డాడు. దీనితో దేశానికి ఆర్థిక, గణాంక సేవలందించడానికి అవకాశం లభించింది. 1950 ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ అధ్యక్ష ఉపన్యాసంలో జాతీయ ప్రణాళిక విధానంలో గణాంక శాస్త్రం అంతర్భాగం అని పేర్కొన్నాడు. భారతీయ గణాంక సంస్థ (ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్స్టిట్యూట్) స్థాపనలో ప్రముఖ పాత్ర వహించాడు. స్థూల జాతీయోత్పత్తి, సంబంధిత ఇతర అంశాలను అంచనా వేయడం ఈ సంస్థ బాధ్యత. జాతీయాదాయ కమిటీ చైర్మెన్ గా మహలనోబిస్ జాతీయాదాయ లెక్కలకు ప్రాతిపదిక స్వరూపాన్ని రూపొందించాడు. సోవియట్ యూనియన్ ప్రణాళిక విధానానికి ప్రభావితుడైన జవహర్ లాల్ నెహ్రూ దేశంలో కూడా ఒక ప్రణాళిక కార్యక్రమానికి శ్రీకారం చుట్టు దశలో పి.సి.మహలనోబిస్ ప్రణాళిక విధాన రంగంలో ప్రవేశించాడు. 1950లో ప్రణాళిక సంఘం స్థాపితమైనప్పటి నుంచి గణాంక శాస్త్ర సలహాదారుడిగా సేవలందించాడు. 1955 నుండి 1967 ప్రణాళిక సంఘం సభ్యుడిగా నియమించ బడ్డాడు. ముఖ్యంగా భారీ పరిశ్రమలకు ప్రాముఖ్యం ఇచ్చిన రెండో పంచవర్ష ప్రణాళిక రూపకల్పనలో పి.సి.మహలనోబిస్ పాత్ర అనిర్వచనీయం. ఇది మహలనోబిస్ నమూనాగా ప్రసిద్ధి చెందినది. వర్తమాన ఆర్థిక వ్యవస్థకు ఉపయోగ కరమైన ప్రమాణాలను మహలనోబిస్ రెండో పంచవర్ష ప్రణాళికలో ప్రవేశ పెట్టాడు. ప్రణాళిక ఆలోచనలకు నిర్దిష్ట రూపం కల్పించడంలో మహలనోబిస్ ఎంతో సహకరించాడు. రవీంద్రనాథ్ ఠాగూర్‌కు కార్యదర్శిగా పనిచేశాడు. విశ్వ భారతి విశ్వ విద్యాలయంతో కూడా సంబంధం కలిగి ఉన్నాడు.



1944లో ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయం నుంచి వెల్డన్ మెడల్ పురస్కారం సొంతం చేసుకున్నాడు.1945లో లండన్ లోని ఫెలో ఆఫ్ ది రాయల్ సొసైటీ సభ్యత్వం పొందాడు.1957లో అంతర్జాతీయ గణాంక సంస్థ గౌరవ అధ్యక్షుడిగా హెూదా పొందాడు.1968లో భారత ప్రభుత్వము పద్మ విభూషణ్ పురస్కారం చే గౌరవించింది. భారత ఆర్థిక వ్యవస్థకు దిశానిర్దేశం చేసిన మహలనోబిస్ తన డెబ్బై తొమ్మిదవ పుట్టినరోజుకు ఒక రోజు ముందు, జూన్ 28, 1972 న మరణించాడు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్, మహలనోబిస్ గౌరవార్థం జూన్ 29 ను జాతీయ గణాంక దినోత్సవంగా ప్రకటించారు.

# జులై 1 నుంచి అమల్లోకి రానున్న కొత్త న్యాయ చట్టాలు

జగిత్యాల జూన్ 28 (ప్రజామంటలు):



జులై 1 నుంచి కొత్త న్యాయ చట్టాలు అమల్లోకి రానున్నాయి.భారతీయ నాగరిక్ సురక్ష సంహిత 531 సెక్షన్లు, భారతీయ న్యాయ సంహిత 358 సెక్షన్లు,భారతీయ సాక్ష్యం అధినియమం 170 సెక్షన్లు తో నేర దర్యాప్తు,విచారణ ప్రక్రియ లో కీలక మార్పులు రానున్నాయి.ఆ కీలక మార్పుల్లో కొన్ని ముఖ్యమైన అంశాలను జగిత్యాల పట్టణ న్యాయవాది,సీనియర్ సిటీజేన్స్ జిల్లా అధ్యక్షుడు హరి ఆశోక్ కుమార్ ఇలా వివరించారు. భాదితులు పోలీసు స్టేషన్ కు వెల్లకుండానే ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్ ద్వారా జరిగిన సంఘటనను ఫిర్యాదు చేయవచ్చు. జీరో ఎఫ్.ఐ.ఆర్ ప్రకారం.... ఏ వ్యక్తి అయినా పోలీసు స్టేషన్ పరిధి తో సంబంధము లేకుండా ఏ స్టేషన్లో అయినా ఫిర్యాదు చేయొచ్చు. అరెస్ట్ సందర్భాల్లో భాదితులు తమ సన్నిహితులకు,బంధువులకు తన పరిస్థితిని తెలియజేసే హక్కు ఉంటుంది. అరెస్టుల వివరాలను స్థానిక పోలీసు స్టేషన్ తో పాటు జిల్లా ప్రధాన కేంద్రాల్లో బహిరంగంగా ప్రదర్శిస్తారు. హేయమైన నేరాల్లో ఇక నుంచి ఫోరెన్సిక్ నిపుణులు తప్పని సరి.

**మహిళలు, చిన్నారులపై జరిగే నేరాల పరిష్కారానికి దర్యాప్తు 2 నెలల్లోనే పూర్తి కావాలి.**

ఇక సమన్లు ఎలక్ట్రానిక్ విధానం ద్వారా పంపచ్చు. మహిళా నేరాలకు సంబంధించి బాధితురాలి వా0గ్మూలాన్ని మహిళా మేజిస్ట్రేట్ ముందు నమోదు చేయాలి. వారు లేని పక్షంలో మహిళా సిబ్బంది సమక్షంలో పురుష మేజిస్ట్రేట్ ఎదుట హాజరు పరచాలి. బాదితులతో పాటు నిందితులు కూడా ఎఫ్.ఐ.ఆర్. నకళ్లను ఉచితంగా పొందే వీలుంది. వీటితో పాటు పోలీసు రిపోర్ట్,ఛార్జ్ షీట్ ,స్టేట్మెంట్స్,ఇతర డాక్యుమెంట్లను 14 రోజుల్లోగా పొంద వచ్చును. కేసు విచారణలో అనవసర జాప్యాన్ని నివారణకు సకాలంలో న్యాయం అందేలా చెయడానికి న్యాయ స్థానాలు కూడా గరిష్టముగా రెండు వాయిదాలు మాత్రమే మంజూరు చేస్తాయి. సాక్షుల భద్రతను,వారి సహకారాన్ని దృష్టిలో ఉంచుకొని సాక్షుల రక్షణ పథకాన్ని అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చెయ్యాలి. అత్యాచార నేరాల కేసుల్లో బాధితురాలి వాంగ్మూలం ను ఆడియో,వీడియో ద్వారా పోలీసులు నమోదు చెయ్యాలి. మహిళలు, దివ్యంగులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులతో పాటు 15 ఏళ్ల లోపు పిల్లలు,60 ఏళ్ల కంటే ఎక్కువ వయస్సున్న వారు పోలీసు స్టేషన్కు వెళ్లడం నుంచి మినహాయింపు ఉంటుంది.వారు తామున్న చోటు నుంచే పోలీసుల సాయం పొందొచ్చని కొత్త చట్టాల్లోని కొన్ని కీలక మార్పుల అంశాలను న్యాయవాది హరి ఆశోక్ కుమార్ వివరించారు.

# తెలంగాణ రాష్ట్ర క్రీడా పాఠశాల జిల్లా స్థాయి ఎంపిక పోటీలు

జగిత్యాల జూన్ 28 (ప్రజామంటలు):



జిల్లా కేంద్రంలోని స్వామి వివేకానంద మినీ స్టేడియంలో శుక్రవారం తెలంగాణ రాష్ట్ర క్రీడ పాఠశాల జిల్లా స్థాయి ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా యువజన మరియు క్రీడల శాఖ అధికారి డాక్టర్ కోరుకంటి రవికుమార్ మాట్లాడుతూ.... ఇందులో 35 మంది అమ్మాయిలు 40 మంది అబ్బాయిలు పాల్గొనడం జరిగిందని. ఇందులో ప్రతిభ కనబరిచిన 20 అమ్మాయిలను 20 అబ్బాయిలను జూలై 8న హకీంపేట్ స్పోర్ట్స్ స్కూల్ లో నిర్వహించే రాష్ట్రస్థాయి ఎంపికకు పంపడం జరుగుతుందని జిల్లా యువజన మరియు క్రీడల శాఖ అధికారి తెలిపారు. ఈ కార్యక్రమంలో యువజన మరియు క్రీడల శాఖ అధికారి కార్యాలయ సిబ్బంది లోకే రమేశ్ కుమార్, పేట జిల్లా అధ్యక్షులు పడాల విశ్వ ప్రసాద్, స్కూల్ గేమ్ ఫెడరేషన్ జిల్లా సెక్రెటరీ లక్ష్మీ రామ్ నాయక్, పీడీలు శ్రీనివాస్, రవీందర్ కృష్ణ ప్రసాద్, కోటేశ్వర్, అజయ్ బాబు, జమున రాణి, వేణు, మల్లేశ్వరి, భాస్కర్, వెంకటలక్ష్మి, కవిత, విద్యాసాగర్, విజయ మరియు పిటిలు పాల్గొన్నారు .

# టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షా ఫలితాలు

హైదరాబాద్ (ప్రజామంటలు):

తెలంగాణ పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షా ఫలితాలు శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు విడుదలయ్యాయి. సప్లిమెంటరీ ఫలితాల్లో 73.03 శాతం ఉత్తీర్ణత నమోదైంది. జూన్ 3 నుంచి 13వ తేదీ వరకు నిర్వహించిన పరీక్షలకు 51,272 మంది విద్యార్థులు రిజిస్టర్ చేసుకోగా, 46,731 మంది హాజరయ్యారు. వీరిలో 34,126 మంది ఉత్తీర్ణత సాధించారు. బాలురు 71.01 శాతం ఉత్తీర్ణత నమోదు చేయగా, బాలికలు 76.37 శాతం ఉత్తీర్ణత సాధించి తమ సత్తా చాటారు. బాలుర కంటే బాలికలు 5.36 శాతం అధికంగా ఉత్తీర్ణత నమోదు చేశారు. నిర్మల్ జిల్లా 100 శాతం ఉత్తీర్ణత సాధించి ప్రథమ స్థానంలో నిలిచింది. వికారాబాద్ జిల్లా 42.14 శాతం ఉత్తీర్ణత నమోదు చేసి చివరి స్థానంలో నిలిచింది. ఫలితాల కోసం ఈ వెబ్‌సైట్‌ను క్లిక్ చేయొచ్చు. రీకౌంటింగ్ చేయించాలనుకునే విద్యార్థులు ఒక్కో స్జబెక్ట్‌కు రూ. 500 చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. రీకౌంటింగ్ కోసం జులై 8వ తేదీ లోపు ఎస్బీఐ బ్యాంక్ ద్వారా చలాన్ చెల్లించాలి. ఆ చలాన్‌తో పాటు దరఖాస్తును ఎస్సెస్సీ బోర్డులో సమర్పించాలి. డిమాండ్ డ్రాఫ్టులు అంగీకరించబడవు అని అధికారులు స్పష్టం చేశారు.


# తెలంగాణకు జాతీయ రహదారుల హైలెవల్ కమిటీ

**- వచ్చేవారం పర్యటించే అవకాశం**

**- వివరాలతో అధికారులు సిద్ధంగా ఉండాలి - మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి**

హైదరాబాద్ (ప్రజామంటలు):

వచ్చే వారంలో జాతీయ రహదారుల హైలెవల్ కమిటీ, రాష్ట్ర పర్యటనకు వస్తుందని రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో అన్ని అంశాలతో అధికార యంత్రంగం సిద్ధంగా ఉండాలని ఆ శాఖ అధికారులకి ఆయన స్పష్టం చేశారు. మన్నెగూడ రహదారికి మార్గం సుగమం చేసేందుకు, ఎన్జీటీ ఆదేశానుసారం 915 చెట్లను రీలొకేట్ చెయ్యాలని అధికారులకు సూచించారు. ఎల్బీనగర్– మల్కాపూర్ జాతీయ రహదారి విస్తరణ పనులపై మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సమీక్ష నిర్వహించారు. రహదారి విస్తరణ పనులకి అడ్డుగా ఉన్న వాటర్ లేన్, ట్రాన్స్– కో సమస్యలపై సంబంధిత అధికారులతో మాట్లాడానని ఆయన తెలిపారు. వెంటనే పనులు ప్రారంభించాలని, ఎక్కడ అలసత్వం ఉండొద్దు అని అధికారులకి సూచించారు. న్యాక్?లో జాతీయ రహదారులపై రోడ్లు, భవనాల శాఖ అధికారులతో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. వచ్చే వారంలో జాతీయ రహదారుల హైలెవల్ కమిటీ రాష్ట్రానికి వస్తుందని, అన్ని అంశాలతో అధికార యంత్రంగం సిద్ధంగా ఉండాలని రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆ శాఖ అధికారులకి సూచించారు. మన్నెగూడ రహదారికి మార్గం సుగమం చేసేందుకు, ఎన్జీ?టీ ఆదేశానుసారం 915 చెట్లను రీలొకేట్ చెయ్యాలని ఆయన అధికారులకు సూచించారు.కాంట్రాక్టు సంస్థ 300 చెట్లను రీలొకేట్ చేసేందుకు సిద్ధంగా ఉందని మంత్రి కోమటిరెడ్డి పేర్కొన్నారు. మిగతా 615 చెట్లను అటవీ శాఖ ఆధ్వర్యంలో జాతీయ రహదారుల అధికారులు రీలొకేట్ చేయాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఈ ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని జాతీయ రహదారుల ప్రాంతీయ అధికారి రజాక్?ను ఆదేశించారు. రీజనల్ రింగ్ రోడ్, ఎన్?హెచ్– 65, మన్నెగూడ, ఆర్మూర్–మంచిర్యాల జాతీయ రహదారులపై మంత్రి కోమట్ రెడ్డి వెంకట్ రెడ్డి సమీక్ష చేశారు. ప్రజల ప్రాణాలు పోతుంటే నిర్లక్ష్యం వహించవద్దని అధికారులకు స్పష్టం చేశారు. వేగంగా పనులు పూర్తిచేసి ప్రజల మన్ననలు పొందాలన్నారు.గడ్కరీతో భేటీ.. ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి, కోమటిరెడ్డితో కలిసి కేంద్రమంత్రి గడ్కరీతో సమావేశమైన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా రాష్ట్రంలో జాతీయ రహదారుల విస్తరణ, నూతన జాతీయ రహదారుల ప్రకటన, ఇప్పటికే జాతీయ రహదారులుగా ప్రకటించిన మార్గాల పనుల ప్రారంభం తదితర విషయాలను కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. కేంద్రమంత్రితో సమావేశం అనంతరం జాతీయ రహదారుల హైలెవల్ కమిటీ రాష్ట్ర పర్యటన చేస్తోంది.మరోవైపు రాష్ట్రానికి కీలకం కానున్న రీజనల్ రింగ్ రోడ్డులోని సంగారెడ్డి నుంచి నర్సాపూర్–తూప్రాన్–గజ్వేల్–జగదేవ్‌పూం–భువనగిరి–చౌటుప్పల్ రహదారిని జాతీయ రహదారిగా ప్రకటించాలని సీఎం కోరారు. జాతీయ కమిటీ తన పర్యటన అనంతరం కేంద్రం ఎటువంటి నిర్ణయాలు తీసుకుంటుందో వేచి చూడాల్సి ఉంది.



**తిరుమల తిరుపతి దేవస్థానం నూతన చైర్మన్ గా కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్ గజపతిరాజు నియామకం..**

# రహదారులు రక్తసిక్తం

**- మెదక్ జిల్లాలో లారీని ఢీకొట్టిన మరో లారీ**

**- నలుగురు వ్యక్తుల దుర్మరణం**

**- కర్నాటకలో ఘోర రోడ్డు ప్రమాదం**

**- ఆగివున్న లారీని ఢీకొన్న మినీ బస్సు**

**- ప్రమాదంలో 13మంది అక్కిక్కడే మృతి**

మెదక్ (ప్రజామంటలు):

మెదక్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాం జరిగింది. లారీని మరో లారీ వెనకనుంచి ఢీకొనడంతో నలుగురు దుర్మరణం చెందారు. తెల్లవారుజామున కావడంతో లారీ డ్రైవర్ నిద్ర మత్తులో ఉన్నారో ఏమో కానీ పెను ప్రమాదం జరిగింది. ఒక లారీని వెనుక వస్తున్న లారీ ఢొకట్టింది. ఈ ప్రమాదంలో నలుగురుదుర్మరణం పాలయ్యారు. ఈ దుర్ఘటన మెదక్ జిల్లా చేగుంట మండలం వడియారం వద్ద బైపాస్ రోడ్డులో జరిగింది. ఒక లారీని వెనుక నుంచి వచ్చిన మరో లారీ ఢీ కొట్టడంతో వెనుక లారీలోని క్యాబిన్‌లో కూర్చొన్న నలుగురు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందారు. మరో ముగ్గరికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఘటనకు సంబంధించి మరింత సమాచారం తెలియాల్సి ఉంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలిస్తున్నారు.

# కమిషన్‌పై పిటిషన్

**- తీర్పును రిజర్వ్ చేసిన హైకోర్టు**

హైదరాబాద్ (ప్రజామంటలు):

హైకోర్టులో తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్ దాఖలు చేసిన పిటిషన్‌పై వాదనలు ముగిశాయి. విద్యుత్ కమిషన్ ఏర్పాటు జీవోను కొట్టివేయాలని కేసీఆర్ పిటిషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. జస్టిస్ ఎల్ నరసింహారెడ్డి జారీ చేసిన నోటీసులు రద్దు చేయాలని కేసీఆర్ పిటిషన్ దాఖలు చేశారు. కేసీఆర్ పిటిషన్‌కు విచారణ అర్హత ఉందా లేదా అనే దానిపై వాదనలు ముగిశాయి. అనంతరం కేసీఆర్ పిటిషన్‌పై తీర్పు రిజర్వ్ చేసినట్లు హైకోర్టు ప్రకటించింది. అయితే కేసీఆర్ దాఖలు చేసిన పిటిషన్‌ను విచారణ స్వీకరించవద్దని అడ్వకేట్ జనరల్ కోరారు. పిటిషన్‌ను విచారణకు అనుమతించడం పైనే వాదనలు వినిపించాలని? మెరిట్స్‌లోకి వెళ్లవద్దని ఏజీకి ధర్మాసనం సూచించింది. ఏజీ వాదనలపై కేసీఆర్ న్యాయవాది ఆదిత్యా సోంధీ అభ్యంతర వ్యక్తం చేశారు. జ్యుడిషియల్ విచారణగా నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. దానిపై నివేదిక ఇవ్వాలే గానీ, మీడియాకు వివరాలు వెల్లడించకూడదు. విద్యుత్ రంగానికి తీవ్ర నష్టం వాటిల్లిందని ముందే చెప్పి కారకులెవరో తేల్చమన్నారు. ఇది సరికాదు అని ఆదిత్యా సోంధీ పేర్కొన్నారు. విద్యుత్తు కొనుగోళ్లు, థర్మల్ ప్లాంట్ల నిర్మాణంపై జస్టిస్ ఎల్ నరసింహారెడ్డి నేతృత్వంలో విచారణ సంఘం ఏర్పాటును సవాల్ చేస్తూ కేసీఆర్ దాఖలు చేసిన పిటిషన్‌కు నంబర్ కేటాయించాలని హైకోర్టు గురువారం నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జూకంటి అనిల్‌కుమార్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం గురువారం హైకోర్టు రిజస్ట్రీకిఆదేశాలు జారీచేసింది. విద్యుత్తు వ్యవహారాలపై రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది మార్చి 14న జస్టిస్ ఎల్ నరసింహారెడ్డి నేతృత్వంలో విచారణ సంఘాన్ని నియమించింది. యాదాద్రి, భద్రాద్రి థర్మల్ విద్యుత్తు కేంద్రాల నిర్మాణం, ఛత్తీస్‌గఢ్–తెలంగాణ మధ్య విద్యుత్తు కొనుగోలు ఒప్పందాల్లో అక్రమాలు జరిగాయని ప్రభుత్వం ఆరోపించింది. కమిషన్ ఏర్పాటు నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ కేసీఆర్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. విద్యుత్తుశాఖ ముఖ్య కార్యదర్శిని, జస్టిస్ ఎల్ నరసింహారెడ్డి విచారణ సంఘాన్ని, వ్యక్తిగత హోదాలో జస్టిస్ ఎల్ నరసింహారెడ్డిని ఇందులో ప్రతివాదులుగా పేరొన్నారు. అయితే, జస్టిస్ నరసింహారెడ్డిని ప్రతివాదిగా చేర్చడంపై హైకోర్టు రిజిస్ట్రీ అభ్యంతరం తెలిపారు. నంబర్ కేటాయించేం దుకు నిరాకరించారు. ఈ నేపథ్యంలో కేసీఆర్ పిటిషన్ గురువారం హైకోర్టు ధర్మాసనం ముందుకు వచ్చింది. దాదాపు 45 నిమిషాలపాటు వాదప్రతివాదనలు జరిగాయి. కేసీఆర్ తరఫున సుప్రీంకోర్టు న్యాయవాది అదిత్య సోంధి బలంగా వాదనలు వినిపించారు. ఆయనతో ఏకీభవించిన ధర్మాసనం.. హైకోర్టు రిజిస్ట్రీ లేవనెత్తిన అభ్యంతరాలను తోసిపుచ్చింది. పిటిషన్‌కు నంబర్‌ను కేటాయించాలని ఆదేశించింది. జస్టిస్ నరసింహారెడ్డి ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారంటూ పిటిషనర్ అభియోగాలు మోపిన నేపథ్యంలో, పిటిషన్‌పై శుక్రవారం విచారణ చేపడతామని వెల్లడించిన మేరకు విచారణ జరిగింది.

# చినుకు పడితే చిత్తడే

**నానా అవస్థలు పడుతున్న వాహనాదారులు, ప్రజలు**

ఎల్కతుర్తి జూన్ 28 (ప్రజామంటలు):



హుస్నాబాద్ నియోజకవర్గం ఎల్కతుర్తి మండల కేంద్రం లో హనుమకొండ దామెర ముల్కనూర్ రోడ్డుకు కూడలిగా ఉన్నటువంటి దామెర రోడ్డు గత పాలకులు సమస్యగా ఉన్న రోడ్డును వదిలి కొద్ది దూరం నుండి డాంబర్ (బీటీ రోడ్) రోడ్డు వేయగా వర్షాకాలం వచ్చిందంటే నానా అవస్థలు పడుతున్న మండలానికి చెందిన చింతలపల్లి దామెర ధర్మసాగర్ మండలానికి చెందిన సోమదేవరపల్లి దేవునూర్ గ్రామ ప్రజలు ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే రాష్ట్ర బీసీ రవాణా శాఖ మంత్రి స్పందించి వెంటనే సమస్యగా మారినటువంటి రోడ్డును పర్మినెంట్ గా డాంబర్ రోడ్వేసే విధంగా చొరవ చూపాలని లేక తాత్కాలికంగా అయినా రోడ్డు బురద నుండి ప్రజలకు విముక్తి కలిగించాలని ఈ బురద రోడ్డు వలన ప్రయాణికులకు బాటసారులకు తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని ఈ బురదరోడ్డు వలన వాహనాలు స్కిడై ప్రాణాలు కోల్పోయిన రోజులు ఉన్నాయని మళ్లీ ఇటువంటివి పునరావృతం కాకుండా చూడాలని గతంలో అభివృద్ధిలో ముందంజలో ఉంచుతానని దామెర చింతలపల్లె రోడ్డు మధ్య ఉన్న రోడ్ సమస్యను స్వయంగా నేనే దగ్గరుండి పనిని చేపించి సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చినటువంటి జిల్లా పరిషత్ చైర్మన్ మారేపల్లి సుధీర్ కుమార్ ఇచ్చిన మాట నిలబెట్టుకోలేకపోయాడని ఇప్పటికైనా సమస్యగా ఉన్నటువంటి బీటీ రోడ్డు త్వరగా పరిష్కరించాలని ఎల్కతుర్తి కార్యదర్శి స్పందించి రెండు మూడు ట్రిప్పుల మొరం పోసిన అది నామమాత్రంగానే ఉండి పనిచేయడం లేదు కావున పర్మినెంట్గా సీసీ గాని, తారు రోడ్డు గాని వేయాలని దామెర, చింతలపల్లి, ఎల్కతుర్తి గ్రామ ప్రజలు కోరుకున్నారు.

# ఉద్యోగికి తను చేసిన సేవలే గుర్తింపునిస్తాయి

**గాంధీ ఫోరెన్సిక్ ఉద్యోగికి ఘనంగా వీడ్కోలు**

**50 వేల పోస్టు మార్టంల నిర్వహణలో భాగస్వామ్యం**

సికింద్రాబాద్ జూన్ 28 (ప్రజామంటలు):




ఎవరైనా ప్రభుత్వ ఉద్యోగి తాను విధులు నిర్వర్తించిన కాలంలో చేసిన సేవలు, వృత్తి నిబద్ధత తే సదరు ఉద్యోగికి గుర్తింపును ఇస్తాయని గాంధీ ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.ఎం.రాజారావు అన్నారు. గాంధీ ఆసుపత్రి మార్చురీలో గత 40 ఏండ్లుగా మార్చురీ అసిస్టెంట్ గా విధులు నిర్వహిస్తున్న మహ్మద్ సలీమ్ పదవీ విరమణ కార్యక్రమం గాంధీ మెడికల్ కాలేజీలోని ఫోరెన్సిక్ మెడిసిన్ అండ్ ట్యాక్సికాలజీ విభాగంలో నిర్వహించారు. పాత గాంధీ ఆసుపత్రి నుంచి ఇప్పటివరకు 42 ఏండ్ల కాలం పాటు ఏకధాటిగా మార్చురీలో సేవలు అందించడం గొప్ప విషయమని ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.రాజారావు ప్రశంసించారు. 50వేలకు పైగా డెడ్ బాడీల పోస్టు మార్టం ల నిర్వహణలో మహ్మద్ సలీమ్ పాత్ర ఉందని ఫోరెన్సిక్ మెడిసన్ హెచ్ఓడీ ప్రొఫెసర్ కృపాల్ సింగ్ అన్నారు. ఈసందర్భంగా సలీమ్ ను శాలువాలు, జ్ఞాపికలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ లావణ్య కౌశిల్, ఫోరెన్సిక్ మెడిసన్ డాక్టర్లు, మెడికల్ స్టూడెంట్స్, పీజీలు, మార్చురీ సిబ్బంది పాల్గొన్నారు.

## హైదారాబాద్ లో ఆర్టీఏ జాయింట్ కమిషనర్ పై దాడికి నిరసనగా

## జగిత్యాల రవాణా శాఖ కార్యాలయ అధికారులు పెన్ డౌన్

**అధికారులపై దాడులకు పాల్పడటం హేయమైన చర్య**

**జగిత్యాల జిల్లా డి.టి.ఓ. వంశీధర్**

జగిత్యాల జూన్ 28 (ప్రజామంటలు):



హైదరాబాదులోని రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ కార్యాలయంలో జాయింట్ ట్రాన్స్ పోర్ట్ కమిషనర్ గా విధులు నిర్వహిస్తున్న రమేష్ కుమార్ పై ఆటో యూనియన్ నాయకుడు అమానుల్లా ఖాన్ చేసిన దాడికి నిరసనగా జగిత్యాల జిల్లా అధికారులు పెన్ డౌన్ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా జగిత్యాల రవాణాశాఖ కార్యాలయంలో డి.టి.ఓ. జీ. వంశీధర్ ఆధ్వర్యంలో అధికారులు పెన్ డౌన్ చేపట్టారు. అనంతరం వంశీధర్ మాట్లాడుతూ విధుల్లో ఉన్న కమిషనర్ పై కొందరు దాడి చేయటం సరైనది కాదన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఇలా దాడులకు పాల్పడటం హేయమైన చర్యగా అభివర్ణించారు. ఇటువంటి దాడులను ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర యూనియన్ సంఘాల ఆదేశాల మేరకు ఈ దాడికి నిరసనగా జగిత్యాల జిల్లా లో పెన్ డౌన్ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రవాణా శాఖ సిబ్బంది యంవిఐ లు వెంకన్న, రామారావు, ప్రమీల, మరియు సంపూర్ణ, అశ్రాఫ్, మొగిలయ్య, తదితరులు పాల్గొన్నారు.

# మళ్లీ అధికారంలోకి వస్తామని కెసిఆర్ పగటికలలు

**అవినీతి బయటపడుతుందనే కమిషన్ రద్దుకు డిమాండ్**

**కెసిఆర్ తీరుపై మండిపడ్డ కాంగ్రెస్ ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి**

హైదరాబాద్,జూన్ 28(ప్రజామంటలు):

మళ్లీ అధికారంలోకి వస్తామని భారాస అధినేత కేసీఆర్ పగటి కలలు కంటున్నారని పరిగి ఎమ్మెల్యే డాక్టర్ రామ్మోహన్‌రెడ్డి ఎద్దేవా చేశారు. అసెంబ్లీలోని సీఎల్పీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి కోరితేనే విద్యుత్ కొనుగోళ్ల వ్యవహారంపై రాష్ట్ర ప్రభుత్వం జ్యుడిషియల్ విచారణ కమిషన్‌ను ఏర్పాటు చేసింది. అవినీతి బయటపడుతుందనే జస్టిస్ ఎల్.నరసింహారెడ్డి కమిషన్ ముందు కేసీఆర్ హాజరుకాలేదు. దిల్లీ మద్యం కేసు నుంచి తన కుమార్తె కవితను కాపాడుకునేందుకు భాజపాతో ఆయన లోపాయికారి ఒప్పందం చేసుకున్నారు. అధికారంలో ఉండగా రూ.7లక్షల కోట్ల అప్పులు చేశారు. వేలాది కోట్ల రూపాయలు దుర్వినియోగం చేశారు. హరీశ్‌రావు మాటలు నమ్మొద్దు.. ఆయన ఎప్పటికైనా భాజపాలోకి వెళ్తారు. ఇప్పటికైనా కేసీఆర్ అసెంబ్లీకి వచ్చి నిర్మాణాత్మక సూచనలు ఇవ్వాలి. నీళ్లు, నిధులు, నియామకాలు కావాలని రేవంత్‌రెడ్డిని ప్రజలు ముఖ్యమంత్రిగా కోరుకున్నారు. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో రుణమాఫీ చేస్తున్నారు. ఇప్పటికే మా ప్రభుత్వం 30వేల ఉద్యోగాలు ఇచ్చింది. భారాస ఎమ్మెల్యేలకు కేసీఆర్ అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వలేదు. ఇప్పుడు ఫాంహౌస్‌కు పిలిచి భోజనాలు పెడితే సరిపోదు. రాజకీయ భవిష్యత్తు, నియోజకవర్గ అభివృద్ధి కోసమే భారాస ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరుతున్నారు‘ అని రామ్మోహన్‌రెడ్డి అన్నారు.

## మూఢ నమ్మకాలతో...

## మూడు బజార్ లో దించిపోస్తే సమస్యలు పరిష్కారం కావు

### నంది అవార్డు గ్రహీత అంబాల ప్రభు



జమ్మికుంట జూన్ 28 (ప్రజామంటలు): శాస్త్ర సాంకేతిక రంగాలు శరవేగంగా భారత దేశం అభివృద్ధి చెందుతున్న ఈ తరుణంలో కూడా ప్రజలు తమ మానసిక,శారీరక, ఆర్థిక సమస్యలకు మాయలు, మంత్రాలు కారణమని భూత వైద్యుల మోసపూరిత మాటలు నమ్మి మూఢనమ్మకాల వైపు ప్రజలు మూడు బజార్ల కూడళ్లలో కోడిగుడ్లు, మాంసంతో వండిన వంటకాలు పెట్టి దించిపోస్తున్నారని, వాటికి ప్రజలు ఎలాంటి భయాందోళన చెందవద్దని అన్నారు. ఈ దించి పోసుల్లతో ఎలాంటి ప్రయోజనాలు ఉండవని నంది అవార్డు గ్రహీత అంబాల ప్రభాకర్ (ప్రభు) ప్రజలకు తెలియజేశారు. శుక్రవారం జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని గౌతమి హాస్టల్ కోరపల్లి రోడ్డు నుండి కృష్ణ కాలనీ వెళ్లే ముడు దారుల కూడలిలో ఉన్న దించి పోసుల్లను స్వయంగా తన చేతులతో తీసి మీడియా ముందు అందరికీ కనబడే విధంగా పట్టుకుని బహిర్గతం చేశారు. ప్రజలు ఆరోగ్యంగా ఉండాలంటే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటూ పౌష్టికాహారం తీసుకోవాలని ఆయన కోరారు. దించి పోసిన కవర్లో ఉన్న కోడిగుడ్లు వండిపెట్టిన మాంసం, అన్నం నిమ్మకాయలు ప్రజలు తినడం వల్ల అనేక ఆరోగ్య ఉపయోగాలు ఉన్నప్పటికీ అజ్ఞాన ఆలోచనలతో వారు తినకుండా, కనీసం ఆకలితో అలమటిస్తున్న వారికీ పెట్టకుండా రోడ్డు పాలు చేయడం విడ్డూరమని, ఇలాంటి మూఢ నమ్మకాల వైపు వెళుతూ వాళ్ళు మానసిక రోగులుగా మారి ఆరోగ్యాలు నాశనం చేసుకోవడమే కాకుండా ఆర్థికంగా నష్ట పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాలు కురవడంతో వాతావరణంలో అనేక మార్పులు రావడం వల్ల అనేక సీజనల్ వ్యాదులు వస్తున్నాయని, వ్యాదులు ప్రబలిన ప్రజలు హాస్పటల్ కి వెళ్లి డాక్టర్లను సంప్రదించి వారు చెప్పిన సూచించినలు పాటించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కోరారు.

## అంగన్వాడీ కేంద్రాలలో 0 నుండి 5 సంవత్సరాల పిల్లల బరువు ఎత్తు కొలతలు



గొల్లపల్లి జూన్ 28 (ప్రజామంటలు): గొల్లపల్లి మండలం లోని గోవిందుపల్లి అంగన్వాడీ కేంద్రంలో సున్నా నుండి ఐదు సంవత్సరంల పిల్లల యొక్క బరువు ఎత్తులు సూపర్వైజర్ మమత ఆధ్వర్యంలో తీయడం పిల్లలలో పోషణ స్థితిని నిర్ధారించడం పిల్లల బరువు ఎత్తుల నిర్ధారించడం పిల్లల యొక్క తల్లిదండ్రులకు వారి యొక్క పోషణ స్థాయి పైన అవగాహన కలిగించి అండర్ వెయిట్ స్టడీంగు వేస్టింగు లోపు పోషణ ప్రాముఖ్యతలపై అవగాహన కలిగించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మమత సూపర్వైజర్ పిల్లల యొక్క తల్లి దండ్రులు అంగన్వాడీ టీచర్లు సరోజన, పద్మ ఆశ వర్కర్ విజయ లక్ష్మి పిల్లలు పాల్గొన్నారు.

## గాడిదల సంరక్షణ యూనిట్ సందర్శన





చిగురుమామిడి జూన్ 28 (ప్రజామంటలు): చిగురుమామిడి లోని నారాయణపురం వెంకటేష్ మరియు ఇందుర్తిలోని వేముల రాంమోహన్ పెంచుతున్న గాడిదల సంరక్షణ యూనిట్లను కరీంనగర్ జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి వుప్పుల శ్రీధర్ మరియు సిద్దిపేట జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి ఆచార్య జయదేవ్ హర్య లు కలిసి సందర్శించారు. వీరు యూనిట్ నిర్వహకులను పెంపకంపై వెలుకువలను అడిగి తెలుసుకున్నారు. వాటికి సరియైన వైద్యం, గడ్డి ఇతర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇందుర్తి నిర్వాహకుడు వేముల రాంమోహన్ మాట్లాడుతూ గాడిద పాలు లీటర్ కి 1000/- నుండి 1500/- రూపాయల వరకు ఉంటుందని వీటిని సబ్బులు మరియు మందుల తయారీకి వాడుతారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డిఆర్డిఓ సునిత, డిపిఎంలు ప్రవీణ్, విద్యాసాగర్, ఏపిఎం లు శ్రీనివాస్, సంపత్, సీసీలు బిక్షపతి, సత్యనారాయణ, వెంకటమల్లు, సంపత్ కుమార్, వెంకటేశ్వర్లు మొదలగువారు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి

### జడ్పీ ఫ్లోర్ లీడర్ గీకురు రవీందర్



చిగురుమామిడి జూన్ 28 (ప్రజామంటలు): మండల కేంద్రములోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని స్థానిక జడ్పీటీసీ సభ్యులు శుక్రవారం పరిశీలించారు. పి.ఎచ్.సి డ్యూటీ డాక్టర్ తో సమావేశమై సబ్ సెంటర్లలో, గ్రామాల్లో వైద్య సిబ్బంది సమయ పాలన పాటించేటట్లు చూడాలన్నారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ సభ్యులు మాట్లాడుతూ ఈ వర్ష కాల సీజన్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. విరోచనాలు, మలేరియా, డెంగ్యూ లాంటి విష జ్వరాలు సోకకుండా జాగ్రత్తతో వ్యవహారించాలన్నారు. దోమల నివారణకు మురికి కాలువలు, పరిసరాల పరిశుభ్రత పాటించడములో ప్రజలకు అందుబాటులో ఉంటూ తగు సూచనలివ్వాలన్నారు. పాఠశాలల్లో విద్యార్థుల ఆరోగ్యం పరిస్థితుల పట్ల తగిన శ్రద్ధ వహించాలన్నారు. గ్రామాల్లో మంచి నీటి ట్యాంక్ లను ఎప్పటికప్పుడు శుభ్రం చేయడం, బ్లీచింగ్ పౌడర్ కలపడం తరుచు చేపట్టాలన్నారు. ప్రజలందరు త్రాగు నీరు కలుషితం కాకుండా చూడాలనీ, నిత్యం కాచి చల్లార్చిన నీళ్లు మాత్రమే తాగాలని సూచించారు. వ్యక్తిగత మరియు పరిసరాల పరిశుభ్రత తోనే రోగాలు రాకుండా నివారించగలమని, ఇది ప్రజలందరి సామాజిక భాద్యత అన్నారు. ప్రభుత్వ దవాఖానలో 55 రకాల రోగ నిర్ధారణ పరీక్షలు చేస్తారని, ప్రజలు ప్రయివేట్ ఆసుపత్రులకు వెళ్లి డబ్బులు వృధా చేసుకోరాదన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ వెంట మాజీ ఎంపీటీసీలు ఐరెడ్డి సత్యనారాయణ రెడ్డి, చీల లక్ష్మా రెడ్డి, పోటు మల్లారెడ్డి వైద్యాధికారిణి డా. మాధురి, డా. అప్సానా, ఫార్మసిస్ట్ బి. రామేశ్వరం, స్టాఫ్ నర్సు కే. భారతి తదితరులు పాల్గొన్నారు.

## ఎన్ఐటి లో ఐదు రోజుల ఎగ్జిక్యూటివ్ డెవలప్మెంట్ ప్రోగ్రామ్




హనుమకొండ జూన్ 28 (ప్రజామంటలు): జిల్లాలోని నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ గ్రామీణ రోడ్ల నిర్మాణం మరియు నిర్వహణకు బాధ్యత వహించే ప్రధాన మంత్రి గ్రామ సడక్ యోజన ఇంజనీర్ల కోసం ఐదు రోజుల ఎగ్జిక్యూటివ్ డెవలప్మెంట్ ప్రోగ్రామ్ను నిర్వహించింది. దేశవ్యాప్తంగా గ్రామీణ రహదారుల పరిరక్షణ కోసం శాస్త్రీయ మరియు క్రమబద్ధమైన పేవ్మెంట్ మేనేజ్మెంట్ సిస్టమ్ సూత్రాలతో ఇంజనీర్లను సన్నద్ధం చేయడం ఈ కార్యక్రమం యొక్క లక్ష్యం. ట్రాఫిక్ సమస్యను పరిష్కరించడానికి, ఐదు రోజుల శిక్షణా కార్యక్రమంలో దేశవ్యాప్తంగా సుమారు 45 మంది ఇంజనీర్లు పాల్గొన్నారు. శిక్షణ సందర్భంగా ఇంజనీర్లకు అవగాహన కల్పించేందుకు పేవ్మెంట్ నిర్వహణ, నిర్వహణ, పునరావాసం, పీఎంఎస్ కాన్సెప్ట్లపై కేస్ స్టడీస్పై వివిధ అంశాలపై చర్చించారు. శిక్షణలో భాగంగా, ఇంజనీర్లు తెలంగాణలోని గ్రామీణ రహదారులను ప్రాజెక్ట్ ఇంప్లిమెంటేషన్ , పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ విభాగం, తెలంగాణ సహాయంతో సందర్శించి రహదారి పరిస్థితులపై శాస్త్రీయ అంచనాలను తెలుసుకున్నారు. ఈ శిక్షణా కార్యక్రమాన్ని భారత ప్రభుత్వ గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని నేషనల్ రూరల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ ఏజెన్సీ స్పాన్సర్ చేసింది. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ సి.ఎస్.ఆర్.కె. ప్రసాద్, ప్రొఫెసర్ వెంకయ్య చౌదరి, ప్రొఫెసర్ ఎస్ శంకర్ పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



రాయికల్ జూన్ 28 (ప్రజామంటలు): విశ్వశాంతి హై స్కూల్ రాయికల్ 2001-02 పూర్వ విద్యార్థులు తాము చదువుకున్న పాఠశాలలో తమ చిన్ననాటి పాఠశాల గుర్తులను జ్ఞాపకం చేసుకున్నారు, తదనంతరం తమకు విద్యను అందించిన గురువులను ఘనంగా సన్మానించారు. అప్పటి ఉపాధ్యాయులు తమ విద్యార్థుల అనుబంధాలను గుర్తుచేసుకుంటూ తమ సంతోషాన్ని వ్యక్తపరిచారు. ప్రధానోపాధ్యాయులు మచ్చ గంగాధర్ మాట్లాడుతూ.... విద్యార్థులకు క్రమశిక్షణ విలువలతో కూడిన విద్యను అందించాలని హితవు పలికారు. మరియు సామాజిక సేవా కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ ముందుండాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మచ్చ గంగాధర్, ఉపాధ్యాయులు గంగరాజం, సురేష్, శేఖర్, రాంరెడ్డి, మైమున విద్యార్థులు ప్రసాద్, అబ్బురి శ్రీనివాస్ , రాడం శ్రీనివాస్, రాజేందర్, సురేష్, రాంరెడ్డి, అందె రంజిత్, సరిత, నాగాంజలి, రజిత, రాజ్యలక్ష్మి, శ్రీలత, మరియు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే అలిగిరెడ్డి ప్రవీణ్ రెడ్డి జన్మదిన వేడుకలు



భీమదేవరపల్లి జూన్ 28 (ప్రజామంటలు): హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే, ముల్కనూరు సహకార గ్రామీణ పరపతి మరియు మార్కెటింగ్ సొసైటీ అధ్యక్షులు అలిగిరెడ్డి ప్రవీణ్ రెడ్డి జన్మదిన వేడుకలను ములకనూరు వారి నివాసంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, అభిమానులు, యువజన కాంగ్రెస్ నాయకులు కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ప్రవీణ్ రెడ్డి హుస్నాబాద్ ప్రాంతాన్ని ఎంతో అభివృద్ధి చేశారని, సహకార సంఘం ద్వారా రైతులకు ఆయన ఎన్నో సేవలను ప్రస్తుతం అందిస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు జనరల్ మేనేజర్ మార్పాటి రామ్ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు బొజ్జపురి అశోక్ ముఖర్జీ, రఘునాయకుల వెంకటరెడ్డి, గూటం జోగిరెడ్డి, పిడిశెట్టి కనకయ్య, కొడకండ్ల సుదర్శన్ రెడ్డి, డిఎస్పి రాజిరెడ్డి, కేతిరి లక్ష్మారెడ్డి, మాడుగుల ప్రెస్ కొమురయ్య, శ్రీరామోజు సమ్మయ్య, మాడుగుల గోపి, బొల్లిపెల్లి వీరారెడ్డి, మాడుగుల చింటూ, వివిధ గ్రామాల కాంగ్రెస్ కార్యకర్తలు, బ్యాంకు డైరెక్టర్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## సీతా ఫల్మండి లో మహిళా మిస్సింగ్



సికింద్రాబాద్ జూన్ 28 (ప్రజామంటలు): చిలకలగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ మహిళ మిస్సింగ్ అయింది. ఎస్.ఐ కే.సబితా కథనం ప్రకారం.... సీతాఫల్మండి కి చెందిన అరిష్యా అలీమ్ (26) ఈనెల 27న ఇంటి నుంచి బయటకు వెళ్ళి తిరిగి రాకపోవడంతో ఫ్యామిలీ మెంబర్స్ తమకు తెలిసిన అన్ని చోట్ల వెతికారు. కాని ఆచూకీ లభించకపోవడంతో తండ్రి షేక్ అబ్దుల్ అలీమ్ శుక్రవారం చిలకలగూడ పోలీసులకు కంప్లైంట్ ఇచ్చాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. పొటోలోని మహిళను చూసిన వారు తమకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ కోరారు.

## ప్రతి శుక్రవారాన్ని డ్రై డే గా పాటించాలి

### మేకలమండి స్కూల్ లో స్టూడెంట్స్ కు అవేర్నెస్



సికింద్రాబాద్ జూన్ 28 (ప్రజామంటలు): ప్రతి శుక్రవారాన్ని డ్రై డే గా పాటించి, ఇల్లు, కార్యాలయాల ఆవరణలో ఎలాంటి నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, దోమల నివారణకు జాగ్రత్తలు పాటించాలని జీహెచ్ఎమ్సీ ఎంటమాలజీ అధికారి ఎస్. రాజేందర్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం బన్సీలాల్పేట డివిజన్ లోని న్యూ భోలక్ పూర్ మేకల మండి ప్రభుత్వ ఉన్నత ప్రాథమిక పాఠశాలలో దోమల నివారణ అంశంపై విద్యార్థులకు అవెర్నెస్ కార్యక్రమం నిర్వహించారు. దోమలు ఎలా వృద్ధి చెందుతాయి, వాటి కాటు వలన కలుగు అనార్థాలు, వాటి నివారణ తదితర అంశాలపై స్టూడెంట్స్కు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంటమాలజీ సిబ్బంది ఎండీ సాదిఖ్, డి. రాజేశ్వర్, ఈ సాయికుమార్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## జగిత్యాలలో ఐ.టీ.ఐ. కళాశాల భవన నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి



జగిత్యాల జూన్ 28 (ప్రజామంటలు): జగిత్యాల జిల్లా ఐటిఐ కళాశాల ఆధునీకరణ పద్ధతిలో స్వంతభవన నిర్మాణం చేపట్టడానికి కావలసిన స్థలాన్ని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, అధికారులు మరియు మున్సిపల్ చైర్పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్, మాజీ మున్సిపల్ చేర్మెన్ పీసీసీ సభ్యులు గిరి నాగభూషణం, పీసీసీ సెక్రటరీ బండ శంకర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జున్ను రాజేందర్ మరియు వివిధ హెూదాలో ఉన్న నాయకులు పరిశీలించారు.

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

### మున్సిపల్ చైర్పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్



జగిత్యాల జూన్ 28 (ప్రజామంటలు): జగిత్యాల రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగ్యూ వంటివి ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని మున్సిపల్ చైర్పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ అన్నారు. శుక్రవారం డ్రై డే కార్యక్రమంలో భాగంగా జగిత్యాల మున్సిపల్ చైర్పర్సన్ 36 వార్డులో పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె స్థానికులతో మాట్లాడుతూ ఇళ్లలో వాడే కుండీలలోని నీటిని రెండు రోజులకొకసారి మార్చాలని, అలాగే కలి స్థలాల్లో ఎక్కువ రోజులు నీటిని నిల్వ ఉంచకూడదని, కొబ్బరి బొండాలు, ప్లాస్టిక్ వంటి వస్తువులు ఇళ్ల పరిసరాల్లో వుంచకుండా చూడాలని సూచించారు. కాలువలకు అడ్డంగా రాళ్లను పెట్టడం వల్ల నీరు నిల్వ వుంటుందని, వాటిని వెంటనే తొలగించాలని అధికారులకు ఆదేశించారు. మున్సిపల్ అధికారులకు రోడ్లు, కాలువలను రోజూ శుభ్రం చేయాలని, ఎక్కడా చెత్త కనిపించకూడదని, ఎప్పటికప్పుడు చెత్తను డంపింగ్ యార్డుకు తరలించాలనీ సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డు ఆఫీసర్లు, ప్రజలు పాల్గొన్నారు.

## నేడు కొండగట్టుకు రానున్న ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్

### భద్రత ఏర్పాట్లు పరిశీలించిన జిల్లా ఎస్పీ అశోక్



కొండగట్టు జూన్ 28 (ప్రజామంటలు): ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ శనివారం జగిత్యాల జిల్లా కొండగట్టు లో ప్రత్యేక పూజలు నిర్వహించడానికి వస్తున్న సందర్భంగా చేయవలసిన భద్రత ఏర్పట్లను పరిశీలించిన జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఐపీఎస్ ఈ సందర్భంగా భద్రతపరంగా చేయవలసిన ఏర్పాట్లు గురించి అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం కొండగట్టులో ఏర్పాటు చేసిన ఔట్ పోస్టు ను సందర్శించి సిసి కెమెరాలు యొక్క పనితీరును పరిశీలించారు. జిల్లా ఎస్పీ వెంట డిఎస్పీ రఘు చందర్, సిఐ రవి మరియు ఎస్ఐ రహీం ఉన్నారు.

## జగిత్యాల జిల్లా

## ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారిని దర్శించుకున్న జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్

### పూర్ణకుంభంతో కలెక్టరు ను స్వాగతించిన అధికారులు, అర్చకులు



జూన్ 28 (ప్రజామంటలు): ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారిని దర్శించుకున్న జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ను పూర్ణకుంభంతో స్వాగతించిన అధికారులు, అర్చకులు. దర్శన అనంతరం అర్చకులు ఆశీర్వచనం ఇచ్చిన తదుపరి దేవస్థానం శ్రీ కార్యనిర్వహణాధికారి సంకటాల శ్రీనివాస్ శేషవస్త్రం ప్రసాదం చిత్రపటం ఇచ్చి సన్మానించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.... అన్నదానం సత్రాన్ని పరిశీలించి భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా వారికి త్రాగునీరు సదుపాయానికి ఇబ్బంది కలుగకుండా శుభ్రమైన త్రాగునీరు వసతి కల్పించాలని సూచించారు, గోదావరి నదీ పరిసరాలను పరిశీలించారు. వానాకాలం దృష్టిలో ఉంచుకుని దోమల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల, ఆర్డీఓ మధుసూదన్, ధర్మపురి మున్సిపల్ కమిషనర్, దేవస్థానం కార్యనిర్వహణాధికారి సంకటాల శ్రీనివాస్ వేదపండితులు, సీనియర్ అసిస్టెంట్ పురోహితులు, స్థానిక తహశీల్దార్, మరియు అర్చకులు సిబ్బంది పాల్గొన్నారు.



# ఘనంగా పివి జయంతి వేడుకలు

**ఉభయ తెలుగు రాష్ట్రాల్లో నివాళి**

**బహుముఖ ప్రజ్ఞాశాలి పివి**

**నివాళి అర్పించిన మాజీ సిఎం కెసిఆర్**

**పివి ఘాట్ వద్ద నివాళి అర్పించిన ప్రముఖులు**

**తెలంగాణ భవన్‌లో నివాళి అర్పించిన బిఆర్ఎస్ నేతలు**

**ఢిల్లీలో నివాళి అర్పించిన మంత్రులు**





హైదరాబాద్,జూన్28 (ప్రజా మంటలు): దివంగత పివి నరసింహారావు జయంతి వేడుకలు తెలుగు రాష్ట్రాలతో పాటు, ఢిల్లీలోనూ ఘనంగా జరిగాయి. భారతరత్న, మాజీ ప్రధాని పీవీ నరసింహారావు జయంతి. ఆయన జయంతిని తెలుగు రాష్ట్రాల్లో అత్యంత ఘనంగా జరుపుకున్నారు. హైదరాబాద్ పివి ఘాట్ వద్ద భారత రత్న, దివంగత మాజీ ప్రధాని పివి నరసింహారావు 103వ జయంతి వేడుకలు జరిగాయి. పివి ఘాట్ వద్ద పివి కుమార్తె వాణిదేవి, కుమారుడు ప్రభాకర్ రావు, మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, మాజీ మంత్రి జానారెడ్డి, తీగల కృష్ణారెడ్డి, కోదండరామ్, హైకోర్టు జడ్జి శ్రావణ్ కుమార్, తదితరలు నివాళులర్పించారు. అసెంబ్లీలో పివి నరసింహరావు చిత్రపటానికి సభాపతి గడ్డం ప్రసాద్, మండలి చైర్మన్ సుఖేందర్ రెడ్డిలు పూలమాల వేసి నివాళు లర్పించారు. ఢిల్లీలో తెలంగాణ భవన్‌లో డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్ బాబులు పివికి నివాళి అర్పించారు. ఆయన చిత్రపటం వద్ద పుష్పాంజలి ఘటించారు. పివి ఆర్థిక దార్శనికుడని కీర్తించారు. తెలంగాణ భవన్‌లో పివి నరసింహరావు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్, ఎంఎల్సీ వాణీదేవి, ఎంఎల్ఎ జగదీశ్ రెడ్డి, మహమూద్ అలీలు పూలమాల వేసి నివాళు లర్పించారు. భారత రత్న దివంగత మాజీ ప్రధాని పి.వి 103 జయంతి సందర్భంగా గాంధీ భవన్ లో పి వి చిత్ర పటానికి కాంగ్రెస్ నాయకులు మాజీ ఎంపి వి. హనుమంతరావు, డిసిసి అధ్యక్షులు నర్సింహారెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు సంగిశెట్టి జగదీష్, అల్లం భాస్కర్, భవాని రెడ్డి, రాపోలు జయ ప్రకాష్, ప్రేమలత అగర్వాల్, లింగం యాదవ్ తదితరులు నివాళులర్పించారు.

తెలంగాణ భవన్ లో మాజీ ప్రధాని, భారత రత్న పీవీ నరసింహ రావు జయంతి సందర్భంగా పీవీ చిత్రపటం వద్ద బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి జగదీష్ రెడ్డి, మహమూద్ అలీ, పీవీ కూతురు ఎమ్మెల్సీ వాణి దేవి , మాలోత్ కవిత తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. భారతదేశ చరిత్ర ఉన్నంత కాలం పీవీ చరిత్ర నిలిచి ఉంటుందని పేర్కొన్నారు. పీవీ నరసింహా రావు గొప్ప సంస్కరణల శీలి అని తెలిపారు. భూ సంస్కరణలో భాగంగా తన కుటుంబానికి చెందిన 800 ఎకరాలను మహనీయులు దారాదత్తం చేశారన్నారు. జైళ్ల శాఖ మంత్రిగా కూడా ఓపెన్ జైల్ విధానంతో సంస్కరణలు చేశారన్నారు. మైనార్టీ ప్రభుత్వాన్ని సైతం పూర్తికాలం సమర్థవంతంగా నడిపారన్నారు. పీవీ గొప్పతనాన్ని గుర్తించి భారత రత్న ప్రకటించిన కేంద్రానికి కేటీఆర్ అభినందనలు తెలిపారు. కరీంనగర్ జిల్లా హుస్నాబాద్‌లో పివికి మంత్రి పొన్నం ప్రభాకర్ నివాళి అర్పించారు. ఆయన చిత్రపటం వద్ద పుష్పాంజలి ఘటించారు. పివి దార్శనికత వల్లనే దేశం ఆర్థికంగా ఎదిగిందని అన్నారు.

### బహుముఖ ప్రజ్ఞాశాలి పివి నివాళి అర్పించిన మాజీ సిఎం కెసిఆర్

బహుముఖ ప్రజ్ఞాశాలి, బహుభాషాకోవిదుడు, దేశ ఆర్థిక సంస్కరణల రూపశిల్పి, తెలంగాణ ఖ్యాతిని ఖండాంతరాలకు చాటిన మహా మేధావి, భారత మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు జయంతి సందర్భంగా దేశానికి ఆయన అందించిన సేవలను బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ స్మరించుకున్నారు. నాటి ప్రపంచ ఆర్థిక విధానాలకు అనుగుణంగా సంస్కరణలు చేపట్టి దేశ ఆర్థిక స్థితిని చక్కదిద్దిన దార్శనికుడు, భారతజాతి ముద్దుబిడ్డ పీవీ అని చెప్పారు. తెలంగాణ బిడ్డగా మనందరం గర్వపడాల్సిన పీవీ నరసింహారావు అందించిన స్ఫూర్తి మరువలేనిదని తెలిపారు. కాగా, మౌనమునిగా పేరుగాంచిన పీవీ నరసింహారావు.. దేశానికి ఎనలేని సేవలు చేసినప్పటికీ కాంగ్రెస్ పాలకులు ఆయనను విస్మరించారు. తెలంగాణ ఆవిర్భావం అనంతరం బీఆర్ఎస్ ప్రభుత్వం పీవీకి సముచిత గౌరవాన్నిచ్చింది. ఆయన ఖ్యాతిని యావత్తు దేశానికి, ప్రపంచానికి చాటేందుకు తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ ఎనలేని కృషి చేశారు. మహనీయుడి చరిత్ర మరుగున పడిపోతున్న తరుణంలో 'పీవీ మన తెలంగాణ ఠీవీ' అంటూ నరసింహారావు ఖ్యాతిని మరోసారి ఎలుగెత్తిచాటారు. ఆయన జయంతి, వర్ధంతి కార్యక్రమాలను బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారికంగా నిర్వహించింది. ఏడాది పాటు ఘనంగా శత జయంతి ఉత్సవాలు జరిపింది.

# జగిత్యాలలో ఫ్లెక్సీ వార్

## ఎమ్మెల్యే సంజయ్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిల పోటాపోటీ ఫ్లెక్సీలు

జగిత్యాల,జూన్28 (ప్రజా మంటలు): జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరడంతో పెద్ద దుమారం చెలరేగింది. సీనియర్ నేత తాటిపర్తి జీవన్ రెడ్డి నుంచి పెద్ద ఎత్తున వ్యతిరేకత వచ్చింది. జీవన్ రెడ్డిని కూల్ చేసేందుకు మంత్రి శ్రీధర్ బాబు, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క రంగంలోకి దిగారు. విడతలవారీగా చర్చలు జరిపారు. హైకమాండ్ పెద్దలు చర్చలు జరిపారు. తగిన ప్రాధాన్యం ఇస్తామని.. మంత్రి పదవి అంటూ చెప్పుకొచ్చారు. హైకమాండ్ పెద్దలతోపాటు సీఎం రేవంత్ రెడ్డిని జీవన్ రెడ్డి కలువడం ప్రాధాన్యం సంతరించుకుంది. అంతా సర్దుకుంటుందని అనుకునే లోపు స్థానిక నేతల మధ్య వివాదం నెలకొంది. ఎమ్మెల్యే సంజయ్ కుమార్ తనకు చెప్పి పార్టీలోకి వస్తే బాగుంటుందని జీవన్ రెడ్డి వర్గం అంటోంది. హైకమాండ్ పెద్దలు జీవన్ రెడ్డిని కూల్ చేశారు. అంతా సర్దుకుంటుందని అనుకునే లోపు మరో వివాదం తెరపైకి వచ్చింది. కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎమ్మెల్యే సంజయ్ కుమార్ అనుచరులు బస్టాండ్ వద్ద ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. జగిత్యాల డెవలప్ కోసం సంజయ్ కాంగ్రెస్ పార్టీలో చేరారని ఆ ఫ్లెక్సీ మీద రాశారు. ఎమ్మెల్యే సంజయ్‌కు అతని అనుచరులు శుభాకాంక్షలు తెలియజేశారు. ఆ ఫ్లెక్సీ ఏర్పాటు చేయడంతో జీవన్ రెడ్డి అనుచరులు భగ్గుమన్నారు. కాంగ్రెస్ పార్టీలో మొదటి నుంచి ఉన్నామని.. జగిత్యాల అంటే జీవన్.. జీవన్ అంటే జగిత్యాల అనేలా మరో ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే సంజయ్ ఫ్లెక్సీ పైన దీనిని ఏర్పాటు చేశారు. ఇలా సంజయ్, జీవన్ రెడ్డి వర్గాల మధ్య ఫ్లెక్సీల వార్ కొనసాగుతోంది. అభివృద్ధి కోసం పార్టీలో చేరామని ఒకరు అంటుంటే.. మరొకరు కాంగ్రెస్ పార్టీ అంటేనే జీవన్ రెడ్డి అంటున్నారు. అలకబూనిన జీవన్ రెడ్డికి మంత్రి పదవి ఇస్తామని హైకమాండ్ పెద్దలు మాట ఇచ్చినట్టు తెలుస్తోంది. త్వరలో మంత్రివర్గ విస్తరణ జరగనుండటంతో జీవన్ రెడ్డికి మంత్రి పదవి రావొచ్చని రాజకీయ వర్గాల్లో జోరుగా చర్చ జరుగుతోంది.

# ఉపాధ్యాయులన వెంటనే నియమించండి

## *రోడ్డెక్కి నిరసన తెలపిన శాలిపేట విద్యార్థులు*

మెదక్,జూన్28(ప్రజా మంటలు): మెదక్ జిల్లా చిన్నశంకరంపేట మండలం పరిధిలోని శాలిపేట ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఉందని విద్యార్థులు పేర్కొన్నారు. విద్యార్థుల సంఖ్యకు తగ్గట్టుగా కొత్తగా ఉపాధ్యాయులను నియమించండంటూ విద్యార్థులు రోడ్డెక్కి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా రోడ్డుపైనే వంటావార్పు చేస్తూ నిరసనలు తెలిపారు. ఉపాధ్యాయులను నియమించే వరకు రోడ్డుపైనే తమ నిరసన కొనసాగుతుందని విద్యార్థులు తేల్చిచెప్పారు. శాలిపేట ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో ఇద్దరు మాత్రమే స్కూల్ అసిస్టెంట్లు ఉన్నారు. అయితే విద్యార్థుల సంఖ్యకు సరిపడా ఉపాధ్యాయులు లేరని వెంటనే ప్రభుత్వ అధికారులు చర్యలు తీసుకొని తమకు ఉపాధ్యాయులను నియమించాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు విద్యాబోధన సక్రమంగా కొనసాగేటట్టు చూడాలని వారి తల్లిదండ్రులు కోరారు. గవలపల్లి ? రామాయంపేట రోడ్డుపై విద్యార్థులు బైఠాయించారు. టీచర్లు కావాలని ప్లకార్డులు ప్రదర్శించి నిరసనలు తెలిపారు.

# లారీని ఢీకొట్టిన మరో లారీ

## నలుగురు వ్యక్తుల దుర్మరణం

మెదక్,జూన్28(ప్రజా మంటలు): మెదక్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాం జరిగింది. లారీని మరో లారీ వెనకనుంచి ఢీకొనడంతో నలుగురు దుర్మరణం చెందారు. తెల్లవారుజామున కావడంతో లారీ డ్రైవర్ నిద్ర మత్తులో ఉన్నారో ఏమో కానీ పెను ప్రమాదం జరిగింది. ఒక లారీని వెనుక వస్తున్న లారీ ఢొకట్టింది. ఈ ప్రమాదంలో నలుగురుదుర్మరణం పాలయ్యారు. ఈ దుర్ఘటన మెదక్ జిల్లా చేగుంట మండలం వడియారం వద్ద బైపాస్ రోడ్డులో జరిగింది. ఒక లారీని వెనుక నుంచి వచ్చిన మరో లారీ ఢీ కొట్టడంతో వెనుక లారీలోని క్యాబిన్‌లో కూర్చొన్న నలుగురు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందారు. మరో ముగ్గురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఘటనకు సంబంధించి మరింత సమాచారం తెలియాల్సి ఉంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలిస్తున్నారు.

# ఢిల్లీలోనే సిఎం రేవంత్

## వరంగల్ పర్యటన వాయిదా

హైదరాబాద్,జూన్28 (ప్రజా మంటలు): సిఎం రేవంత్‌రెడి వరంగల్ పర్యటన వాయిదా పడింది. తొలుత శుక్రవారమే ఆయన పర్యట న ఖరారైన ప్పటికీ దానిని వాయిదా వేసుకున్నారు. ఢిల్లీలో అధిష్ఠానం పెద్దలతో పిసిసి చీఫ్ ఎంపికపై చర్చలు కొనసాగుతున్న నేపథ్యంలో శుక్రవారం కూడా ఆయన అక్కడే ఉండాల్సి వచ్చింది. మరో వైపు వరంగల్ పర్యటనలో స్మార్ట్ సిటీ ప్రాజెక్టు, అండర్ గ్రౌండ్ సిస్టం, ఔటర్ రింగ్ రోడ్డు, మామునూరు ఎయిర్‌పోర్టు తదితర అభివృద్ధి పనులపై ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించాలని భావించారు. ఢిల్లీలో బిజీగా ఉండడంతో ఆయన రాష్ట్రానికి రాలేక పోయారు. బహుశా శుక్రవారం సాయంత్రానికి చేరుకోవచ్చని అంటున్నారు.

# పివికి నివాళి అర్పించిన సిఎం రేవంత్

## మంత్రులు భట్టి, ఉత్తమ్‌లు కూడా శ్రద్ధాంజలి



న్యూఢిల్లీ,జూన్28 (ప్రజా మంటలు): మాజీ ప్రధాని పీవీ నరసింహారావు జయంతి సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి నివాళులు అర్పించారు. ఢిల్లీలోని తన అధికారిక నివాసంలో పి.వి. చిత్రపటానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పూలమాల వేసి నివాళు లర్పించారు.సంస్కరణలతో దేశ ఆర్థిక ప్రగతిని పరుగులు పెట్టించిన ఘనత మాజీ ప్రధానమంత్రి పి.వి.నరసింహారావుకు దక్కుతుందని రేవంత్ రెడ్డి కొనియాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా, కేంద్రంలో వివిధ శాఖల మంత్రిగా, ప్రధానమంత్రిగా పి.వి. చేసిన సేవలు మరువరానివని పేర్కొన్నారు.సీఎం రేవంత్ రెడ్డితో పాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే ఎన్.పద్మావతి రెడ్డి పి.వి. చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇదిలావుంటే పీవీ స్ఫూర్తితో దేశాభివృద్ధి కోసం పనిచేస్తామని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ అన్నారు. పీవీ జయంతి సందర్భంగా నివాళి అర్పించారు తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలు మల్లురవి, గడ్డం వంశీకృష్ణ, జైవీర్ రెడ్డి, చామల కిరణ్ రెడ్డి. ఈ సందర్భంగా మాట్లాడిన ఎంపీ వంశీకృష్ణ.. దేశ అభ్యున్నతికి పీవీ సంస్కరణలు ఎంతగానో ఉపయోగపడ్డాయని చెప్పారు. పీవీ నరసింహారావు కేబినెట్ లో కాకా కేంద్రమంత్రిగా దేశాభివృద్ధిలో భాగం అయ్యారని తెలిపారు. ఆ రోజుల్లో ప్రతిపక్షాలు మాట్లాడేందుకు అవకాశం ఇచ్చేవారని..ఇపుడు స్పీకర్ ఓం బిర్లా నియంతృత్వంగా వ్యవహరి స్తున్నారని విమర్శించారు. ప్రతిపక్షాల గొంతు నొక్కేలా స్పీకర్ చర్యలున్నాయ న్నారు. నీట్ విద్యార్థులకు న్యాయం జరిగేంత వరకు పార్లమెంట్ లో కొట్లాడుతామన్నారు ఎంపీ వంశీకృష్ణ. నీట్ పేపర్ లికేజ్ పై చర్చ చేపట్టాలంటూ విద్యాశాఖ మంత్రి రాజీనామా డిమాండ్ చేస్తూ లోక్ సభ వెల్ లో ఆందోళనలు చేశామన్నారు.దేశం అత్యంత క్లిష్ట సమయంలో ఉన్న దశలో దేశానికి ఒక దిశను చూపించిన వ్యక్తి పీవీ నరసింహారావు అని ఎంపీ మల్లు రవి అన్నారు. ఆర్థికమంత్రి మన్మోహన్ సింగ్ తో కలిసి వ్యవస్థను గాడిలో పెట్టి, సంస్కరణలను అమలు చేసి భారత్ ను ప్రపంచ దేశాల సరసన నిలిపారన్నారు. ఆయనతో పనిచేసే అవకాశం దక్కడం తన అదృష్టమన్నారు.

# ముందుంది మంచికాలం

- రానున్న మూడు రాష్ట్రాల ఎన్నికల్లో విజయం మనదే..
- భేషజాలు వీడి అందరూ ఐక్యంగా పోరాడాలి
- కాంగ్రెస్ శ్రేణులకు రాహుల్ దిశానిర్దేశం



న్యూఢిలీ (ప్రజా మంటలు): త్వరలో జరగనున్న మూడు రాష్ట్రాల శాసనసభ ఎన్నికల నేపథ్యంలో రాహుల్ గాంధీ హస్తం పార్టీ శ్రేణులు, నేతలకు కీలక సూచనలు చేసినట్లు పార్టీ వర్గాల సమాచారం. పార్టీకి నష్టం కలిగించే ఎలాంటి బహిరంగ ప్రకటనలు చేయవద్దని సూచించినట్లు తెలుస్తోంది. త్వరలో జరిగే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి స్పష్టమైన అవకాశాలు ఉన్నాయని, వాటిని వృథా చేసుకోవద్దని గట్టిగా చెప్పినట్లు సమాచారం.త్వరలో జరగబోయే మూడు రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల శాసనసభ ఎన్నికల్లో విభేదాలను పక్కనపెట్టి ఐక్యంగా ముందుకు సాగాలని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ నేతలకు దిశా నిర్దేశం చేసినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. అంతర్గత విభేదాలను పక్కనపెట్టి పార్టీ గెలుపు కోసం ఐక్యంగా పని చేయాలని సూచించారని చెప్పాయి. త్వరలో మహారాష్ట్ర, హరియాణా, ఝార్ఖండ్ రాష్ట్రాలతో పాటు జమ్ముకశ్మీర్ శాసనసభ ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ముందుకు సాగాలని, మిత్ర పక్షాలతో కలిసి ఎన్నికల్లో పని చేయాలని రాహుల్‌గాంధీ, హస్తం పార్టీ నేతలకు సూచించినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి.త్వరలో ఎన్నికలు జరగనున్న రాష్ట్రాల్లో అనుసరించాల్సిన వ్యూహంపై కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ ఇటీవల సమీక్షించారు. ఎన్నికలు జరిగే రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో హస్తం పార్టీలో సీనియర్ నేతల మధ్య నెలకొన్న అంతర్గత పోరు విషయమై రాహుల్‌గాంధీ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ పార్టీ వర్గాలు తెలిపిన వివరాల ప్రకారం, మూడు రాష్ట్రాల స్థానిక నేతలు, జమ్ముకశ్మీర్ నేతలు వ్యూహాలకు అనుగుణంగా ముందుకు సాగాలని రాహుల్‌గాంధీ సూచించారు. వచ్చే ఎన్నికల్లో ఐక్యంగా పోరాడాలని రాష్ట్ర నేతలకు హై కమాండ్ దిశానిర్దేశం చేస్తోందని రాహుల్ అన్నారు. బహిరంగంగా ఒకరినొకరు తిట్టుకోవడం మానుకోవాలని ఆయన కోరారు పార్టీలో అన్ని సమస్యలపై చర్చిస్తామని త్వరలో జరగనున్న ఎన్నికలు కాంగ్రెస్‌కు చాలా మంచి అవకాశమని, ఐక్యంగా ముందుకుసాగితే సానుకూల ఫలితాలు వస్తాయని రాహుల్ అన్నారు. పార్టీలో అంతర్గత పోరుపై ఖర్గే కూడా ఆందోళన వ్యక్తం చేశారు రాహుల్ మరోవైపు, ఒక వర్గానికి చెందిన వ్యక్తి తన వద్దకు వచ్చి ఫిర్యాదు చేస్తున్నారని, మరో వర్గం నుంచి కూడా ఇలాంటి ఫిర్యాదులే వస్తున్నాయని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అన్నారు. పార్టీ పదవులను భర్తీ చేయాలని మహారాష్ట్ర కాంగ్రెస్ నేతలు పట్టుబడుతున్నారని, కానీ కొంతకాలం మహారాష్ట్ర చీఫ్ నానా పటోలే కొనసాగుతారని ఖర్గే స్పష్టం చేశారు. భారతీయ జనతా పార్టీకి వ్యతిరేకంగా మహారాష్ట్ర కాంగ్రెస్ శ్రేణులు మొత్తం ఏకం కావాలని మహారాష్ట్ర ఏఐసీసీ ఇన్‌ఛార్జ్ కార్యదర్శి ఆశిష్ దువా తెలిపారు. ఝార్ఖండ్‌లోనూ కాంగ్రెస్ చీఫ్ రాజేష్ ఠాకూర్‌ను తొలగించాలని మిత్రపక్షాల నేతలు కోరుతూనే ఉన్నారని తెలుస్తోంది. కానీ అది ఇప్పట్లో జరగకపోవచ్చని సమాచారం. జమ్మూకశ్మీర్, హరియాణాలోనూ సీనియర్ నేతల మధ్య విభేదాలు వ్యక్తమవుతూనే ఉన్నాయి. హరియాణలో కీలక నేత కిరణ్ చౌదరి ఇప్పటికే పార్టీని వీడి బీజేపీలో చేరడం కాంగ్రెస్ పార్టీని ఆందోళనకు గురిచేస్తోంది. మరికొందరు సీనియర్ నేతలు పార్టీ వీడుతారన్న వార్తల నేపథ్యంలో హస్తం పార్టీ చర్యలకు ఉపక్రమించింది. ఈ పరిస్థితుల్లో బహిరంగంగా నేతలపై ఎలాంటి ప్రకటనలు చేయవద్దని కాంగ్రెస్ పార్టీ నేతలందరికీ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. విభేదాలు, పార్టీ అంతర్గత విషయాలకు సంబంధించిన ప్రకటనలను అధిష్ఠానం దృష్టికి తేవాలని సూచించింది. అందరూ కలిసి ఐక్యంగా ఉండి కమలం పార్టీని ఓడించాలని పట్టుదలగా ఉన్నామని, 90 సీట్లలో 70 సీట్లు కైవసం చేసుకుని అధికారంలోకి వస్తామని ఏఐసీసీ హరియాణ ఇన్‌ఛార్జ్ దీపక్ బబారియా ధీమా వ్యక్తం చేశారు.

# షాద్‌నగర్ పరిశ్రమలో ఘోర ప్రమాదం

- పేలిన కంప్రెషర్- ఆరుగురి దుర్మరణం
- పలువురికి తీవ్రగాయాలు
- ఎగిసిపడ్డ మాంసపు ముద్దలు



షాద్‌నగర్ (ప్రజా మంటలు): రంగారెడ్డి జిల్లాలోని షాద్‌నగర్‌లో పెను విషాదం చోటు చేసుకుంది. స్థానిక సౌత్ గ్లాసు ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో కంప్రెషర్ పేలడంతో ఆరుగురు మృతి చెందారు. పేలుడు ధాటికి కార్మికుల మృతదేహాలు ఛిన్నాభిన్నమయ్యాయి. మంటలు చెలరేగడంలో మరికొంత మందికి తీవ్ర గాయాలయ్యాయి. వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకొని మంటలు అదుపు చేసేందుకు యత్నిస్తున్నారు. ఒకేసారి కంప్రెషర్ పేలడంతో ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. క్షతగాత్రులను ఆస్పత్రులకు తరలించారు. ఈ దుర్ఘటన ఎలా జరిగిందనే దానిపై ఇంకా ఆరా తీస్తున్నారు. మృతులు ఒడిశా, బిహార్, యూపీ వాసులుగా గుర్తించారు. తీవ్ర గాయాలైనవారిని మెరుగైన చికిత్స కోసం ఉస్మానియా, గాంధీ ఆస్పత్రికి తరలించే అవకాశం ఉంది. ఈ ఘటనలో మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నట్లు సమాచారం. గతంలో ఇక్కడ ఇలాంటి ఘటన జరిగినప్పుడే కార్మికుల భద్రత దృష్ట్యా జాగ్రత్తలుతీసుకోవాలని ఇచ్చిన సూచనల్ని ఏమేరకు పాటించారనే విషయాన్ని అధికారులు పరిశీలిస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం సహాయక చర్యలు కొనసాగుతున్నాయి.

**క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందించాలని సీఎం ఆదేశం**

షాద్‌నగర్‌లో జరిగిన ప్రమాదంపై సీఎం రేవంత్ రెడ్డిగ్ర్భాంతి వ్యక్తం చేశారు. అధికారుల్ని అప్రమత్తం చేసిన ఆయన.. క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందించాలని కలెక్టర్‌ను ఆదేశించారు. సహాయక చర్యలు ముమ్మరం చేయాలని సూచించారు.ఈ దుర్ఘటనపై భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌గ్ర్భాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

# జియో బాటలో ఎయిర్‌టెల్

### వినియోగదారులపై టారిఫ్ దాడి
### భారీగా పెరగనున్న రీఛార్జ్ ధరలు
### జూలై 3నుంచి అమల్లోకి కొత్త ధరలు




ముంబై, జూన్ 28 (ప్రజా మంటలు): మొబైల్ ఫోన్ వినియోగదార్లకు వరుసగా రెండు షాక్‌లు తగిలాయి. ఎ÷-లాన్ ధరలు పెంచుతూ రిలయన్స్ జియో ప్రకటించిన వెంటనే, భారతి ఎయిర్‌టెల్ కూడా రేట్లను పెంచింది. ఎయిర్‌టెల్ సిమ్ వినియోగించాలంటే యూజర్లు ఇకపై 10 శాతం నుంచి 21 శాతం ఎక్కువ డబ్బులు ఖర్చు చేయాలి. పెరిగిన భారతి ఎయిర్‌టెల్ టారిఫ్‌లు జులై 3 నుంచి అమలులోకి వస్తాయి. ఆ తేదీ నుంచి పోస్ట్ పెయిడ్ / ప్రి-పెయిడ్ ఎ÷-లాన్ల రేట్లు పెరుగుతాయి. ఎయిర్‌టెల్ కస్టమర్లకు ప్రస్తుతం ఉన్న రేట్లు జులై 2వ తేదీ వరకు వర్తిస్తాయి. భారతదేశంలోని టెలికాం కంపెనీలు ఆర్థికంగా బలంగా ఉండాలంటే 'ప్రతి వినియోగదారు నుంచి వచ్చే సగటు ఆదాయం' రూ. 300 పైగా ఉండాలని భారతి ఎయిర్‌టెల్ స్టాక్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లకు తెలిపింది. 300 దాటితే... నెట్‌వర్క్ టెక్నాలజీ , స్పెక్ట్రమ్ కోసం పెద్ద మొత్తంలో అవసరమయ్యే పెట్టుబడులు అందుబాటులోకి వస్తాయని, మూలధనంపై సాధారణ రాబడిని పొందగమని తాము నమ్ముతున్నట్లు ఎక్స్ఛేంజ్ ఫైలింగ్‌లో భారతి ఎయిర్‌టెల్ పేర్కొంది. సామాన్య ప్రజల బడ్జెట్‌పై ఎలాంటి భారం లేకుండా, ఎంట్రీ-లెవల్ ప్లాన్ రేట్లను చాలా తక్కువ మొత్తంలో అంటే రోజుకు 70 పైసల కంటే తక్కువ పెంచినట్లు వెల్లడించింది. గురువారం, రిలయన్స్ జియో కూడా తన మొబైల్ ప్లాన్ రేట్లను 12 శాతం నుంచి 27 వరకు పెంచింది. జియో కొత్త టారిఫ్‌లు కూడా జులై 3 నుంచి అమల్లోకి వస్తాయి. జులై 2వ తేదీ వరకు ప్రస్తుత రేట్లే అమల్లో ఉంటాయి. రిలయన్స్ జియో... తన నెలవారీ (28 రోజులు) ప్లాన్‌లు, 2 నెలలప్లాన్లు (56 రోజులు), 3 నెలల ప్లాన్లు (84 రోజులు), వార్షిక ప్లాన్ల (335 / 336 రోజులు) మొత్తాన్ని పెంచింది. 28 రోజుల ప్లాన్ ధరలను 27 శాతం వరకు, 84 రోజుల ప్లాన్లను 20 శాతం వరకు రిలయన్స్ జియో పెంచింది. డేటా యాడ్-ఆన్ ప్యాక్‌లు, పోస్ట్ పెయిడ్ టారిఫ్ రేట్లను సైతం జియో పెంచింది. దీంతో... కొత్త ప్లాన్లు కనిష్టంగా రూ. 189 నుంచి గరిష్టంగా రూ. 3,599 వరకు చేరాయి. ప్రస్తుతం ఇవి కనిష్టంగా రూ. 155 - గరిష్టంగా రూ. 2,999 మధ్యలో ఉన్నాయి. జియో యాడ్-ఆన్ ఎ÷-లాన్ల కొత్త ధరలు కనిష్టంగా రూ. 29 నుంచి గరిష్టంగా రూ. 69 వరకు ఉన్నాయి. పోస్ట్ పెయిడ్ ఎ÷-లాన్ల విషయానికి వస్తే... ప్రస్తుతం రూ. 299 ఎ÷-లాన్ జులై 03 నుంచి రూ. 349 అవుతుంది. ప్రస్తుతం రూ. 399గా ఉన్న ప్లాన్ కోసం జులై 03 నుంచి రూ. 449 చెల్లించాల్సి వస్తుంది. వాస్తవానికి, టెలికాం కంపెనీలు ఈ ఏడాది ప్రారంభంలోనే టారిఫ్ రేట్లు పెంచాల్సి ఉంది. అయితే, లోక్‌సభ ఎన్నికలు ముగిసే వరకు ఆగాయి.

# సేంద్రియ వ్యవసాయామే ఆరోగ్యానికి రక్ష

### రసాయన ఎరువుల వాడకంతో క్యాన్సర్
### భూసారం తగ్గితే మట్టి మనుగడే కష్టం

నిజామాబాద్, జూన్28 (ప్రజా మంటలు): రోజురోజుకూ తగ్గిపోతున్న భూసారాన్ని కాపాడుకోకపోతే భవిష్యత్తులో పంటలు పండాలంటే చాలా కష్టంగా మారే పరిస్థితులు కన్పిస్తున్నాయి. రసాయన ఎరువుల వాడకం వల్ల దుష్ఫలితాలు వస్తున్నారు. అనేకరకాలన క్యాన్సర్ వంటి రోగాల బారిన పడుతున్నాం. సేంద్రియ ఎరువులను అశ్రద్ధ చేస్తూ.. అధిక దిగుబడుల కోసం విచ్చలవిడిగా రసాయన ఎరువులు వినియోగిస్తుండడంతో భూసారం క్రమంగా కనుమరుగవుతోంది. దానిని కాపాడుకోకపోతే రైతులకు తీవ్ర నష్టం కలిగే ప్రమాదం పొంచి ఉందని హెచ్చరించారు. సేంద్రియ వ్యవసాయం పెరగకుంటే భూసారం తగ్గి భూములు వ్యవసాయానికి పనికిరాకుండా పోతాయని వ్యవసాయ నిపుణలు హెచ్చరిస్తున్నారు. రైతులు విరివిగా రసాయన ఎరువుల వాడకం వల్ల ఏటేటా భూసారం తగ్గిపోతుందన్న ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వానకాలం పంటలు వేసే సమయం ఆసన్నమైనందున భూసారాన్ని కాపాడడం కోసం పచ్చిరొట్ట ఎరువుల వాడకం వల్ల కలిగే లాభాలు, ఉండాల్సిన లక్షణాలు, రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని అన్నారు. శువుల ఎరువులు తక్కువ అవుతున్న తరుణంలో పచ్చిరొట్టను పైర్లసాగులో భాగం చేసుకోవడం తప్పనిసరని అన్నారు. అధిక దిగుబడులే లక్ష్యంగా రైతులు విపరీతంగా రసాయన మందులను వినియోగి స్తున్నారు. దీంతో భూమి క్రమంగా తన సారాన్ని కోల్పోతోంది. దీనివల్ల అధిక దిగుబడులు రాకపోగా పంటలకు నష్టం కలగడం, భవిష్యత్తులో పూర్తిగా భూమి నిస్సారం కావడం వంటి ప్రమాదాలు పొంచి ఉన్నాయి. ఈ పరిస్థితులను అధిగమించి సుస్థిరమైన దిగుబడులు, పొందాలంటే భూసారాన్ని కాపాడడం ఒక్కటే మార్గం.




అందుకోసం సేంద్రియ ఎరువులను పోషకాల యాజమాన్యాల్లో భాగం చేయాల్సిన అవసరం ఉంది. పచ్చిరొట్ట వాడడం వల్ల భౌతిక, రసాయన, జీవ లక్షణాలు వృద్ధి చెందుతాయి. తక్కువ ఖర్చుతో ఎక్కువ మోతాదులో సేంద్రియ ఎరువులు అందించే అవకాశం ఉంది. నేలకు నీటిని, పోషకాలను నిలుపుకునే శక్తి పెరుగుతుంది. నేల గుల్లబారి మురుగునీటి వ్యవస్థ మెరుగు పడుతుంది. నేలలో సూక్ష్మజీవులు పెరుగుతాయి. అనేక జీవ రసాయన చర్యలు జరిగి పోషకాలు మొక్కలకు అందుతాయి. చీడపీడల ఉధృతిని తగ్గిస్తాయి. పచ్చిరొట్ట తరువాత వేసే పైర్లకు 25 శాతం నత్రజని తగ్గించవచ్చు. చౌడు నేలలు కూడా సారవంతంగా మారుతాయి. ఆ నేలల్లోనూ ఉత్పాదకత పెంచుకోవచ్చు. త్వరగా పెరిగి ఎక్కువగా పచ్చిరొట్టను అందిస్తుంది. పీచుపదార్థం తక్కువగా ఉంటుంది. త్వరగా కుల్లి భూమిలో కలిసేటట్లు చేస్తుంది. పుష్పజాతి పంటలు ఎంపిక చేసుకుంటే వేరు బుడిపెల ద్వారా గాలిలో నత్రజని స్థిరీకరిస్తుంది. లోతైన వేరు వ్యవస్థ కలిగి నీటి ఎద్దడిని తట్టుకునేలా చేస్తుంది. కలుపు మొక్కలను అరికడుతుంది. అన్ని రకాలైన నేలల్లో పెరిగి నమ్మకమైన దిగుబడిని ఇచ్చేలా చేస్తుంది. చౌడు భూములు, వరి పండించే భూములకు జీలుగులు అనుకూలం. తేలికపాటి ఇసుక నేలల్లోనూ సాగు చేయొచ్చు. ఉరుబుడిపెలు ఎక్కువగా ఉండి నత్రజనిని ఎక్కువ స్థిరీకరిస్తుంది. ఒక టన్ను పచ్చిరొట్టలో సుమారు 6 కిలోల నత్రజని 1 నుంచి 1.5 కిలోల భాస్వరం, 5 కిలలో పొలాషియం లభిస్తాయి. జనుమును అన్ని రకాల నేలల్లో సాగు చేయొచ్చు. పచ్చిరొట్ట పశుగ్రాసానికి ఉపయోగ పడుతుంది. ఎకరాకు 12 నుంచి 14 కిలోల విత్తనాల చల్లుకోవాలి. పూత దశలో కలియదున్నడం వల్ల ఎకరానికి సుమారు 4 నుంచి 5 టన్నుల పచ్చిరొట్ట లభిస్తుంది. దీనిని ప్రతి ఒక్కరూ నాటుకోవాలని వ్యవసాయ నిపుణులు సూచిస్తున్నారు.

# లక్నేపల్లి నుంచి హస్తిన వరకు పయనం

### ప్రధాని పదవిని సొంతం చేసుకున్న సామాన్యుడు
### దార్శనిక రాజకీయాలకు ఆదర్శంగా నిలిచిన పివి

వరంగల్,జూన్28 (ప్రజా మంటలు): వరంగల్ జిల్లా నర్సంపేట మండలం లక్నేపల్లి గ్రామంలో 1921 జూన్ 28 న రుక్మాబాయి,సీతారామరావు దంపతులకు పీవీ జన్మించాడు. భార దేశంలో ఓ సామాన్యుడు గద్దెనెక్కడం అనేది అంతా ఓ భ్రమ. పేరుకు ప్రజాస్వామ్య దేశమే అయినా, రాచరికాన్ని తలపించేలా పాలన మొత్తం తరతరాలుగా ఏదో ఒక్క కుటుంబం చేతిలోనే ఉంటుందనేది భారతీయులందరికీ తెలిసిన సత్యం. అయితే ఆ ఆనవాయితీని ఛేదిస్తూ, 1991వ సంవత్సరంలో మొట్టమొదటి సారిగా దక్షిణభారత దేశం నుంచి ఒకవ్యక్తి, అందులోనూ తెలుగువాడు అయిన పీవీ నరసింహారావు దేశ ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. దేశ ఆర్థికవ్యవస్థను ఒకగాడిలోకి తీసుకు రాగలిగారు. ప్రజల్లోఆర్థిక భద్రత, ఒక నమ్మకం కల్పించడంలో పీవీ ఎంతో కృషి చేశారు. అందుకే ఆర్థిక సంస్కరణల జాతిపితగా పీవీ నరసింహా రావు కీర్తి గడించారు.అంతేకాదు.. ఒక గొప్ప వ్యూహకర్త, అపర చాణక్యుడిగా పేరు పొందారు.మంచి రాజనీతిజ్ఞుడిగా కూడా పేరు, ప్రత్యర్థి పార్టీల నుంచి కూడా గొప్ప ప్రధానమంత్రిగా ప్రశంసలు అందుకున్న ఏకైక వ్యక్తి పీవీ మాత్రమే.కానీ ఆ సమయం నాటికి దేశ ఆర్థిక వ్యవస్థ క్షీణించి, పేదరికం పెరిగిపోయి, అత్యంత క్లిష్ట పరిస్థితులు ఉన్నాయి. అంతా శూన్యం, దేశాన్ని ఎలా ముందుకు నడిపించాలో దిక్కుతోచని పరిస్థితి. అలాంటి పరిస్థితుల్లో పదవీ బాధ్యతలు స్వీకరించిన పీవీ తనదైన ఆలోచనలతో, ఎన్నో ఆర్థిక సంస్కరణలు తీసుకొచ్చి దేశానికి ఒక దశా-దిశా ఇచ్చి తన సత్తా ఎంటో చూపించారు. రాజకీయాల్లో స్థితప్రజ్ఞత ఉన్న అరుదైన నేతల్లో పివి ముందుంటారు. ఆయన స్వార్థం కోసం ఏనాడూ రాజకీయాలు చేయలేదు. అలాగే ఆయనలోని స్వార్థం దేశానికి మంచి చేయాలన్న తపన తప్ప మరోటి కాదు. అపర చాణుక్యుడు అంటూ ఆయనను కీర్తించినా రాజకీయాల కోసం తన చాణక్యాన్ని ఎప్పుడూ ప్రదర్శించలేదు. సానుకూల, ప్రతికూల రాజకీయాలను ఆమూలాగ్రం ఔపోసన పట్టిన ఘటికుడు ఆయన. అందుకే వాటిని అర్థం చేసుకుని అందుకు అనుగుణంగా పాలన చేసి..తిరుగలేని నేతగా రుజువు చేసుకున్నారు. నిజానికి పివి హయాం తరవాత సంకీర్ణాలు మొదలయ్యాయి. పివి కూడా ఆనాడు సంకీర్ణ




రాజకీయాలకు తెరతీసి ఉంటే దేవేగౌడ స్థానంలో మళ్లీ పివియే ప్రధాని అయ్యేవారు. తనకున్న స్థానాలతో తానే మరోమారు ప్రధానిగా అయ్యేందుకు సంకీర్ణ రాజకీయాలు నెరపి ఉంటే భారత చరిత్ర మరోలా ఉండేది. అయినా ఆయన పాలనా కాలం ఓ స్వర్ణ యుగం. ముఖ్యమంత్రిగా,కేంద్రమంత్రిగా,ప్రధాన మంత్రి గా, ఆర్థిక సంస్కరణలను అద్వితీయంగా అమలుపరిచిన పాలనాదక్షుడిగా పీవీ నరసింహరావు చరిత్ర సృష్టించారు. అందుకే బహుముఖ ప్రజ్ఞాశాలిగా ఆయన చరిత్ర పుటల్లో నిలిచిపోతారు. ఆయన పాలనా ఫలితాలు, ఫలాలు నేటికీమనమంతా అనుభవిస్తూనే ఉన్నాం. వాటి నుండి పాఠాలు నేర్చుకోవడంలో మాత్రం వెనకబడి ఉన్నాం.

# ఉగ్రూతలూగించిన వందేమాతరం

### గీత రచయిత బంకించంద్ర చటర్జీ

కోల్‌కతా,జూన్28 (ప్రజా మంటలు): స్వాతంత్ర్యోద్యమంలో కోట్లాది భారతీయులను ఉగ్రూతలూగించిన వందేమాతరం గీత రచయిత బంకించంద్ర చటర్జీ. ఆనందమఠం అనే నవలలో మాతృభూమిని దుర్గాదేవితో పోలుస్తూ ఈ స్తోత్రాన్ని వ్రాశారు. ఆయన బెంగాలీ భాషలో ఇంకా అనేక నవలలు, కథలు, కథానికలు రచించారు. బంకించంద్ర జూన్ 27, 1838న బెంగాలు రాష్ట్రంలోని నైహతి అనే గ్రామంలో జన్మించారు. ఆయన తల్లిదండ్రులు యాదవ చంద్ర చటర్జీ, దుర్గాదేవి. యాదవ చంద్ర చటర్జీ మిడ్నాపూర్ జిల్లాలో డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేశారు. బంకించంద్ర విద్యాభ్యాసం హుగ్లీ మరియు కలకత్తాలో జరిగింది. 1857లో కలకత్తా ప్రెసిడెన్సి కాలేజి నుంచి డిగ్రీ పొందారు. తండ్రివలేనే బంకించంద్ర కూడా డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేశారు. 1891లో డిప్యూటీ మెజిస్ట్రేటుగా పదవీ విరమణ చేశారు. వారి ఉద్యోగ సమయంలో ఎప్పుడు బ్రిటిష్ అధికారులకు తలవంచలేదు. బెంగాలీ భాషలో మొదటి నవల దుర్గేష్ నందిని 1865లో బంకించంద్ర రచించారు. 'బంగదర్శన్' అనే మాస పత్రికను ఏప్రిల్ 1872లో ఆయన ప్రారంభించారు. వందేమాతర గీతం అనగానే బంకించంద్ర ఛటర్జీ స్ఫురినిస్తారు.ఆ ప్రఖ్యాత రచయిత ఒక సందర్భంలో రామకృష్ణ పరమహంసను దర్శించుకోగా, 'నీ జీవన లక్ష్యం ఏమిటి? ' అనడిగారాయన. 'కుటుంబ పోషణ' అన్నారు బంకించంద్ర. పరమహంస తీవ్రంగా స్పందిస్తూ 'ముల్లంగి తింటే ఆ త్రేన్పులే వస్తాయి. సంసారమే సర్వమని భావిస్తే ఆలోచనలు ఇలాగే ఉంటాయి' అని, ఆధ్యాత్మిక జీవన ప్రాముఖ్యం గురించి చెప్పారు. పరమహంస సాంగత్యంతో బంకించంద్రుని ఆలోచనా ధోరణెళి మారిపోయింది. మనసు ప్రాపంచిక విషయాల నుంచి ఆధ్యాత్మికత వైపు మరలి, క్రమంగా వేదాంతిగా మారిపోయారు. లౌకిక కథనాలతో కూడిన సాహిత్యాన్ని వదిలేశారు. దైవచింతన పెంచుకుని ఆధ్యాత్మిక రచనలు చేస్తున్న రోజుల్లో ఒకసారి బంకించంద్ర తీవ్ర అనారోగ్యం పాలయ్యారు. అయినా శరీర అస్వస్థతను పట్టించు కోకుండా ఆధ్యాత్మిక గ్రంథ పఠనంలో లీనమయ్యారు. అప్పుడో ప్రముఖ వైద్యుడు వారి ఇంటికి వచ్చి 'ఔషధం' తీసుకోకపోతే ఎలా ప్రాణాపాయాన్ని కొనితెచ్చుకుంటారా? !' అంటూ హెచ్చరించారు. దానికి స్పందిస్తూ బంకించంద్ర 'మందులు తీసుకోకపోవట మేంటి! రోజూ ఒక ఔషధాన్ని వాడుతున్నానే!' అన్నారు. వైద్యుడు ఆశ్చర్యంగా 'ఏదీ చూపండి' అనడిగారు. 'ఇదిగో' అంటూ చెంతనే ఉన్న భగవద్గీత చూపి, 'పారమార్థిక అన్వేషణకే కాదు, ప్రాపంచిక రుగ్మతలకూ ఇంతకంటే దివ్య ఔషధం లేదు' అన్నారు.



# జార్ఖండ్ మాజీ సిఎం హేమంత్‌కు ఊరట

### బెయిల్ మంజూరు చేసిన రాష్ట్ర హైకోర్టు

రాంచి,జూన్28 (ప్రజా మంటలు): ఝార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌కి భారీ ఊరట లభించింది. ల్యాండ్ స్కామ్ కేసులో అరెస్ట్ అయిన హేమంత్‌కు ఝార్ఖండ్ హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఈ ఏడాది ఇదే కేసులో జనవరి 31న సోరెన్ అరెస్ట్ అయ్యారు. 8.36 ఎకరాల ల్యాండ్ కొనుగోలు విషయంలో అవకతవకలు ఈడీ తేల్చి చెప్పింది. ఈ కేసులో ఆరోపణలు వచ్చిన వెంటనే ఆయన ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశారు. ఆ తరవాత చంపై సోరెన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకున్నారు. ఈ కేసుపై విచారణ కొనసాగుతోంది. ఈ క్రమంలోనే హైకోర్టు బెయిల్ ఇచ్చింది. పెండింగ్ కేసులు ఏమీ లేకపోవడం వల్ల ఆయన జైలు నుంచి విడుదలయ్యేందుకు లైన్ క్లియర్ అయింది. ల్యాండ్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ భాను ప్రతాప్ ప్రసాద్‌నీ ఇప్పటికే అరెస్ట్ చేశారు. 2023లో ఈ స్థలానికి సంబంధించిన డాక్యుమెంట్స్‌ని తారుమారు చేశారు. ఆయనను అరెస్ట్ చేసిన తరవాత డాక్యుమెంట్స్‌ని స్వాధీనం చేసుకున్నారు. హేమంత్ సోరెన్ 8.36 ఎకరాల ల్యాండ్‌ని అక్రమంగా కొనుగోలు చేసినట్టు తేలింది. ఈ వ్యవహారంలో భాను ప్రతాప్ సహకరించాడు. ఇప్పటికే ఈడీ మరి కొన్ని కేసులనూ విచారిస్తోంది.



# బాసర ప్రసాదాల విక్రయంలో చేతివాటం

నిర్మల్, జూన్28 (ప్రజా మంటలు): గుడిని గుడిలో లింగాన్ని మింగేస్తారంటే ఏమో అనుకున్నాం. కానీ కొన్ని సందర్భాల్లో అది మన క్లళెదుట స్పష్టంగా తేటతెల్లమవుతూ ఉంటుంది. బాసర జ్ఞాన సరస్వతీ దేవి ఆలయంలో కాదేదీ అవినీతి, అక్రమాలకు అనర్హం అన్నట్టుగా.. ప్రసాదాల విక్రయంలో సిబ్బంది చేతి వాటం ప్రదర్శించడం చర్చనీయాంశంగా మారింది. విషయాన్ని గమనించిన భక్తులు ఆలయ ఈవోకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టించారు. ఈ విషయమై ఈవో విజయరామారావు విచారణ జరుపుతున్నారు. అమ్మవారి ప్రసాదంలో చేతివాటం ప్రదర్శించడంపై భక్తులు తీవ్ర స్థాయిలో మండిపడుతున్నారు.దేశంలోనే పేరుగాంచిన సరస్వతీ దేవి ఆలయాల్లో బాసర ఒకటి. ఈ ఆలయంలో ప్రసాదాల విషయంలో గతంలోనూ రచ్చ జరిగింది. గత ఏడాది బాసర జ్ఞాన సరస్వతి ఆలయంలో ప్రసాదం లడ్డూలు పాడయ్యాయని భక్తులు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనికి కూడా సిబ్బంది నిర్లక్ష్యమే కారణం. పెద్ద ఎత్తున అభిషేకం లడ్డూలపై ఫంగస్ ఏర్పడటంతో అవి పాడైపోయాయి. ఇలా చాలాసార్లు ప్రసాదం పాడైపోవడం పడేయడం జరిగింది. ఇప్పుడు ఏకంగా చేతివాటం ప్రదర్శిస్తూ దొరికిపోయారు. ఇలా ఆలయ సిబ్బంది ఏదో ఒక విషయంలో వార్తల్లో నిలుస్తూనే ఉన్నారు.



EDITED, PRINTED AND PUBLISHED BY CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI SHARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI T.C. TELTEL01938. FILE NO.1349985
PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com